## సంపుటి



# హరి వేంకటపతి అఖిలం మధురం

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు

## భావదీపిక



శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి వేంకటపతి అఖిలం మధురం

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు

# భావదీపిక

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు M.Tech.**

# హరి వేంకటపతి అఖిలం మధురం

మొదటి ప్రచురణ
**జనవరి 2016**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

**ప్రతులకు :**
**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**
**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

డి.టి.పి. ప్రింటింగ్ ః
**కె.వి.ఆర్.**
**98495 79345**



## అంకితము



ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే కర్తవు. నీవే భర్తవు. నీవే ఆదిమూలము. నేను నిమిత్తమాత్రుడను. అన్నమాచార్యులవారిపై ఆపేక్ష కలిగించిందీ నీవే. నా జీవితగమ్యం ఆయన కీర్తనల వివరణ అని నిర్దేశించిందీ నీవే. 70 ఏళ్ళ ముసలిప్రాణి చేత నీ శృంగార కీర్తనలను వివరింపజేస్తున్నదీ నీవే. దీనితోనైనా నాకు విముక్తి ప్రసాదించు ప్రభూ! నీవునాకు అన్నీ ఇచ్చావు నేను "దాత"కు యేమీయగలను? నాది అనేది ఈ కృతి ఒక్కటే. దీనిని నిర్మలమైన మనస్సుతో నీకర్పిస్తున్నాను.
నేను ధన్యుడను తండ్రీ! ఎందుకంటే...

శా॥ **ఆదిన్ శ్రీసతికొప్పుపై, తనువుపై, అంశోత్తరీయంబుపై,**
**పాదాబ్జంబులపై, కపోలతటిపై, పాలిండ్లపై నూత్నమ-**
**ర్యాదన్‌చెందుకరంబు క్రిందగుట మీదై నా కరంబుంట,మే-**
**ల్గాదే! ప్రాణము గీణమున్ సతతమే! గైకొమ్ము దీనిన్ ప్రభూ!**

# ప్రార్థన

కం॥ శ్రీరమణీ కుచ కుంకుమ
నీ రూపము "నెఱుపు" జేయ నీరజనాభా!
నా రచన "శృతిని మించిన"
కారుణ్యము జూపి నన్ను గరుణించగదే!

ఆ.వె॥ అన్నమయ్య పాట అందదు "మేధకు"
నా స్ఫురణకు తోచి నాకు జిక్కి-
నంతవరకు దీని నందించగలవాడ
"బుధులు" తప్పుగాచి బ్రోవ మనవి

కం॥ హరి వేంకటపతి అఖిలం
బరరే!! "మధురంబు" కాదె! ఆర్యులు పొగడన్
సరియగు"మున్నుడి", "భావము"
గురుడన్నమ కవి పదంబు గొలిచి వచింతున్

ఉ॥ ఎంతని వేడుకోగలను? ఇప్పటికైనను "ముక్తు" జేయరా
సుంత దయైన రాదిటుల శోధనలేల సురేంద్రవందితా?
చెంతకుజేర రమ్మనవు సేదను దీర్చవు, దైనికంబులౌ
చింతలు దీర్చి పెంచెదవు చిత్రపుటాసలు వేంకటేశ్వరా!

సీ॥ ఎవరి కర్మఫలంబులేరీతి నుండునో
యెరిగినదెవ్వండు యీవుదక్క
ఎవరికి పాపమో యెవరికి పుణ్యమో
యెవరెరుంగుదురయ్య నీవుదక్క
ఎవరికి దుఃఖమో యెవరికి సౌఖ్యమో
యెవ్వాడెరుంగును యీవుదక్క
ఎవరికి మరణమో యెవరికి జననమో
యెవ్వడిదెరుగును యీవుదక్క

ఆ.వె॥ ఎంచి జీవకోటి ముంచేవు "భ్రమ"లోన
ఆటనాడుకొనటునాపవయ్యా!
శరణుజొచ్చినాము సర్వేశ్వరా! నీకు
వేదనలను బాపు వేంకటేశ!



చం॥ పదకవితాపితామహుడు పాడిన కీర్తనలందు మాధురీ
సదనములెన్ని చూచితిని చక్కని భావములెన్ని గాంచితిన్!!
కుదురుగనోప్రభూ! సిరులు కోరను వో తిరువేంకటేశ్వరా!
పెదవుల నవ్వులే చలువ వెన్నెల జిల్కిన నేను ధన్యుడన్.

మ॥ కవితన్ జెప్పుట నీవె నేర్పితివి యే కావ్యంబు నే జూచితిన్?
భువిపై పుట్టుక నిచ్చి "పెంచితివి" నాపుణ్యంబదేమో విభో!
భవ బంధంబుల రోసిరోసి వెగటై ప్రార్థించి దిక్కంటిరా
భువనోద్ధారక వేంకటేశ! కృపతో బ్రోవంగ నీ భారమే

శా॥ కారే భోగులు!! భాగ్యముల్ కలుగవే గర్వోన్నతుల్ బొందరే
వారే రీ సిరి వెంటబెట్టుకొని పోవంజాలిరే భ్రాంతులై
వారాజీవ సునేత్ర వేంకటపతీ! వొల్లన్ సిరుల్ సంపదల్
నీ రమ్యంబగు నామ సంస్మరణమున్ నీవిమ్ము నా నాల్కపై

తే.గీ॥ వేంకటేశుని రతికళావిభవమంత
పాడి మురిపించె మధురమౌ "పద కవితల",
అన్నమయ్యకు సాటిలేరయ్య! కవుల
అతని వివరించ నా పుణ్యకతన జుమ్మి!

మత్తకోకిల :

ఒక్కమాటకు పెక్కు అర్థములున్నవీ మధురమ్ములౌ
చక్కనౌ రసస్ఫూర్తి గల్గిన సాటిలేనివి కీర్తనల్
నిక్కు వేంకటనాథు గొల్చెడి నేల నిండిన భక్తులున్
ఎక్కడున్నా అన్నమయ్యకు యెవ్వడైనను మొక్కురా.

# ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని శృంగార వైభవాన్ని వర్ణించగల సామర్థ్యం, నందకాంశ సంభూతుడైన అన్నమాచార్యులకు మాత్రమే వున్నదని నా నిశ్చితాభిప్రాయం. మన ఆత్మయే పుత్రునిగా రూపుదిద్దుకుంటుందని ఆర్యోక్తి. అన్నమయ్య పుత్రుడైన పెద తిరుమలయ్య రచించిన శృంగారకీర్తనలను పరిశీలిస్తే ఆ విషయం సుస్పష్టమవుతుంది. తండ్రి చెప్పినంత అలవోకగా శృంగార రచనతో వేంకటరమణుని, శ్రీ రమణిని మురిపించిన ఘనుడు పెదతిరుమల. తరతరాలుగా హరిని మధుర భక్తితో అలరించిన ధన్యులు తాళ్ళపాక కవులు. అది నా రచన "హరిపై పద్యమే తాళ్ళపాక పదము"లో విపులంగా యెత్తిచూపాను.

ప్రస్తుతం పాఠకులు పరిశీలిస్తున్న యీ రచన "హరి వేంకటపతి అఖిలం మధురం" అన్నమయ్య చెప్పిన శృంగార సంకీర్తనలలో యెన్నుకొన్నవాటికి విశ్లేషణ. ప్రతి కీర్తనకు "మున్నుడి" అనే అవతారికను కూడా జతకూర్చాను. దీనివల్ల కీర్తన మరింత స్పష్టమవుతుందని నా భావన.

అన్నమయ్య శృంగారకీర్తనలతో సమస్య యేమంటే ఆ కీర్తన చెబుతున్నది అన్నమయ్య భావనా రమణియా, శ్రీరమణియా, వేంకటరమణుడా లేక వారి చెలికత్తెలా అన్న విషయం ఒక్కొక్కప్పుడు స్పష్టంగా తెలియదు. అదంత తేలిక వ్యవహారం కాదు.

ఇంకొక సమస్య యేమంటే 15వ శతాబ్ది నాటి రాయలసీమ మాండలిక పదాలు కొన్ని నేటి కాలంలో "లుప్త'మైనవి. రవ్వాశ్రీహరి గారి వంటి భాషాకోవిదుల కృషివలన నాబోటి వారి పని కొంత సుగమమైనప్పటికీ చాలా పదములకు అర్థం ఊహాజనితమే. కొన్ని పదాలకు అనేక నానార్థములుండుటవలన యేది అన్నమయ్య భావమో సుస్పష్టంగా తెలియదు. అందుకనే చాలామంది ఈ కీర్తనలకు "స్థాలీపులాకన్యాయంగా" వివరణనిచ్చారేగాని నాలాగా సాహసించలేదు.

దీనికి అనేక కారణాలున్నా, నేను చెప్పగలిగే నిజాయితీగల కారణం ఒక్కటే. నా వృత్తిగాని, చదువుగాని, అనుభవంగాని ఈ నా రచనకు కారణం కావు, కాలేవు. ఒక ఉదాహరణతో నేను చెప్పేది మీకే అర్థమౌతుంది. "పట్టెమంచము కోటి గుబ్బలు చన్నులంటా పట్టి పట్టి చూచి మోమప్పళించుకొను" అనే ఒక కీర్తన



చరణం, నేటి నవీనకాలం యువతీ యువకులకెలా అర్థమవుతుంది? దీనికి ప్రతిపదార్థ వివరణనిస్తే "బూతు" అనుకునే దౌర్భాగ్యులకు అట్టి వివరణ ఇవ్వకూడదనే పెద్దలు వివరించి వుండరు. అందుకనే నేటికి అన్నమయ్య శృంగార కీర్తనలు వేల సంఖ్యలో మాయమైపోయినా మనకు చీమ కుట్టినట్టన్నాలేదు.

కొందరు మహానుభావుల కృషివలన మనబోటి వారు కొంత స్వాంతన పొందినప్పటికీ నేటి నవీనమైన పరభాషావ్యామోహం వల్ల ఈ స్వాంతన యెన్నాళ్ళుంటుంది అనేది అనుమానాస్పదమే. నేటి కాలం భక్తి, పారమార్థిక భక్తిగాక "పరమ ఆర్థిక" భక్తి అయిపోయింది. సరస శృంగారం "బ్లూ" అయిపోయింది. ఇది ఆధునికుల దురదృష్టం.

కాని అన్నమయ్య కాలంలో, జయదేవుని కాలంలో, క్షేత్రయ్యకాలంలో శృంగారం ఒక కళ. బూతు కాదు. శృంగార కవితతోనే వారు మోక్షాన్ని సాధించారు. దానిని కళలాగా, ఆరాధనలాగ చూడలేని వారికి శృంగారం మోక్ష సాధనం కాదు. అది కేవలం దైహిక సుఖం. అన్నమయ్య రాధామాధవ రతిని నిరతితో ఆరాధించాడు. శ్రీవేంకటేశ్వరుని రతిలీల అలమేలుమంగ విరహం, ఆయనకు మోక్ష సాధనాలయ్యాయి.

ఆ తాదాత్మ్యంలో అన్నమయ్య ఒక్కొక్కప్పుడు దేవికి భావనా చెలికత్తెయై ఆమెకెన్నో సలహాలనిచ్చారు కీర్తనలలో. ఒక్కొక్కప్పుడు శ్రీపతికి చెలికత్తెయై ఆయనకూ మగువ మనస్సును వివరించారు. ఒక్కొక్కప్పుడు తానే దేవుని వలపుకత్తెయై మూగ ప్రేమతో ఆరాధించాడు. మరొకప్పుడు రోషం చూపి పోట్లాడాడు. ఇవన్నీ భక్తిలో తాదాత్మ్యం చెందిన జీవుడు పడే ఆవేదనలే. పరమాత్మ, ఆత్మల "కూటమి"కి అవరోధం కలిగించేది "మాయ". ఇది కూడా పరాయిది కాదు. పరమాత్ముని సోదరి. ఆవిడ పనే ఆత్మ పరమాత్మల కూటమిని ఆపటం. అది క్షేత్రయ్య భావనాతరంగం. అన్నమయ్య తనని స్వామి వలపుకత్తెగా భావించుకొని, దేవిని 'ఆత్మ'వలె విడలేని భార్యగాను, స్వామిని ఆత్మేశ్వరునిగాను ప్రతిపాదించి అనేక విరహ కీర్తనలను చెప్పారు. మాయామోహితుడై సంసార తాపత్రయంలో పడినా తాను నిజంగా వలచింది శ్రీపతినే కాబట్టి స్వామి తనకి తాత్కాలిక "కలయిక" నిచ్చినా చాలనే "కీర్తిస్తుంటాడు".

వారి కలయికలో అన్నమయ్య పాటలోను అకళంక ప్రేమే కాని అశ్లీలం లేదు. "బూతు" ఆలోచన రాదు. అయినా...

ఆ.వె॥ బూతు వలన బుట్టి, బూతుకై వేసారి,
బూతు కొఅకె బ్రతికి, బూతు జరిపి
బూతుతోనె "సంతు భూతాల" పుట్టించి,
బూతు "భూత"మనగ, "బూతు" కాదె!!

ఇక్కడ నా అభిప్రాయం పాఠకులకు తెలియపరిస్తే బాగుంటుంది అని భావిస్తున్నాను. శృంగారకళను "బూతు"గా భావించేవారు "హరివేంకటపతి అఖిలం మధురం" చదవకపోవటమే మంచిది. "కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేలనేడ్చెదో..." అన్న పోతనగారి పద్యం చదివితే, చదువులతల్లి వక్షోజాలు కనుపించే "గ్రంథసాంగులకు" ఈ అమలిన శృంగారంలో "మలినమే" కళ్ళముందుంటుంది. "నేల" "నేడ్చెదో" యేమిటి అనిపిస్తుంది. అటువంటివారు దీనిని చదివి "బాధపడితే" నాదగ్గర ప్రత్యుత్తరం లేదు.

మనబోటి "భక్తులనుకొనేవారికీ" నచ్చని ఇంకొక విషయం, దేవి స్వామిని "ఏరా" అని పిలవటం. శృతిమించిన శృంగారంలో నాయిక తన మగని 'రా' అంటే తప్పులేదని లాక్షణికులేనాడో చెప్పారు.

నిరాకార నిరంజనుడైన జగన్నాథునికి 'ప్రణయతాపం' యేమిటి అంటే అన్నమయ్యను అర్థం చేసికొనే శక్తి మీకు లేదని తెలిసిపోతుంది. అటువంటి వైజ్ఞానికులకు ఇతర మత గ్రంథాలలో భగవంతుని "మహిమల ప్రస్తావన యెలా ఒప్పుగా కనుపిస్తున్నది? ఆ మతాలన్నీ మనిషి తన లోపాలను తాను సరిదిద్దుకోడానికి అవతరించాయి. వాటి దారులు వేర్వేరైనా గమ్యం ఒక్కటే. కానీ హైందవ ధర్మం అనాదిది. భగవంతుని యేరూపంలోనైనా యే విధానంలోనైనా యే భావనతోనైనా ఆరాధించు. ఆ"శక్తి"కి వినమ్రతతో మొక్కు. ఆ"శక్తి" గొప్పదనం కథల ద్వారా స్మరిస్తూ నీ అల్పత్వం గ్రహించి ఆ 'శక్తి'ని ఆరాధించి శరణువేడు, అంటుంది హైందవం.

పోనీ ఈ నామాట విని ఆలోచించండి. "చెన్నై" మహానగరాన్ని కేవలం



పదిరోజుల వర్షం యేడిపిస్తే మనిషి యేమిచేయగలిగాడు? అదే సముద్రం కూడా చేయికలిపితే మానవమాత్రుడేమి చేయగలడు? నరుడు యేనాటికీ పరమాత్మునితో పోటీపడలేడు.

అందుకనే ఈ మిడిమిడి జ్ఞానం లేని మనిషి భగవంతుని తనకు తోచిన విధంగా స్తుతించాడు. శ్రీవేంకటేశ్వరుడు మానాన్న, పద్మావతీదేవి మా అమ్మ అనుకోగల మానసిక పరిపక్వతవుంటే ఇది శృంగారకావ్యం, లేనివారికి మలిన ప్రణయం. తమాషా యేమంటే ఆ పరిపక్వత అందరికీ రాదు. అది చదువులవల్లరాదు. సత్సంగత్యంవల్ల కూడా రాదు. భగవత్కృప వుంటేనే వస్తుంది.

కంచెర్లగోపన్న "నను్రబోవమని చెప్పవే సీతమ్మతల్లీ!" అంటూ, "చక్కంగ మరుకేళి చొక్కియుండెడి వేళ రామయ్య కాదనడమ్మా" అని మొత్తుకున్నాడు. అదీ శృంగారం అంటే. చివరికి రామయ్య ఆయన మాట విన్నాడా లేదా? శ్రీవేంకటపతి అన్నమయ్య మాట విన్నాడా లేదా? ఒకనాడు నామాటకూడా వింటాడు. కాకపోతే యెన్నడో??? చెప్పలేను.

గమనిక : అన్నమయ్య "భావనా సుందరి"కి నేను "అన్నమ్మ" అని పేరు పెట్టాను. ఆమె జాణ, బేల, ప్రేయసి, చతుర, సమర్థురాలు, మంచీచెడూ స్వామికి కూడా చెప్పగల "సాహసి".

Please visit my Website in Google Network

**"www.geetadeeksha.com"** అంతేకాదు **"kinige.com"** వారి **E-Book** లో, నావి 10 పుస్తకాలు (2400) అన్నమయ్య కీర్తనల విశ్లేషణల మిమ్మల్ని అలరిస్తాయి.

TTD వారికి సదా కృతజ్ఞుడను.

"సర్వేజనాః సుఖినోభవంతు"









# హరి వేంకటపతి అఖిలం మధురం

**(సంపుటి III)**

**ఎన్నుకొన్న అన్నమయ్య శృంగార కీర్తనలకు భావదీపిక**

**విషయ సూచిక**


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతేపో నాతో నౌగాదనగ | (వి.శృ) 10.2/88 | 12 |
| 2. | అందరినడగవయ్య అదేమని | 25/327 | 51 |
| 3. | అప్పటినవ్వేవు ప్రహ్లాదవరద | 25/329 | 28 |
| 4. | అటువంటివారమే అందరము | 25/364 | 49 |
| 5. | అవునె లెస్సతగవులాయె | (వి.శృ) 10.2/3 | 22 |
| 6. | ఆటదానికోపమా అంతేసి నీవు | 25/333 | 46 |
| 7. | ఆపె వచ్చినప్పుడన్నీనయ్యా | 25/114 | 31 |
| 8. | ఆసోదకాడవై యంటితివి ముందే | 25/249 | 32 |
| 9. | ఇంకానేల చలము యేమి సేయగలము | 25/162 | 13 |
| 10. | ఇంతలో విచారములింట్లుండెను | 25/328 | 39 |
| 11. | ఇంతలో విచ్చేసితివి యీడకే | 28/318 | 11 |
| 12. | ఇచ్చకమెఱగవద్దా యేమేపతిలాలించ | 28/315 | 07 |
| 13. | ఇదియేమే వీనిగుణమెటువంటిదే | (వి.శృ) 10.2/89 | 05 |
| 14. | ఇహపరములకును ఇది సుఖము | 3/545 | 01 |
| 15. | ఈపాటివాడవు యెట్టుపొందుసేసితివి | 25/460 | 45 |
| 16. | ఎంత చులుకగ జూచేవేమయ్యా | 25/309 | 20 |
| 17. | ఎంతనన్ను బొగడేవు యెటువలె బుజ్జగించేవు | 25/117 | 15 |
| 18. | ఎంతనేరుచుకొన్నది యీచిన్నది | 25/115 | 30 |
| 19. | ఎంత ప్రియాలు చెప్పేవే యేడలేని యాసోదాన | 28/350 | 09 |
| 20. | ఎగ్గువట్టేవు గనక ఇదివో వోయీ | 25/461 | 42 |
| 21. | ఏటికి వేగిరించేరే యెఱగనిదాననటే | 25/306 | 25 |
| 22. | ఏలదాచేరు వలపులిందరు నెరిగినదే | 25/330 | 38 |
| 23. | ఒద్దన్నజలముసేసీనోయమ్మవీడు | (వి.శృ) 10.2/6 | 18 |





| | | | |
|---|---|---|---|
| 24. | కాంతలజేత నిన్నిట్టా కాయగావబోలు | 25/305 | 26 |
| 25. | కాంకలయెప్పటినుండి కాచుకున్నదో | 25/248 | 33 |
| 26. | కొండవంటి దొరతానుగోవిందరాజు | 25/307 | 17 |
| 27. | చల్లరేహరిపైన జాజరజాజ | 28/319 | 03 |
| 28. | చాలుజాలు నేనెరంగనా | (వి.శృ) 10.2/7 | 08 |
| 29. | చూడనిట్టున్నదిగాని జూటుదనమే | 25/119 | 28 |
| 30. | తలడడిసినప్పుడే చలివాసెను | 25/308 | 19 |
| 31. | తనంత వచ్చినదెల్లా తరితీపులౌను | 25/113 | 34 |
| 32. | నీకుజూడవినోదాలై నిండుక వున్నవి | 25/470 | 40 |
| 33. | నీకునాకు నొకడే నెయ్యమైన నాయకుడు | 25/304 | 27 |
| 34. | నీకెప్పుడు నీవోజ నాకైతేనావోజ | 28/317 | 06 |
| 35. | నీవుగోవిందరాజవు నెరజాణవు | 25/462 | 36 |
| 36. | నీవెఅంగనిదాయేమి నేనెంత విన్నవించే | 25/331 | 44 |
| 37. | పాలుదాగే వెన్నదినె బానల పెరుగు | (వి.శృ) 10.2/87 | 14 |
| 38. | మగనికి నాలికిని మర్మములివి | 25/161 | 23 |
| 39. | మమ్మునేల దూరేవే మాటిమాటికి | 25/366 | 37 |
| 40. | మానరా నాతోనింక మరగులు | (వి.శృ) 10.2/4 | 21 |
| 41. | మానుమంటే మీమాటకు మానబోయీనా | 25/365 | 41 |
| 42. | మారుమాటలాడకురే మగుడనాతనితో | 25/334 | 50 |
| 43. | ముంచుకొంటే పొందులెల్లా మొగచాటౌనో | 25/237 | 35 |
| 44. | మేలురాయీనీ గుణము మెచ్చవచ్చును | (వి.శృ) 10.2/5 | 16 |
| 45. | రావే యెక్కడసుద్దిరాపుసేతురా పతిని | 25/332 | 47 |
| 46. | వింటిమికంటిమి నీమాయలు | 3/546 | 02 |
| 47. | వింతదాననా నేను వేమరునింతసేయను | 25/336 | 48 |
| 48. | విన్నపము వినవయ్యా వేసరకుమయ్యా | 25/327 | 52 |
| 49. | విన్నవించేవే వోరమణి విభునికి | (వి.శృ) 10.2/4 | 24 |
| 50. | వేగిరకానికి నేడు వెసలబెట్టమన్నట్టు | 25/469 | 43 |
| 51. | సేసవెట్టిపెండ్లాడి సిగ్గులువడితే బోదు | 28/316 | 10 |

సంఖ్య : 545 సంపుటము : 3 పుట: 366 రాగం : సామంతం

**1 ఇహపరములకును యిది సుఖము**
**సహజావస్థే జరగేటిసుఖము.** ॥పల్లవి॥

**శ్రీరమణుఁడే చింతాయకుఁడని**
**వూరక వుండుట వొకసుఖము**
**కోరకుండఁగా గూడినయర్థము**
**అరయఁ గైకొను టది సుఖము.** ॥ఇహ॥

**వసముగానిపని వడిఁ దలకెత్తుక**
**అసురుసురుగాని దది సుఖము**
**యెసరెత్తుక లేళ్లేవని తోలక**
**పసఁ దనవిధిఁ గలపాటే సుఖము.** ॥ఇహ॥

**పెక్కు చంచలము పెనచుక తిరుగక**
**వొక్క సుఖంబౌ టురుసుఖము**
**యెక్కువ శ్రీవేంకటేశ్వరు శరణని**
**నిక్కితిమిదె మానిజమే సుఖము.** ॥ఇహ॥ **545**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ కీర్తనలో మానవులకు నిజమైన సుఖము యేదో వివరిస్తున్నారు. "పాటు" అంటే "దురవసథ" అని అర్థం. (పాటే : పాటు+యే). లేళ్లు వనంలో తమ ఇష్టం వచ్చినట్లు తిరుగుతాయి. ఆవులను కాచినట్లు వాటిని కాయలేము. పైగా వాటి వెంట పరుగెత్తితే హాని కూడా. అట్లా లేళ్ళను తోలక తన కర్తవ్యం పాటుపడి చేస్తే అదే సుఖము అంటున్నారు.

**భావ దీపిక :**

ఇహము పరములనే రెండిటికీ, ఇది (శరనాగతి) గొప్ప సుఖకరమైనది. ఎవరికైనా తనకేది సహజమో ఆ అవస్థలో వుండటమే జరిగేటి (అనుకూలమైన) సుఖము. శ్రీపతియే చింతాయకుడు (చింతలను పోగొట్టువాడని) వూరక (నిర్లిప్తంగా) వుండటమే వొక సుఖము. జీవించుటకు కావలసిన అర్థము కోరక (అనాయాచితముగా) లభించిన దానిని గైకొనుటయే సుఖము. వసముగానిపని (అసాధ్యమైన పనిని) తలపెట్టి అసురుసురుగాని (బడలికతో ఉసూరుయనకుండుటే) సుఖము. ఎసరెత్తి (విజృంభించి) వనిన్ లేళ్ళే (లేళ్ళనే) తోలక (కాపలాకాయుటకు యత్నించక) పసన్ (సమర్థతతో) తన విద్యుక్తధర్మమైన) పాటే (ఇబ్బందియే) సుఖము. అనేక చంచలములైన సుఖములను పొందాలని తిరుగులాడక నిశ్చలంగా వుండటమే ఉరుసుఖము (ఘనమైన సుఖము). గొప్పవాడైన శ్రీవేంకటేశ్వరుని శరణని నిక్కితిమి (అతిశయించితిమి). ఇదే మాకు నిజమైన సుఖము.



సంఖ్య : 546 సంపుటము : 3 పుట: 367 రాగం : లలిత

**2 వింటిమి నీకతలు కంటిమి నీమాయలు**
**బంటుల మచ్చుత నీపాలివారమయ్యా.** ॥పల్లవి॥

**కలిగిరి నీవల్లనే కడఁగి బ్రహ్మాదులు**
**నిలిచిరి సురలెల్లా నీవల్లనే**
**తెలిసిరి మునులెల్లా దేవుఁడవు నీవేయని**
**చలపట్టి హరి నీకు శరణనేమయ్యా.** ॥వింటి॥

**నుతియించీ వేదములు నోరార నీమహిమ**
**గతి యాయ వైకుంఠమే ఘనులకెల్లా**
**ప్రతిలేనినీరూపే భావించేరు యోగీంద్రులు**
**తతితో శ్రీపతి నీకే దాసులమయ్యా.** ॥వింటి॥

**ఆదె నీచక్రముచేత నడఁగి రసురలెల్లా**
**బదికిరి విప్రులు నీపాదసేవను**
**పొదలి శ్రీవేంకటేశ పొంది నీకరుణచేత**
**మొదల వెనక నీకే మొక్కేమయ్యా.** ॥వింటి॥ **546**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ అధ్యాత్మకీర్తనలో అచ్యుతుని మాయాచాతుర్యాన్ని వివరిస్తున్నారు. స్వామీ మేము నీ బంట్లము, నీబాంధవులము. బ్రహ్మాది దేవతలంతా నీవల్లనే సృజించబడ్డారు. వేదములు నిన్నె నుతిస్తున్నాయి. నీ రూపము ప్రతిలేనిది. అసురులందరూ నీ చక్రము వల్లనే నశించారు. మొదల వెనక మొక్కటమంటే యేమిటి?

**భావ దీపిక :**

ఓ అచ్యుతా! మేము నీ కథలనెన్నెన్నో విన్నాము. నీ మాయలను మరెన్నో కన్నాము. మేము నీ బంట్లుమయ్యా! మేము నీపాలిటివారము (బంధువులము). అతిశయించిన బ్రహ్మాదులు నీవల్లనే కలిగిరి. దేవతలందరూ నీవల్లనే నిలదొక్కుకున్నారు. మునులందరూ నీవే పరమాత్ముడవని గ్రహించిరి. ఓ శ్రీహరీ! చలపట్టి (కృతనిశ్చయుడనై) నీకే మేము శరణంటిమయ్యా! చతుర్వేదములు నోరార నీమహిమలనే పొగడినవి. ఘనులైనవారందరికీ నీ నెలవైన వైకుంఠమే గతియైనది. యోగీంద్రులందరు ప్రతిలేని (సాటిలేని) నీ రూపమునే తమ చిత్తములందు భావించేరు. ఓ శ్రీపతీ! తతితో (యుక్తముగ) నీకు శరణంటిమయ్యా! నీ చక్రాయుధముచేత రాక్షసులందరూ నశించిరి. నీపాద సేవవలన విప్రులు (సజ్జనులు) బ్రతికిరి. ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయించి పొందిన నీ కరుణచేత ముందుగాని వెనుకగాని నీకే మొక్కెదము స్వామీ!

సంఖ్య : 319 సంపుటము : 28 పుట: 211 రాగం : శంకరాభరణం

**3 చల్లరే హరిపై జాజరజాజ**
**చల్లఁగా సరసపు జాజరజాజ** ॥పల్లవి॥

**సతతపు వలపుల జాజరజాజ**
**చతురుల మాటల జాజరజాజ**
**సతమగు నవ్వుల జాజరజాజ**
**జతనపు సిగ్గుల జాజరజాజ** ॥చల్ల॥

**సముకపు కొసరుల జాజరజాజ**
**సమరతికరఁగుల జాజరజాజ**
**జమళి తమకముల జాజరజాజ**
**సమయని యాసల జాజరజాజ** ॥చల్ల॥

**జడియని పంతపు జాజరజాజ**
**సడఁగుల చేఁతల జాజరజాజ**
**జడిగొనుచెమటల జాజరజాజ**
**జడగొను పెనఁగుల జాజరజాజ** ॥చల్ల॥

**చలముల వొట్ల జాజరజాజ**
**సలిగెలపగటుల జాజరజాజ**
**చలువల వినయపు జాజరజాజ**
**సళుపుల చూపుల జాజరజాజ** ॥చల్ల॥

**సంగడి మూఁకల జాజరజాజ**
**జంగిలి మతకపు జాజరజాజ**
**సంగాత మమరిన జాజరజాజ**
**సంగతియెరికల జాజరజాజ** ॥చల్ల॥

**సారపు మోవుల జాజరజాజ**
**సారెకుఁ బొలసేటి జాజరజాజ**
**సౌరుచి మెచ్చుల జాజరజాజ**
**జారతనంబుల జాజరజాజ** ॥చల్ల॥

**సందడి కొలువుల జాజరజాజ**
**సందుల వొత్తుల జాజరజాజ**
**చందురుపాటల జాజరజాజ**
**సందె చీఁకటుల జాజరజాజ** ॥చల్ల॥

**చాలుకొను సతుల జాజరజాజ**
**జాలివిరహముల జాజరజాజ**
**చాలామరిగిన జాజరజాజ**
**చౌలూరించే జాజరజాజ** ॥చల్ల॥



**చనుఁగవ గురుతుల జాజరజాజ**
**చనవుల కొసరుల జాజరజాజ**
**యెనసెను శ్రీవేంకటేశ్వరుఁడీతని**
**చనుమానంబుల జాజరజాజ** ॥చల్ల॥ **319**

**మున్నుడి :**

వసంతకాలంలో యువతీయువకులు వసంతములాడుకోవటం ఒక వేడుక. హోళీ పండుగలో రంగులు చల్లినట్లే ఒకరిపైనొకరు వసంతం చల్లుకొంటారు. వంచనతో వసంతం చల్లటం తరచూ జరిగేదే. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడు రమణులతో జాజరనాడిన వైనమంతా సుదీర్ఘమైన కీర్తనలో వివరిస్తున్నారు. జాజరజాజ అనేది “ఊతపదంగా” అంటుంటారు.

**భావ దీపిక :**

ఓ రమణులారా! యీ హరిపైన చల్లరే జాజర. చల్లని రంగునీటి జాజర సరసమునకు ప్రతీక.

శాశ్వతమైన వలపుల ఆట ఈ జాజరజాజ. చతురుల మాటలు (చలోక్తులు) విరివియైనదే జాజర. సతమగు (ఆయాసంతో) నవ్వులు చిలికించేదే జాజర. జతనపు (తెచ్చిపెట్టుకొన్న) సిగ్గుల పంట జాజరజాజ.

సముకపుకొసరుల (యెదురుగా వుత్తుత్తి కసురుకొనే) పండుగే జాజర. సమరతిలో జంటలు కఱగిపోయే వేడుకే జాజర. జమళి తమకము (జంటలతన్మయత్వమే) జాజర. సమయని (తీరని) ఆశలవెల్లువే జాజర.

జడియని (భయపడని) పంతములుగల జాజరజాజ. సడగులచేతల (అశ్లీపుపనులు) చేసె జాజర ఇది. జడిగొనుచెమటల (చెమటల చిత్తడి) యీజాజర. జడ పట్టుకొంటే పెనగులాడేదే జాజరజాజ.

చలములవొట్ల (పట్టుదలతో ఒట్లుపెట్టుకొనేదే) జాజర. సలిగెల పగటుల (మితిమీరిన చనవుతో పోట్లాటలు తెచ్చేదే) జాజర. చలువల వినయపు (వినయంతో చల్లబరిచేదే) జాజర. సలుపులచూపుల (వాడిచూపులతో బెదరింపు గలదే) జాజరజాజ.

సంగడి మూకలు (స్నేహితుల గుంపులు) చల్లేదే జాజర. జంగిలి మతకపు (అల్లరి చిల్లరి మాయలు) మెండైనదే జాజర. సంగాత మమరినదే (చెలిమికూడి వున్నదే) జాజర. సంగతియెరికల (చేరికలున్నట్లు తెలిసేదే) జాజరజాజ.

సారపుమోవుల (రుచికలిగిన పెదవుల) జాజర. సారెకు బొలసేటి (ప్రతిసారి దగ్గరయ్యేదే) జాజరజాజ. సౌరుచి మెచ్చుల (అందమైన పొగడ్తలు కలిగినదే) జాజర. కొంత జారత్వంకూడా వున్నదే జాజర.

సంగడికొలువుల (సమూహంగా కొలువుతీరేదే) జాజర. సందుచూచికొని హత్తుకొనేదే జాజరజాజ. రాత్రుళ్లు చంద్రునిపై పాట పాడేదే జాజర. సందెచీకట్లలో చెలరేగేదే జాజరజాజ.

చాలుకొను సతులు (వరుసగా నిలుచున్న యువతులు) కలిగినదే జాజర. జాలివిరహముల (బాధించే విరహముల) వెల్లువే జాజర. చాలా మరిగిన (మిక్కుటముగా అలవాటుపడినదే) జాజరజాజ. చౌలూరించేదే (ఎంతో మధురమైన అనుభవాలే) జాజర.

చనుగవలు గుర్తులతో నిండిపోయేదే జాజర. కొసరికొసరి చనువులు చూపించేదే జాజరజాజ. శ్రీవేంకటేశ్వరుడు అతిశయించినాడు. ఆయన చనుమానంబులు (పెత్తనం చెలాయించేదే) జాజరజాజ.

(ఇది శ్రీవేంకటపతి చలువ వలన దీక్షితులు పొందిన స్ఫురణ)

సంఖ్య : 89 సంపుటము : 10.2 పుట: 51 రాగం : ముఖారి

**4 ఇది యేమె వీనిగుణ మెటువంటిదే**
**వదలక నవ్వ నూరవదినెనా నేను ॥పల్లవి॥**

**చక్కనివాఁ డైతేఁ దానె చల్లఁగా నుండుఁ గాక**
**యిక్కడ నెవ్వరి భ్రమయించ వచ్చీనె**
**వక్కణలమాఁటలకు వలచి వెంటఁ దిరుగ**
**తక్కరి రేపల్లె గొల్లదాననా యేమి ॥ఇది॥**

**పాయపువాఁడైతేను బదుక నీవె యిట్టె**
**కాయక మై యెవ్వరిపైఁ గన్ను లార్చీనె**
**సోయగ మై తనమోము చూచి నట్టె మోహించి**
**పాయకుండ మేనవారిపడుచనా నేను ॥ఇది॥**

**నేరుపరి దా నైతె నెమ్మది నుండుఁ గాక**
**కేరి కేరి యెవ్వరిపైఁ గేలు చాఁచీనె**
**చేర వచ్చి నెల్లూరి శ్రీవెంకటనాథుఁ డిట్టె**
**యీరీతినె నను గూడె యిందిరనా నేను ॥ఇది॥ 89**

**మున్నుడి :**

నెల్లూరులో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై శృంగారకీర్తన వినిపిస్తున్నారు చినతిరుమలయ్య. నాయిక తన చెలియతో స్వామి ఆగడాల గురించి వాపోతున్నది. "ఈతని గుణము యెటువంటిదా? ఇదేమిటే? నన్ను చూచితేచాలు తెగ నవ్వుతాడు. నన్ను 'ఊరవదినె' (వేశ్య) ననుకొన్నాడాయేమి? యెంత తెంపరితనము? ఆయన చక్కదనం ఆయననే వుంచుకోనీయవే. నాకేమిటి? ఎంత జాణగాడైతేమాత్రం నెమ్మదిగా వుండాలిగాని అందరిపై చెయ్యివేస్తానంటే యెట్లాగే"? అంటున్నది.

**భావ దీపిక :**

ఓ చెలులారా! ఇదియేమే? వీని గుణము యెట్టిదో తెలియరాకున్నది. వదలకుండా నాతో నవ్వుతాడు. నేను 'వూరవదినె'నటే?(ఊరివారందరికీ లొంగే వేశ్యనటే?). తాను చక్కనివాడైతే చల్లగా వుండమనండే. ఇక్కడకు యెవ్వరిని భ్రమపెట్టాలని వచ్చాడే? వక్కణల (వ్యాఖ్యానాల) మాటలు విని వలచి లొంగిపోవటానికి మేము రేపల్లె గొల్లెతలము కామని, వెంటదిరిగే ఆ 'టక్కరి'కి చెప్పండే. ఎలప్రాయమువాడైతే సంతోషంగా బ్రతకమనండే. కాయకమై (జీవకళవున్న) దేనితోనైనా కన్నులు కలుపుతాడే. ఎంత సోయగమున్నా తన ముఖము చూడగానే మోహించేసి వదలకుండ వుండటానికి నేనేమన్నా 'మేనవారిపడుచునా'? (మేనమరదలునటే?) తాను నేరుపరి (జాణ) అయితే కానివ్వండే. నెమ్మదిగా వుండమనండి. కేరికేరి (నవ్వులకు) యెవ్వరి మీదనైనా చేయివేస్తాడేమే? నెల్లూరిలో వెలసిన శ్రీవెంకటనాథుడు సులువుగా ఇట్లు నన్ను కూడుటకు నేనేమైనా ఆయన లక్ష్మీదేవినటే?



సంఖ్య : 317 సంపుటము : 25 పుట: 212 రాగం : లలిత

**5 నీకెప్పుడు నీవోజ నాకైతే నావోజ**
**చేకొని యీరెండూనుచెల్లు నిదే మనకు ॥పల్లవి॥**

**యేమగువలమాట కెంత నీవు లోనైనా**
**నీమాటలోనిదాన నే నెప్పుడు**
**చేముట్టి నీ వెవ్వరిచేఁ జెనకించుకొనినాను**
**ఆముక నీచేతికి లోనైనదాన నేను ॥నీకె॥**

**నంటున నేయింతులతో నవ్వులు నీవు నవ్వినా**
**గొంటరి నీనవ్వులకు గురి నేను**
**ఇంటింట నీవెవ్వరికి యిచ్చకములు సేసినా**
**జంటైననీ కిచ్చకము జరపుదు నేను ॥నీకె॥**

**కందువ నే వేసతులకాఁగిటి కాసపడినా**
**అంది నాయాసలు నీపై నంటింతును**
**ఇందరి శ్రీవేంకటేశ యెనసి నన్నేలితివి**
**పొందుసేసి నీతోను భోగించితి నేను ॥నీకె॥ 317**

**మున్నుడి :**

ఈ కీర్తన చెప్పే నాయిక దేవి కావచ్చును లేదా అన్నమయ్య భావనా నాయిక కావచ్చును. ఈ పాటలోని 'ఓజ' అనే మాటకు అనేక అర్థాలున్నప్పటికీ ఇక్కడ సరిపోయే అర్థము 'స్వభావము'. నాయిక యేమంటున్నదంటే నీస్వభావం నీది నా స్వభావంనాది. ఈ రెండూ న్యాయమేనేమో అనిపిస్తున్నది. నీవలపుకత్తెలు అసంఖ్యాకులు. నేను నీ చేతిలోనిదానను. నీకేది ఇష్టమైతే అదే చేస్తావు. పోనీలే ఇందరిలోనూ నన్నేలితివి స్వామీ! నా భోగము నాది, అంటున్నది.

**భావ దీపిక :**

స్వామీ! నీకైతే నీవోజ (స్వభావము) నాదైతే నాస్వభావం. ఎంచిచూస్తే మనకు యీ రెండూను చెల్లును (న్యాయమైనవే). నీవు యెంత వలమాటకు (చాంచల్యానికి) లోనైనా యేమగునయ్యా? నేనెప్పుడు నీమాటకు లోబడివుండేదాననే.కావాలని నీవెవ్వరిచేత చెనకించుకొనినా (లొంగతీసికొనబడినా), ఆముక (గాఢముగా) నీకు స్వాధీనమైనదానను. నిన్ను నేనేమనగలను? నీవు అంటున (ఆకర్షణతో) యే యింతులతో నవ్వినా, నీ గొంటరినవ్వులకే (దిట్టతనంతో నవ్వినా) నేనూ లొంగిపోయాను. ఏ ఇంటిలో నీవెవ్వరితో ఇచ్చకములాడినా నేనూ నీకు జంటయై ఇచ్చకము జరుపుదునుగాని జగడముసేయను. నిన్ను నేనేమనగలనయ్యా? కందువ (యేకాంతంలో) నీవు ఏ సతి కౌగిటిలో దూరాలని ఆశపడినా, నా ఆశలన్నీ నీపైనే పెట్టుకొన్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతమంది వలపుకత్తెలు నీకుండగా నన్నే యెన్నుకొని నాతో పొందుసేసి నీతో భోగించాను. ఇంకా నేను కోరునదేమున్నది ప్రభూ!

సంఖ్య : 317 సంపుటము : 28 పుట: 210 రాగం : రామక్రియ

**6 ఇచ్చక మెఱఁగవద్దా యేమే పతి లాలించఁగా**
**రచ్చ వేసేవు వలపురాఁపులివి యేలే** ॥పల్లవి॥

**సరుస నాతఁడు నీమై జవ్వాది వూయ రాఁగా**
**సరి వెనఁగేవు యింత చలములేలే**
**పరగి జారిన నీ పయ్యద చక్కఁ గప్పఁగా**
**కరము బిగ్గెఁ బట్టేవు కక్కస మింతేలే** ॥ఇచ్చ॥

**మన్నించి యాతఁడు నీతో మంచి మాఁట లాడఁగాను**
**సన్నల జంకించేవు యీసణఁగులేలే**
**మిన్నక కొసరి తనమీఁద నానవెట్టఁగాను**
**పన్ని నోరుమూసేవు పంతా లింత యేలే** ॥ఇచ్చ॥

**మొక్కలాన నాతఁడు నీమోవితేనె లానఁగాను**
**వుక్కు గోర నూఁదే వింత వుద్దండాలేలే**
**చెక్కు నొక్కి నిన్ను నిట్టె శ్రీవేంకటేశుఁ డేలఁగా**
**మొక్కుచు వీఁగేవు వట్టి మొఱఁగు లిఁకేలే** ॥ఇచ్చ॥ **317**

**మున్నుడి :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై ఆమెకు నచ్చచెబుతున్నారు. స్త్రీ మనస్తత్వాన్ని కాచివడబోసిన పదకవితాపితామహుని భావన లఖిలం మధురం. ఏమే నీ పతి నిన్ను లాలించగా ఆతని కోర్కెలేవో తెలుసుకోవద్దా? ఆయనను రచ్చజేస్తున్నావు. నీకు వలపులో కూడా యింత సంఘర్షణ యెందుకే అంటున్నారు. ఇంతాచేసి శ్రీపతి నిన్నేలుకోగానే దాసోహమని లొంగిపోతావు ఈ భాగ్యానికి యింతెందుకే?

**భావ దీపిక :**

ఏమే (దేవీ!) నీపతి నిన్ను లాలించగా, ఆతని ఇచ్చకము (ప్రీతినిచ్చేది) యేదో యెఱుగవద్దా? రచ్చవేసేవు (ఆతనిని రచ్చకీడుస్తున్నావు.) నీకింత వలపురాఁపులు (ప్రేమ సంఘర్షణలు) యెందుకే? అతగాడు సరసముగా నీపై జవ్వాది వూయ (వ్రాయుటకు) యత్నించగా యెదిరించి పెనగులాడేవు. నీకింత చలమేలే (మొండితనమెందుకమ్మా?). ఆయన జారిన నీపైట సవరించి చక్కగా కప్పబోతే ఆయన చేతిని బిగపట్టెదవు. ఇంత కక్కసము (కర్కశత్వం) నీకు యెందుకమ్మా? మన్నించి (జరిగినది క్షమించి) ఆతడు నీతో అనునయంగా మాట్లాడితే. సన్నలుసేసి సైగలతో ఆతనిని బెదరించెదవు. నీకింత ఈసణుగులేలే? (ఈసడింపులు యెందుకే?) పన్ని నోరుమూసేవు (కావాలని మౌనంగా వుండేవు). నీకింత పట్టుదలలెందకమ్మా? ఆతడు మొక్కలాన (కొంచెం మోటుగా) నీ అధరామృతం జుఱ్ఱుకొంటే నీవుక్కుగోళ్ళు తాకించి ఆతనిని వూదేవు (గీరితివి). ఇంత తెగింపు చేయవచ్చునా? శ్రీవేంకటేశ్వరుడు నీ చెక్కిలి నొక్కి నిన్నేలుకొన్నాడు. వెంటనే ఆతనికి మొక్కి లొంగిపోయావు. దీనికి ఇంత మొఱుగులు (ప్రగల్భాలు) యెందుకమ్మా?



సంఖ్య : 7 సంపుటము : 10.2 పుట: 4 రాగం : శంకరాభరణం

**7 చాలుఁ జాలు నే నెరంగనా నాఁడు నాఁడె**
**ఆలరి నీసుద్దు లెల్ల నన్నీఁ గంటిని** ॥పల్లవి॥

**సారె సారె నన్ను నేల పిలిచేవు**
**యేరా నీ వలపు నే నెరఁగనిదా**
**వూరకె యింకా నేలరా మాఁటలనె**
**దూరేవు నీసుద్దు లెల్ల తొల్లె కంటిమి** ॥చాలు॥

**సన్నలు సేసే వేమిరా యెరఁగనా**
**చిన్ననాఁడె నీచేఁత లెల్లాను**
**చన్నులుముట్టే వేమిరా నాలికాఁడ**
**వున్నతి నీ సుద్దు లెల్లా నిన్ననె కంటిమి** ॥చాలు॥

**దగ్గరి చేయి వట్టేవురా యెప్పుడును**
**నిగ్గుల నీచల మెల్లా నేనెరఁగనా**
**అగ్గమై శ్రీవెంకటనాథ కడపలో**
**దగ్గరి నన్నుఁ గూడఁగా తలఁ పెల్లాఁ గంటిమి.** ॥చాలు॥ **7**

**మున్నుడి :**

కడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు చినతిరుమలయ్య. నాయిక యేమని దెప్పుతున్నదో వినండి. చాలు చాల్లే నీగురించి నేనెరుగనా? నీ అల్లరి సంగతులన్నీ యేనాడో చూచినాములేవయ్యా! అని అంటున్నది. స్వామి చేసే చిలిపి పనుల గురించి వినాలంటే భావదీపిక చదవక తప్పదు.

**భావ దీపిక :**

స్వామీ! చాలు జాలు, నీ సుద్దులు (కథలు) నేను యెరుగనా? నాడునాడే (ఏనాడో) నీ ఆలరి (అల్లరి) నెల్లా నేను కంటిని లేవయ్యా! సారెసారె (ప్రతిసారి) నన్నెందుకు పిలుస్తావు? ఏమిరా, నీవలపు యెట్టిదో నేనెరుగనిదా? ఊరకే (వుత్తుత్తి) మాటలెందుకురా? పైగా నిందలు యెందుకురా? నీకథలన్నీ ఇదివరకే తెలుసునులే. నేనెరుగని వ్యవహారమా? సన్నలు (సైగలు) యెందుకు చేస్తావురా? నా చిన్నప్పటినుంచి నీచేతలు తెలుసుకొన్నాను. నాలికాఁగ (అమాయకుడిలాగా) నా కుచములను తాకెదవేమిరా? ఉన్నతిన్ (చాలా గొప్పగా) నీ కథలన్నీ నిన్ననే నేను తెలిసికొన్నాను. నా దగ్గరకు వచ్చి చేయిపట్టుకొంటావు. నిగ్గుదేరిన నీ చలము (మొండితనం) అంతా నేనెరుగనిదా? కడపలో వెలసి నాకు అగ్గమై (అధీనుడవైన) వో శ్రీవేంకటేశ్వరా! నాకు దగ్గరవాడవై నన్ను కూడితివి. ఆనాడే నాకు నీతలపెల్లా తెలిసిపోయింది.

సంఖ్య : 320 సంపుటము : 28 పుట: 223 రాగం : అమరసింధు

**8** ఎంత ప్రియాలు చెప్పేవే యేడలేని యాసోదాన
వింత లే కాతఁడు గారవించెనంటాను ॥పల్లవి॥

చెక్కులేల నొక్కేవే చిత్తమేల కలఁచేవే
మిక్కిలి పతితో మందెమేళానను
వక్కణ లెన్నడిగేవే వాడికేమి చూపేవే
మక్కువ నాతఁడు నిన్ను మన్నించెనంటాను ॥ఎంత॥

చన్నుల నెంత వొత్తేవే సరసమే మాడేవే
సన్నల నాతఁడేలిన సలిగెలను
విన్నపా లెంత సేసేవే విడే లెన్ని యిచ్చేవే
పన్నిక యాతఁడు నీపై బత్తిగలఁడంటాను ॥ఎంత॥

పచ్చిగా నెంత నవ్వేవే పైకొని యేల చొక్కేవే
యిచ్చ నాతఁడు గూడిన యెమ్మెలను
తచ్చి శ్రీవేంకటేశుఁడు తానే నిన్ను మరగించె
వచ్చి యెంత తగిలేవే వలచెనంటాను ॥ఎంత॥ **320**

**మున్నుడి :**

ఈ శృంగార కీర్తనలో అన్నమయ్య దేవికి ఆంతరంగిక చెలికత్తె. ఈ అన్నమ్మకు దేవి దగ్గర అమితమైన చనువు వుంది. 'నాకెంత ప్రియమైన వార్త చెబుతున్నావమ్మా? అంతులేని కోరికతో అతగాడు (స్వామి) బిడియం వదలివేసి నిన్ను మన్నించాడా?' అని, స్వామి తననేమి చేశాడో దేవి తనపై "చూపుతుంటే..." అబ్బురపడి ఈ కీర్తన పాడింది అన్నమ్మ.

**భావ దీపిక :**

దేవీ! ఎంత ప్రియాలు చెప్పేవే!! (ఎంత ప్రియమైన వార్త చెబుతున్నావమ్మా!!) యేడలేని (యెక్కడాలేని) ఆసోదాన (కోరికతో) ఏమాత్రమూ వింతలేక ఆతడు (స్వామి) నిన్ను గారవించీనా (బాగుగా మన్నించాడా?). నీపతితో మందెమేళాన (చనవుగా) వుండి ఆతని చెక్కిలినెందుకు నొక్కావమ్మా? ఆతని మనస్సు నెందుకు కలచితివమ్మా? వక్కణలెన్నడిగేవే (యెన్ని వివరాలు అడిగావమ్మా!!) ఎంత చొరవ చూపావమ్మా!! మొత్తానికి అతడు మక్కువతో నిన్ను మన్నించాడన్నమాట. దేవీ! ఆతడేలిన సలిగెలను (స్వామి ఇచ్చిన స్వాతంత్ర్యంతో) నీవు "సన్నల" (చీకటిపడగానే) నీ చన్నులనెంత వొత్తేవే!! ఆతనితో యెంత సరసమాడేవే!! ఆతని పొందుకై యెంత విన్నపాలు సేసేవే!! ఆహ్వానతాంబూలాలనెన్ని ఇచ్చేవే!! ఆతడు నీపై శ్రద్ధ చూపిస్తున్నాడని యెంత యోచించావమ్మా!! ఇచ్చతో (కోరికతో) ఆతడు నీతో యెమ్మెల (విలాసముగా) కూడినాడని యెంత పచ్చిగా నవ్వావమ్మా!! అతిశయించి యెంత పరవశించావే!! శ్రీవేంకటేశుడు తానే నిన్ను మరిగించెనని, తానేవచ్చి నిన్ను వలచినాడని యెంత తగిలేవే (స్పృశించేవే!!).



సంఖ్య : 316 సంపుటము : 28 పుట: 209 రాగం : నాదరామక్రియ

**9** సేసవెట్టి పెండ్లాడి సిగ్గులు వడితేఁ బోదు
బాసయిచ్చి నీకితఁడు బత్తిసేసీని ॥పల్లవి॥

మనసిచ్చి యాతనితో మాఁటలాడఁగదవే
వినయాన ని న్నతఁడు వేఁడుకొనీని
పెనఁగక ప్రియములే పెంచి పెంచి చూపవే
మునుకొని చుట్టరికములే సేసీని ॥సేస॥

వేడుకతో నీమోవి విందు లిట్టె పెట్టవే
వోడక నీతోపొందు లొనరించీని
జాడతోడ వీనులారా సమ్మతించి వినవే
వాడికెతో మేనబావ వావులు చెప్పీని ॥సేస॥

యింటిలో నీబలమెల్లా నితనికిఁ జూపవే
జంటయై నీకాఁ (కాఁగి?) టిలో సాముసేసీని
నంటు శ్రీవేంకటుశుఁ డున్నతిఁ గూడె మెచ్చవే
పెంటలైన రతులను పెచ్చు వెరిగీని ॥సేస॥ **316**

**మున్నుడి :**

ఈ శృంగారకీర్తనలో అన్నమయ్య 'అన్నమ్మ'గా మారి దేవికి కొన్ని ముఖ్యమైన సలహాలనిస్తున్నారు. దేవీ! తలంబ్రాలుపోసి పెండ్లి చేసికొనినప్పుడు లేని 'సిగ్గు' ఇప్పుడు పడితే పోతుందా? "నాతిచరామి" అని బాస యిచ్చి ఆతడు (స్వామి) నీకు బత్తిసేసేనే (అనురాగం చూపిస్తున్నాడమ్మా!) నీవు మనసిచ్చినవాడు నీ మేనబావ. మీ ఇంటికి వెళ్లాక నీ బలమేమిటో చూపుదువుగాని.నీ జతగాడు నీ కౌగిట్లో "సాము" చేసీని, మెచ్చవే పెంటలైన రతులను పెచ్చుపెరిగీని... అంటే??

**భావ దీపిక :**

ఓ దేవీ! సేసెవెట్టి (తలంబ్రాలుపోసి) పెండ్లాడి, ఇలా సిగ్గులు పడితే, పోదు (కుదరదు). నీకు ఇతడు (స్వామి) బాస ఇచ్చి (నాతిచరామి అనే ప్రతిన చేసి) బత్తి సేసీని (అనురాగము చూపుతున్నాడు). దేవీ! నిన్నతడు యెంతో వినయంతో వేడుకొంటున్నాడు. ఆతనితో మనసిచ్చి మాట్లాడవమ్మా! ఆయనతో పెనగక (పోట్లాడక) నీప్రేమను పెంచి పెంచి చూపవమ్మా! అతగాడు మునుకొని (తానే ముందుకు వచ్చి) బంధుత్వం కలుపుకొన్నాడుకదా! దేవీ! వేడుకతో ఆతనికి నీ అధరామృతపు విందునందించవమ్మా! ఓడక (వెనుదీయక) నీతో సమాగమమునకు సహకరించవమ్మా! జాడతో (ఉపాయముతో) నీచెవులారా అతను చెప్పేదంతా వినవమ్మా! ఆతను చెప్పేదీ అబద్ధం కాదు. మీ ఇద్దరికీ మేనరికం వుందనే సంగతి చెబుతున్నాడు అంతే కదా! మీ ఇంటిలో అతనికి నీబలమెల్లా (సత్తానంతా) చూపించవమ్మా! ఎందుకంటే... నీ జత చేరి నీ కౌగిట, సాముసేసీని (సాము చేస్తాడు కదా!) ఉన్నతుడై శ్రీవేంకటేశ్వరుడు చేరువై నిన్ను కూడి మెచ్చినాడు. పెంటై (సమృద్ధిగల) రతులలో పెచ్చుపెరిగీని (అతిశయించినాడమ్మా!)

సంఖ్య : 318 సంపుటము : 28 పుట: 211 రాగం : సామంతం

**10 ఇంతలో విచ్చేసితివి యీడకే మగువఁ జూడు**
**కాంత ఇదె నీరాక గాచుకొని వున్నది ॥పల్లవి॥**

**వుమ్మగిలు జెమటలు వూరిచి కొనగోరను**
**చిమ్ముచు నీ సుద్దలే చెలితోఁ జెప్పె**
**కమ్మటి సంతోసాన కలికి కన్నుల నవ్వు**
**కుమ్మరించుకొంటా నీగురుతులే చూపె ॥ఇంత॥**

**పొంచి పొంచి నిట్టూర్పులు పుక్కిళ్ల నాఁచి యాఁచి**
**నించుకొంటా చెలితోడ నిన్ను సొలసె**
**వంచిన శిరసుతోడ వలపు పులకలతోఁ**
**బెంచి పెంచి నిన్నునే పేరుకొని పొగడె ॥ఇంత॥**

**నిలువు నివ్వెరగుతో నీరూపు మదిలోన**
**తలఁచి నీకు చెలి ముందరనే మొక్కె**
**వెలఁదిఁ గరుణతో శ్రీవేంకటేశ కూడితివి**
**నెలకొన్నరతుల నీనేరుపెల్లా మెచ్చెను ॥ఇంత॥ 318**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామితో దేవి ఆంతరంగిక చెలికత్తెయై, దేవి మదనతాపాన్ని వివరిస్తున్నది. ఇంతలోనే నీవు వచ్చావు స్వామీ! పాపం ఈ మగువను చూడు. ఈ కాంత నీరాకకోసం యెలా యెదురుచూస్తున్నదో!! నిలువునా సంభ్రమంలో మునిగిపోయి నీరూపాన్ని మనస్సులోనే ధ్యానించి నీకు మొక్కుతున్నదయ్యా! ఈమెను కనికరించు ప్రభూ! అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! ఇంతలో నీవే ఈ మగువను జూడ ఇటు విచ్చేసితివి. ఈ కాంత నీరాకకై యెదురు చూచుచున్నదయ్యా! ఉమ్మగిల్లిన (వుబికివస్తున్న) తన చెమటలను తన కొనగోటితో "వూర్చి" చిమ్ముతూ మేము చెప్పే నీ సంగతులన్నీ వింటుంది. కమ్మటి సంతోషం తన కన్నులలో కుమ్మరిస్తూ ఈ కలికి (యువతి) నీవు తన మేనిపై చేసిన గుర్తులన్నీ మాకు చూపించిందయ్యా! తన పుక్కిళ్ళ (నోటితో) వుండివుండీ నిట్టూరుస్తూ, మళ్ళీ అంతలోనే ఆపి ఆపి వొక్కసారిగా వూపిరి పీల్చుకొంటూ ఈ రమణి సొలసె (అలసిపోతున్నది) స్వామీ! కొంచెము వంచిన శిరస్సుతో వలపులో కలిగిన పులకరింతలతో నిన్నే యెంతో యెక్కువగా పొగడుచున్నదయ్యా! నిలువునా నివ్వెరగుతో (సంభ్రమంతో) నీ రూపాన్నే తన మనస్సులో ధ్యానిస్తూ నీకు మా చెలి మొక్కుతున్నదయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే ఈ వెలదిని కరుణించి కూడితివి. మీమధ్య నెలకొన్న రతులలో నీ నేర్పరితనాన్ని మాదేవి యెంతో మెచ్చుకొన్నదయ్యా!



సంఖ్య : 88 సంపుటము : 10.2 పుట: 51 రాగం : పాడి

**11 అంతేపో నాతోడ నౌఁ గా దనఁగ రాదు**
**పంతమాడి గెలిచితే బంట వయ్యేవా ॥పల్లవి॥**

**కానీ లేరా పొడుపుడుఁగతలు వొడువు మని**
**ఆనవెట్టి న న్నేల అడ్డగించేవు**
**పూని నా కతలు నీకుఁ బొందుగాఁ దెలియకుంటే**
**పానిపట్టి నీవె నా బంట వయ్యేవా ॥అంతే॥**

**చలపటి (ట్టి?) నాతోడ సరిబేసు లాడు మని**
**బలిమి నాకొం గేల పట్టి తీసేవు**
**వొలిసి ని న్నిప్పుడె వోడించితే నాతోడఁ**
**బలుమాఁట లేల నాబంట వయ్యేవా ॥అంతే॥**

**నీవు దలఁచిన సుద్ది నిక్కి నన్నుఁ జెప్పు మని**
**కావించి మండెమురాయ కాఁగిలించేవు**
**శ్రీవెంకటనాథుఁడవె చెలఁగి నీ వనుచు నీ**
**భావ మెరిఁగి కూడితి బంట వయ్యేవా. ॥అంతే॥ 83**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగారకీర్తన పల్లవిని నేటి భాషలో చెప్పాలంటే ఇలా వుంటుంది. స్వామీ! నీవు నాతో పందెంవేసి నేను గెలిస్తే నాబంటవవుతావా? అంతే పోవయ్యా! ఆ తరువాత తిరస్కరించకూడదు మరి. మండెమురాయడైన నృసింహునితో ఇంత గట్టిగా మాట్లాడగలిగినది చెంచులక్ష్మి కాక మరెవరండీ? అన్నట్లు ఆ నరహరి కూడా తిరుమల వేంకటనాథుడేనంట.

**భావ దీపిక :**

మందెము అనే వూరిలో వెలసిన ఓ నృసింహా! నేనెవరనుకొన్నావు? నాతో ఔగాదన రాదు (అడ్డు చెప్పరాదు). అంతే పో (అటులనైతే, పో) నాతో పంతమాడి గెలిచితే (పందెంవేసి నేను గెలిస్తే) నీవు నాబంటుగా వుంటావా, మరి? అది సరే! నేను వేసిన పొడుపుకథలు విప్పుతానని, పొడవుమని ఆనపెట్టి నన్నెందుకు అడ్డగిస్తున్నావు? ప్రయత్నించీ, నా కథలు నీకు చక్కగా తెలియకపోతే పానిపట్టి (పూని) నీవు నాబంటువవుతావా? చలపట్టి (మొండితనంతో) నీవు నన్ను నీతో 'సరిబేసి' అనే ఆటనాడమని నాకొంగును నీవు బలంగా యెందుకు పట్టుకొంటావు? పలుమాటలేల (అన్ని మాటలెందుకు?) నేను నిన్ను ఇప్పుడే ఓడిస్తే నా బంటువవుతావా? నీవు మనస్సులో అనుకొన్న సుద్ది (మాటను) చెప్పమని కావించి (అన్నీ తెలిసిన వాడివి కావున, అదే అయ్యేట్లు చేసి పందెంగెలిచి) నన్ను కౌగలించేవు. ఓ మండెపునృసింహా! నీవు నిజానికి శ్రీవేంకటేశ్వరుడవు కావున నీవు అదే నాకు చెప్పి నా భావమెరిగి నన్ను కూడితివి. ఇకనైనా నాబంటువయ్యేవా?

సంఖ్య : 162 సంపుటము : 25 పుట: 108 రాగం : శంకరాభరణం

**12 ఇంకానేల చలము యేమి సేయఁగలము**
**అంకెకు వచ్చెను అధరామృత ఫలము ॥పల్లవి॥**

**కలికి వనాలనీడఁ గడు నీ కెదురుచూడ**
**కులుకునవ్వులతోడఁ గొప్పు వీడ**
**చెలులెల్లాఁ జూచేరు జిగిఁ గౌను లసియాడ**
**బలిమిఁ జేకొనవయ్య బత్తితోఁ గూడ ॥ఇంకా॥**

**సతి నీపాదాలు మెట్ట చన్నులు నీవు ముట్ట**
**తలి నిన్ను నిదె దిట్టతనాలఁ దిట్ట**
**అతివలు సొలసేరు అంగాలఁ జెమట దొట్ట**
**సతతము మెచ్చవయ్యా జాణలు చేపట్ట ॥ఇంకా॥**

**జలజాక్షి నీపక్క సరసముల వే చొక్క**
**తలపోసీఁ దనచక్కఁదనాలు నిక్క**
**లలి శ్రీవేంకటేశ నీలలన నీకు మొక్క**
**కలకాల మేలు మిక్కడ రతికెక్క ॥ఇంకా॥ 162**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనను స్వామివారిపైన మరియు శ్రీదేవిపైన చెబుతున్నారు. చక్కటి అంత్యప్రాసలతో కూడిన ఈ కీర్తనలో ఆయన స్వామికిలా నచ్చచెబుతున్నారు. ఇంకా నీకింత మొండి పట్టుదలయైతే మేమేమి చేయగలమయ్యా? ఆమె నీకు స్వాధీనమైనది కదా! ఆమె అధరామృతం నీదేకదా! నీ లలన నీకు మొక్కుతున్నదయ్యా కలకాలమిక్కడే రతికెక్క యేలుకొనవయ్యా! అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీకు ఇంకా చలముయేలనయ్యా (మొండిపట్టుదల యెందుకయ్యా?) నీదేవి నీ అంకెకు వచ్చెను (స్వాధీనమైనది). అలాగే ఆమె అధరామృతఫలముకూడా నీదే అయినది. ఆ కలికి (దేవి) వనాలనీడ (గుబురు చెట్ల నీడలో) మనోహరమైన నవ్వులతో నీకోసం యెదురుచూచుచున్నది. ఆమె చెలులు చూస్తుండగానే కొప్పు విడిపోయింది. జిగిన్‌కౌనులసియాడినది (కాంతివంతమైన ఆమె నడుము కదలాడినది). నీవు బలిమితో దగ్గరకు తీసికొంటే ఆమె నిన్ను పరమ ప్రేమతో కూడుతుంది. ఆ సతి నీ పాదాలను తాకితే నీవామె కుచగిరులను తాకినావు. ఆమె తత్తరజెంది పైకి రోషంతో తిట్టింది. సర్దిచెప్పలేక అతివలు (ఆమె చెలులు) అలిసిపోయారు. వాళ్ళ శరీరాలన్నీ చెమటతో ముద్దఅయిపోయాయి. ఆ జాణలు నీచేయిపట్టి నచ్చచెబుతుంటే ఇకనైనా మెచ్చవయ్యా! స్వామీ! ఆ జలజాక్షి నీపక్కన జేరి సరసములాడగా అలిసిపోయింది. అంతలోనే తన చక్కదనాలను తలచుకొని అతిశయించినది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ లలన, లలితో (ప్రేమతో) నీకు మొక్కినది. ఇక్కడ, యీ తిరుమలలో రతికెక్క ( ప్రసిద్ధికెక్కి) కలకాలము ఆమెను యేలుకోవయ్యా!



సంఖ్య : 87 సంపుటము : 10.2 పుట: 50 రాగం : హిందోళం

**13 పాలు దాగె వెన్న దినె బానల పెరుగు జుట్టె**
**సోలి కాఁగులనేతులు చూరలాడె నమ్మా ॥పల్లవి॥**

**చిన్నవాని ఆరడి సేసినట్లు వుండుఁ గాని**
**యెన్నెన్నిపోకిళ్ళఁ బొయ్యీ యీకృష్ణుఁడు**
**కన్నెలు ముద్దాడఁబోతే గంటి సేసి మోవు లెల్ల**
**తన్నుఁ గానట్టున్నాఁడు దయ్యపువాఁడమ్మా ॥పాలు॥**

**తగినపడిబిడ్డనిఁ దతిగొన్న ట్టుండుఁ గాని**
**యెగసక్కె లెన్ని నేర్చె యీగోవిందుఁడు**
**మగువ లెత్తుకొంటేను మరి గోళ్ళువెట్టి తానె**
**తగవులు చెప్పెఁ గతలకారోయమ్మా ॥పాలు॥**

**పలుదూరులు బాలునిపైఁ జెప్పిన ట్టుండుఁ గాని**
**కలికివాఁడమ్మ శ్రీవెంకటనాథుఁడు**
**చెలులు కాఁగిలించితే సిగ్గు వీడఁ గూడి కూడి**
**వలపించినాఁడు యెటువంటివా డోయమ్మా. ॥పాలు॥ 87**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన శృంగార కృష్ణలీలనాస్వాదించండి. వాడు (కృష్ణయ్య) చేసే సాధారణమైన అల్లరి ఒకయెత్తు, వాడు గోపకన్నెలతో చేసే అల్లరి ఇంకొకెత్తు. ఎంత "దయ్యపువాడు"!! అంటున్నారు. "కతలకారి" వాడట. పోనీలే మనవెంకటనాథుడే కదా! అని కౌగలించుకొంటే యేమిచేశాడో తెలుసా? కొంచెం ఓపిక పట్టండి మరి...

**భావ దీపిక :**

ఈ బాలకృష్ణుడు చేసిన అల్లరినేమని చెప్పగలము? మాపాలు త్రాగి, వెన్నలనన్నీ మెక్కి, బానల నిండావున్న పెరుగు జుఱ్ఱుకొని తిన్నాడు. కాగులనిండా వున్న నెయ్యిని చూరలాడినాడమ్మా! (కొల్లగొట్టాడమ్మా!) మేము చెబుతే చిన్నపిల్లవానిని అల్లరిపెట్టినట్లు వుంటుందికాని, ఈకృష్ణుడు యెన్నెన్ని పోకడలు పోతాడో తెలుసా? కన్నెపిల్లలు వాణ్ణి ముద్దాడబోతే పెదవులు కొరికి గంట్లు పెడతాడు. ఇప్పుడు నీతో (యశోదతో) చెబుతుంటే తన గురించి కాదన్నట్లున్నాడు చూడవమ్మా! ఎంత "దయ్యపువాడమ్మా నీకొడుకు"? బుద్ధిమంతుడైన పసిబిడ్డని తతిగొన్నట్లు (అతిగా చెప్పినట్లుంటుందిగాని) ఈ గోవిందుడు, యెన్ని యెగసక్కెలు (వికటపుమాటలు) నేర్చినాడో తెలుసా? మగువలెత్తుకొంటే తెలియకుండా గోళ్ళతో గీరి తానే వాళ్ళమధ్య తగవులు పెట్టి యేవేవో మాయ మాటలు చెప్పే కతలకాడు (కథలరాయుడు). ఎన్నో నిందలు బాలునిపై వేసినట్లు వుంటుంది కాని, ఈ శ్రీవేంకటనాథుడుకలికివాడు (గొప్ప నేర్పరి) కదటమ్మా!!! చెలులు కౌగలించుకోగానే సిగ్గులు దూరంచేసి వాళ్ళందర్నీ వలపించి మరీ కూడి తీరతాడు. బాబోయ్ వీడు యెటువంటివాడమ్మా!!!

సంఖ్య : 117 సంపుటము : 25 పుట: 78 రాగం : సావేరి

**14 ఎంత నన్నుఁ బొగడేవు యెటువలె బుజ్జగించి**
**వింతదానవా నీకు వినయపుటాలను ॥పల్లవి॥**

**కోరికతో మగఁడు యేకోమలితో నవ్వినాను**
**నేరము లెంచనిదే నెలఁత**
**అరజాన తనమేన జీరలు దీయించుకొంటే**
**గారవించి పచ్చడానఁ గప్పినదే మగువ ॥ఎంత॥**

**వేడుక యేసతిమీఁద విభునికిఁ గలిగినా**
**తోడుకవచ్చినదే తొయ్యలి**
**కూడేవేళ యెంతేసియెక్కుడు ప్రియాలు చెప్పినా**
**ఆడుకోక వుండినదే అంగన ॥ఎంత॥**

**పచ్చిగా రమణుఁడు యేపడఁతిఁ బెండ్లాడినాను**
**ఇచ్చకమై యుండినదే ఇంతి**
**ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**నిచ్చలు నావంటిదే నీకు దేవులు ॥ఎంత॥ 117**

**మున్నుడి :**

అన్నమయ్య అన్నమ్మగా మారి తన ప్రియుడైన శ్రీవేంకటేశునితో తను స్వామికి వినయంగల భార్యనని తనని అంతగా పొగడవలసిన పనిలేదని తను స్వామికి పరస్త్రీని కానని చెబుతున్నారు. మగనికి ప్రియమైన 'ఆలి' యెలా వుండాలో వివరిస్తున్నారు. నేడు నన్నుయేలితివి బాగానే వున్నది, కానీ నీకు నీదేవేరి అలమేలుమంగ నిత్యమూ నావలె అలరించేదే కదా! స్వామీ! అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నన్నెంత పొగడెదవు? యేవిధముగా బుజ్జగించుచున్నావు! ఇదేమి? నేనునీకు వింతదాననా (కొత్తదాననా?) నేను నీ వినయపుటాలిని (అణకువగల ఇల్లాలిని). మగవాడు కోరికగలిగి యే భామతో నవ్వినా నేరములెంచనిదే నిజమైన భార్య. ఆరజాన (విలాసపురుషుడై) తన వంటిపైన నఖక్షతముల దీయించుకొనినా ఆ మగనిని గౌరవించగలిగి పచ్చడాన (వస్త్రముతో) కప్పినదే తగిన మగువ. తన మగనికి యేసతిమీదనైనా వేడుక కలిగినచో ఆ మగువను తనవెంట తోడుకవచ్చి (పెట్టుకొనివచ్చి) వారిని కలుపగలిగినదే మంచి తొయ్యలి. భర్త తనతో రమించువేళ యెంతెంత ఇచ్చకముల జెప్పినా ఆడుకొననిదే (నిందించనిదె) అణకువగల అంగన. పచ్చిగా (బహిరంగంగా) తన పతి మరియొక పడతిని పెండ్లాడి ఆమెతో పతి ఇష్టానుసారముగా వ్యవహరించేదే నిజమైన ఇంతి. జగన్నాథుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నావంటి మానవ కాంతను కూడా యేలుకొన్నావు. నీ దేవేరికూడా నిత్యమూ అనుకూలయై నావలెనే నిన్ను ఆరాధించుచున్నది.



సంఖ్య : 5 సంపుటము : 10.2 పుట: 3 రాగం : పాడి

**15 మేలురా యీనీగుణము మెచ్చవచ్చును**
**పోలించ నీచేఁత పూఁట పూఁట కొత్తేకాదా ॥పల్లవి॥**

**దిట్టయై యెవ్వతెయైనాఁ దిట్టినా నవ్వేటి నీవు**
**యెట్టు నేఁ బొగడినాను యీరసించేవు**
**యిట్టె వలపించేవా రేమ్న (మ?) నినాఁ జెల్లుఁగాక**
**నెట్టన నేనూరకున్నా నీకు నెగ్గేకాదా ॥మేలు॥**

**తొయ్యలి యెవ్వతెయైనాఁ దోకినా నవ్వేటి నీవు**
**యియ్యెడ నేమెక్కినాను యేవగించేవు**
**నెయ్యపువారిచేఁతలె నీకు నితవౌఁగాక**
**చయ్యన నామోహమైన చప్పనెకాదా ॥మేలు॥**

**వొదుగ కెవ్వతె గైకోకుండినా నవ్వేటి నీవు**
**యెదురుకొన్నా నామో మిటుచూడవు**
**యిదె శ్రీవెంకటనాథ యిట్టె నన్నుఁగూడి నా**
**మదిలోఁ బాయవైతివి మంచిదెకాదా. ॥మేలు॥ 5**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక స్వామిని యెలా దెప్పుతున్నదో చిత్తగించండి. ఈ పల్లవినే ఈనాటి తెలుగులో చెప్పాలంటే ఇలా వుంటుంది. స్వామీ! నీ యీగుణాలు యెంతమేలైనవిరా! యెంత మెచ్చుకోవచ్చును? నీచేతలు పోలికలేనివి. అవి యేపూటకాపూట కొత్తగానే వుంటాయి. పరాయి దెవ్వతె తిట్టినా, యెవ్వతె నిన్ను ముంచినా నీకు లొంగకపోయినా దానిమీద నీకు వలపు. నాలాంటిది నీకెందుకులే? అయినా...

**భావ దీపిక :**

స్వామీ! మేలురా (బాగుందిరా!) నీయీగుణమును యెంత మెచ్చుకోవచ్చునురా? నీచేత (నీవు చేసేపనులు) పోలించ (పోల్చిచూస్తే) పూటపూట (యేపూటకాపూట) కొత్తగానే వుంటాయి కదా! దిట్టయై (ధైర్యం తెచ్చుకొని) యెవ్వతైనా నిన్ను తిట్టితే నవ్వేనీవు, నేను నిన్ను పొగడినా యెట్లా యీరసించేవు (కోపిస్తున్నావు?) నిన్ను సులువుగా వలపించేవారు యేమనినా చెల్లుతుంది కాబోలు. నేను వూరకేవున్నా నీకు తప్పే అవుతున్నదా? ఎవ్వతెయైనా తొయ్యలి (మానిని) నిన్ను తోకినా (నిలువునా ముంచినా) నవ్వేసే నీవు, నేను భక్తితో మొక్కినా యేవగింపు చూపుతున్నావు. నీకు నీ సన్నిహితుల పనులన్నీ హితవుగా అనిపించును కాబోలు. చెలరేగిన నామోహముమాత్రం నీకు చప్పగా వుంటుంది. ఎవ్వతెయైనా వొదుగక (అణుకువలేక) నిన్ను తన చేతులతో చుట్టేస్తే చిరునవ్వులు నవ్వే నీవు, నేను నీయెదురుగా నిలబడిన నా ముఖము చూచుట లేదు. కాని నేడు నాపై అనుగ్రహం కలిగిన శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడితివి. ఆపైన నన్ను విడువకుంటివి ఇది నాకు మంచిదే కదా!

సంఖ్య : 307 సంపుటము : 25 పుట: 205 రాగం : సౌరాష్ట్రం

**16** కొండవంటిదొర దాను గోవిందరాజు। తన-
గుండె రాఇగాదా తొల్లి గోవిందరాజు ॥పల్లవి॥

చేరి తనపాదాలు చేకొని పిసుకఁగానే
కూరిములు గొసరీని గోవిందరాజు
నేరుపుతోఁ జెప్పినట్టె నేము నిట్టె సేయఁగానే
గోరిచీని వలపులు గోవిందరాజు ॥కొండ॥

చప్పుడు గాకుండాను సరసములాడితేను
కుప్పళించీ పెంజెమట గోవిందరాజు
ముప్పిరిఁ చేతులెత్తి మొక్కఁగాను పచ్చిదేర
గొప్పగొప్ప మాటలాడీ గోవిందరాజు ॥కొండ॥

గరిమల నిద్దరముఁ గాఁగిలించుకొంటేను
కురిసీ మోవితేనెలు గోవిందరాజు
ఇరవై శ్రీవేంకటేశుఁడీతఁడే నేము గూడితే
గొరబుసేసీఁ జన్నులు గోవిందరాజు ॥కొండ॥ **307**

**మున్నుడి :**

తిరుపతిలో నెలకొన్న గోవిందరాజస్వామిపై శృంగారకీర్తన చెబుతున్నారు అన్నమయ్య. కీర్తన పాడుతున్నది శ్రీదేవి భూదేవి. ఈ స్వామి కొండవలె ఉన్నతుడు. తన ఇరువురి భార్యలు చేరక మునుపు ఆయన గుండెరాతివలె కఠినమైనదే కాని నేడు ఆ ఇరువురిని కౌగలించగానే ఆయన బహు చిలిపి వేంకటేశుడై యేమిచేశాడో తెలియాలంటే భావదీపిక చదివితీరాల్సిందే.

**భావ దీపిక :**

ఈ గోవిందరాజు కొండవలె సమున్నతుడైన దైవము. తొల్లి (భూరమాకాంతలు ఆయనను కూడక పూర్వము) ఈ స్వామి గుండె రాయి గాదా! (కఠినమైనదే కదా!) ఈ గోవిందరాజు తన సతులమైన మేము పాదములను పిసుకగానే తన వలపులను కొసరి కొసరి చూపినాడు. నేర్పుతో యేము (మేము) ఆయన చెప్పినట్లే చేయగా తన వలపులను 'గోరిచీని' (కొంచెము కొంచెము గోకి గోకి రుచిచూపినాడు). చప్పుడు కాకుండా మేము సరసములాడితే మాకు పెను చెమటలు కుప్పళించీని (కారిపోవునట్లు చేసినాడు). ముప్పిరి (అతిశయించి) మేము చేతులెత్తి మొక్కగానే ఆఱడి మాటలతో గొప్పగా అలరించినాడు, యీ గోవిందరాజు. మేమిద్దరమూ గరిమల (ఆయనను మధ్యలో వుంచి కౌగలించగానే మాకు అధరామృతం రుచి చూపాడు. శ్రీవేంకటేశుడై తిరుమలపై నెలకొనినదీ యీతడే. ఈ గోవిందరాజు మేము ఆయనను కూడినంతనే మా చన్నులపై గొరబుసేసీని (అల్లరి చేసినాడు.)



సంఖ్య : 6 సంపుటము : 10.2 పుట: 4 రాగం : పాడి

**17** ఒద్దన్నఁ జలము సేసీ నోయమ్మ వీఁడు ॥తన॥
వుద్దండా లెంతైన మానఁ డోయమ్మ వీఁడు ॥పల్లవి॥

యేపుమీరి నాతోడ నెగసక్కె లాడీని
వో పో పొమ్మన్న మానఁ డోయమ్మ వీఁడు
పై పై నన్నుఁ జెనకి బలిమి సేయవచ్చీనే
నోపనన్నాఁ గొంగువట్టీ నోయమ్మ వీఁడు ॥ఒద్ద॥

సారెకుఁ బేరఁ బిలిచి సన్నలు సేయవచ్చీని
వూరకపోయెటి నన్ను నోయమ్మ వీఁడు
నేరుపరి నంటానె నిండువావి సేసుకొనీ
వోరిచిన నెరఁగఁడు వోయమ్మ వీఁడు ॥ఒద్ద॥

యేలుకొన్నవానివలె నెవ్వరుంటా నెరఁగఁడు
వేలవేయవచ్చీ నాపై నోయమ్మ వీఁడు
నాలికాఁడు శ్రీవేంకటనాథుఁడు నన్ను నిట్టె
వోలివెట్టకె కూడె నోయమ్మ వీఁడు. ॥ఒద్ద॥ **6**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో ఆయన స్వామి జవరాలై తన నెచ్చెలితో తన ప్రియుని ఆగడాలను వివరిస్తున్నారు. ఓయమ్మా! వీడు (స్వామి) ఒద్దన్నా, మాట వినడు. తన పంతము వదలడు తన అఘాయిత్యం మానడు. ఏలుకొనే మగని వలె యెవరున్నా పట్టించుకొనడు. నాపై లేనిపోని నిందలు వేస్తాడు. ఇదంతా కూటమి జరిగేదాకానే అనుకో.

**భావ దీపిక :**

ఓయమ్మా! వీడు (స్వామి) ఒద్దన్నా వినడు. చలముసేసీని (పంతముపట్టి వదలడు). పైగా, తన ఉద్దండాలను (అఘాయిత్యాలను) యెంతైనా (యేమి జరిగినా) మానడు. వీడు నాతో యేపుమీర (హద్దుదాటి) యెగసక్కేలు (పరాచికాలు) ఆడుతాడు. పోపొమ్మన్నా మానడే, వోయమ్మా! నా తనువు పైపైనా తాకి బలాత్కారం చేయబోతాడు. నాకిష్టంలేదన్నా వీడు చీరె కొంగు వదలమంటే వదలడే, వోయమ్మా! ప్రతిసారి పేరన్ పిలిచి (పేరుపెట్టి పిలుస్తాడు). సౌజ్ఞలు చేస్తాడు. ఊరకేపోయే నన్ను అలావేధిస్తాడు. ఓయమ్మా! తను నేర్పరినని చెపుతూనే నిండువావి (పూర్తిగా సంబంధం) పెట్టుకొంటాడు. ఓరిచిన (ఓర్పును) యెఱుగడు. ఏలుకొనేవాని (తాళికట్టిన మగని) వలె యెవరున్నా చూడడు. ఓయమ్మా! వోలవేయవచ్చీని (నిందలు వేయాలని చూస్తాడు). ఈ శ్రీవేంకటేశుడు నాలికాడు (మోసకారి ప్రియుడు). నన్ను ఓలివెట్టకే (కన్యాశుల్కం కట్టకుండానే) కూడినాడే, వోయమ్మా!

సంఖ్య : 308 సంపుటము : 25 పుట: 206 రాగం : మాళవి

**18** తల దడిసినపుడే చలి వాసెను
చెలరేఁగుటేకాక సిగ్గువడేవా ॥పల్లవి॥

గొల్లెతలు నీవును గోకులములో నుండి
అల్లిఁ దామెరలవలె నల్లుకొంటివి
వెల్లవిరిగా నే నెంత వెంగెము లాడినాను
చెల్లుబడులేకాక సిగ్గువడేవా ॥తల॥

అగడుగ మరియుఁ బదారువేలసతులతో
తగుఁదీవెలు మాఁకులై తగిలితివి
తగదని నే నెంత తప్పులు ని న్నెంచినాను
జిగిమీరుదువుగాక సిగ్గువడేవా ॥తల॥

భావించఁగా నీ వప్పటిఁ బట్టపుదేవుళ్లతోడ
పూవునుఁ బుప్పొడియై పొందితివి
యీవల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చేవదేర నే నవ్వితే సిగ్గువడేవా ॥తల॥ **308**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో నాయిక స్వామితో యేమంటున్నదో ఆలకించండి. నీవు చెలరేగితేనే బాగుంటుంది. నిండా మునిగినవానికి చలియేమిటననేమి? తలదడిసినవానికి చలివుండదు అంటున్నది. నీవు నీ దేవేరులు పూవు పుప్పొడివలె జంటగానే వుంటారు. మిమ్మల్ని చూచి నేను (అన్నమయ్య) నవ్వితే నీవేల సిగ్గుపడతావు స్వామీ!

**భావ దీపిక :**

స్వామి! తలదడిసినప్పుడు, ఇంకా చలియేమి? అది (సిగ్గు) యేనాడో పోయింది. నీవు అంతగా చెలరేగి ఆపైన సిగ్గుపడుట దేనికయ్యా? ఆనాడి నీకృష్ణావతారములో నీవూ గోపికలను అల్లిదామెర (తెల్లకలువపూవుల) వలె నున్నవారిని అల్లకొని పోయావు. వెల్లివిరి (బాహాటముగా) నేను యెంత వెంగెములాడినా (వ్యంగముగా మాట్లాడినా) దక్షతతో వుండక సిగ్గుపడేవేలనయ్యా? అగడుగా (పేరాశతో) నీవు పదియారువేలమందిని, చెట్టును అల్లుకుపోయిన పూతీగవలె తగులుకొంటివి. నీవు జిగిమీరెదవు (అతిశయించేవు) కాని సిగ్గుపడేవా? ఆలోచించి చూస్తే ఆనాటి నీ సతులు (శ్రీదేవి భూదేవి) యెట్లావున్నారంటే పూలు పుప్పొడి వలె విడదీయలేనివారైరి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇటీవల నీవూ నన్ను కూడా యేలితివి. చేవగొని నేను నవ్వితే నీకు సిగ్గయిందా స్వామీ?



సంఖ్య : 309 సంపుటము : 25 పుట: 207 రాగం : దేశాక్షి

**19** ఎంత చులుకఁగఁ జూచే వేమయ్య నీవు
కాంత నీపై వలపులు గద్దెము వేసీనా ॥పల్లవి॥

చనవు గలుగఁగాను సారెకుఁ గొసరీ నింతి
మనసు నీకు రాకున్న మాటలాడీనా
చెనక రాఁగా నీచేతులు దాఁ బట్టెఁగాక
వెనవెనకకుఁ బోతే వెన్నడించీనా ॥ఎంత॥

సమ్మతించి నీవుండఁగా సరసమాడె నీపె
కొమ్మ నీకు వేసటైతే గోర గీరీనా
రమ్మనఁగా నీతొడపై రమణి గూచుండెఁగాక
వుమ్మడి నీ వూరకుంటే వొద్దికి వచ్చీనా ॥ఎంత॥

కందువకు నీవు రాఁగాఁ గాఁగిలించుకొనెఁ జెలి
పొందు నీకు లేకుండితే భోగించీనా
విందుగా మోవియ్యఁగా శ్రీవేంకటేశ కూడెఁ గాక
సందడిఁ బరాకైతే చలపట్టీనా ॥ఎంత॥ **309**

**మున్నుడి :**

'గద్దెము' వేయుట అంటే బలవంతం చేయుట అని అర్థం. అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో ఆయన దేవిని సమర్థిస్తూ స్వామికి నచ్చచెబుతున్నారు. ఇదేమిటయ్యా! నీవు కాంతను యెంత చులకనగా చూస్తున్నావు? ఆమె నీపై వలపుతో బలవంతం చేసినదా? అంతమాత్రానికే నీవు మాట్లాడక బిగిసిపోతే యెలాగయ్యా? అంటున్నారు. "సందడి బరాకైతే చలపట్టీనా"... అంటే యేమిటి?

**భావ దీపిక :**

స్వామీ! నీవు దేవిని యెంత చులుకగ (చులకనగా) చూచేవేలనయ్యా? ఆ కాంత నీపై వలపులు గద్దెమువేసీనా (బలవంతంగా కుమ్మరించేనా?) అందేమి నేరమున్నదయ్యా? నీతో యెంతో చనువు వుందికాబట్టి ప్రతిసారీ చిరాకు కలిగితే కొసరీని (కసురుకొంటూ వుంటుంది). నీపై మనస్సు లేకపోతే తానే నీతో మాట్లాడుతుందా? నీవు ఆమెను తాకబోతే తాను నీచేతులు పట్టుకొన్నది అంతేకాని నీవు వెనకాడితే నిన్నేమన్నా వెంబడించిందా? ఈపె (ఈమె) నీవు సమ్మతితో వున్నావని కొంత సరసమాడింది. ఆ కొమ్మకు (యువతి) నీవంటే విసుగైతే నీకు నఖక్షతాలు చేస్తుందా? నీవు రమ్మని పిలువగానే వచ్చి నీతొడపై కూచున్నది. మీరు జంటగా వున్నప్పుడు నీవు వూరకుంటే మీకు మధ్య అనుకూలత యెలా యేర్పడుతుందయ్యా? స్వామీ! నీవు కందువకురాగా (ఏకాంతమునకు రాగానే) ఆమె నిన్ను కౌగలించినది. నీపై పొందులేకుంటే నీతో భోగించగలదా? నీకు తన అధరామృతమును విందు చేస్తుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ తనను చుంబించావని నీతో కూడినది అంతేగాని నీవు పరాకుజూపితే తాను చలపట్టీనా (పగబట్టిందా?)

సంఖ్య : 4 సంపుటము : 10.2 పుట: 3 రాగం : పాడి

**20 మానరా నారో(తో?) నింక మరఁగులు**
**పోనీనెంతైనా నిన్ను బొంకకు నాతోను ॥పల్లవి॥**

**గుఱుతైన యాకెమేనికుంకుమపరిమళము**
**మెరయ నేఁటికిరా నీమేనియందును**
**మెఱుఁగు నీమేనిమీఁద మించిన కెంపేలవచ్చె**
**పొఱపొచ్చముల నీవు బొంకకు నాతోను ॥మానరా॥**

**లలనపాదానను్న లత్తుక నీనొసలను**
**కలుగ నేమిటికి వేగనచెప్పరా**
**కలికిపుక్కిటనున్న కప్పురపుఁ దమ్ములము**
**పొలుపై నీకేలవచ్చె బొంకకు నాతోను ॥మానరా॥**

**పడఁతి నీమేన నిట్టె బాగుగానించినయట్టి**
**జడిగొన్న కొనగోళ్లజాడ లేదవి**
**కడఁగి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి**
**పొడవైనచెలిసుద్ది బొంకకు నాతోను. ॥మానరా॥ 4**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి స్వామి శరీరంపై రకరకాల గుర్తులను చూచి, ఆ "పడతి" (చిన తిరుమల భావనా సుందరి)తో జరిపిన శృంగారం ఈ గుర్తులు తెలుపకనే తెలుపుతున్నాయి. ఇకనైన నాతో బొంకకురా! ఇంకనైనా ఈ చాటుమాటు వ్యవహారాలు మానరా! ఆమె నీ ఒంటిపై చేసిన గుర్తులు కనబడుతూనేవున్నాయి అని నిగ్గదీసింది. అప్పుడా మదనగురుడు యేమి చేశాడు?? కోప, తాపాలలో నాయిక నాయకుణ్ణి "రా" అనినా తప్పు లేదు.

**భావ దీపిక :**

ఇంకనైనా యీమరగులు (చాటుమాటు పనులు) మానరా! ఇవ్వాళ నిన్ను యెంతైనా (యేదియేమైనా) పోనీయను. నాతో బొంకవద్దు. ఆకె (చినతిరుమల) శరీరంపై నించిన కుంకుమ గురుతైన పరిమళం (గొప్ప సువాసన) నీమేని మీద యెందుకు మెఱయుచున్నదిరా? నీ ఒంటిమీద మెఱిసే ఆ "కెంపురంగు" యెట్లా వచ్చింది? పొఱపొచ్చముల (పొరబాట్లతో) కనబడుతూనే ఇంకా బొంకకురా! ఆ లలన (భామిని) పాదాలకు పూసిన లత్తుక (పారాణి) నీ నొసటిపై యెందుకున్నదో "ఠక్కున" చెప్పరా! ఆ కలికి (సుందరి) నోట్లో వుంచిన పరిమళపు కర్పూరతాంబూలం నీచేతిపై మరకలుగా యెందుకు కనుపిస్తున్నది? ఇంకా నాతో బొంకకురా! ఆ పడతి నీ ఒంటిపై బాగుగా నించిన (నింపివేసిన) కొనగోటిగాట్లు స్పష్టంగా కనబడుతూనే వున్నాయి. ఏదియేమైనా, యెందరు నిన్ను కావాలనుకొన్నా, నీ కరుణకు పాత్రులై నిన్ను పొందినా శ్రీవేంకటనాథా! నీవు నన్ను కూడినప్పుడు నీకు నాపైగల ప్రేమ తెలిసిపోతూనేవుంది. అంతులేని నీ ప్రియురాళ్ళ కథలతో బొంకకురా!



సంఖ్య : 3 సంపుటము : 10.2 పుట: 2 రాగం : సామంతం

**21 అవునె లెస్సతగవులాయనె నేఁడు**
**తివిరి నీకింత నాతో దీకొనఁగవలెనా ॥పల్లవి॥**

**మాఁటలఁ దేలించనేర్చుమగువా నీకు నిప్పుడు**
**యేఁటికె నా విభునితో నేకాంతము**
**వాఁటమై నాపతిపొందు వద్దన్నా మానవు**
**గాఁటాన నీకింతయేలె గామిడితనాలు ॥అవునె॥**

**కూరిమివుట్టించనేర్చుకోమలి యేఁటికే నీకు**
**చేరి నారమణునితోఁ జేసన్నలు**
**సారెకు నామగనితో సరసాలు మానవు**
**కారణములేని దేలె గయ్యాళితనాలు ॥అవునె॥**

**కలసి మెప్పించనేర్చుకామిని యేఁటికె నీకు**
**నెలవై నాకాంతునితో నెయ్యములు**
**యిల శ్రీవెంకటనాథుఁ డిద్దరి మన్నించికూడె**
**మలసి మనలో నిఁక మచ్చరా లేమిటికె. ॥అవునె॥ 3**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో దేవి చినతిరుమల భావనాసుందరితో మొదట తన మగనితో సంబంధం పెట్టుకొన్నదని నిరసించినా చివరికి రాజీకి వచ్చి శ్రీవేంకటనాథుడు ఇద్దరినీ మన్నించి కూడినాడు గావున మనలోనిక మచ్చరాలేమిటికే అని సర్దిచెప్పుకొన్నది. కాని మొదట్లో దేవి రుసరుసలాడిన వైనం మాత్రం బహు రసవత్తరంగా వుంటుంది.

**భావ దీపిక :**

అవునె, నీమూలంగా నేడు నాకూ (దేవికీ) నామగనికి లెస్సతగవులాయెనే (గొప్ప పోట్లాట వచ్చిందే). తివిరి (కావాలని) నీకు నాతో ఇంత దీకొన వలెనా (ఎదిరించాలా?) మాటలలో మభ్యపెట్టగల మగువా! నీకునా మొగుడితో ఇప్పుడేకాంతమెందుకే? నేను వద్దన్నా నా మగనితో నీకు వాటమైన పొందు (అనుకూలమైన సంపర్కం) నీకెందుకే? వద్దన్నా నీకింత గామిడితనం (గొప్పతనం) దేనికె? కోరిక పుట్టించటం నేర్చిన కోమలీ! నీకు నా పతిని చేరి చేతిసైగలు చేసే పనేమిటే? ప్రతిసారీ నా మొగుడితో సరసాలు వద్దంటే వినవు. గట్టి కారణం లేకపోతే నీకింత గయ్యాళితనం దేనికే? కలయికతో మెప్పించగల కామినీ! నాకాంతునితో నీకు నెయ్యము (స్నేహము) యెందుకే? పోనీలేవే, శ్రీవేంకటనాథుడు మరల మన ఇద్దరినీ మన్నించి కూడినాడు కదా! మనలో మనకు ఇంకా మాత్సర్యం యెందుకే?

సంఖ్య : 161 సంపుటము : 25 పుట: 108 రాగం : నీలాంబరి

**22 మగనికి నాలికిని మర్మము లివి**
**తగిలి పాయకుండితే తమకము రేఁగును ॥పల్లవి॥**

**పచ్చిమాఁట లాడితేనే భావములు గరఁగును**
**యిచ్చకము సేసితేనే యింపు వుట్టును**
**కొచ్చి కొచ్చి కొసరితే గురుతౌఁ జుట్టరికము**
**వచ్చినట్టే వచ్చితేను వాడికలు గలుగు ॥మగ॥**

**వినయము చూపితేనే వెగ్గళించు మోహము**
**మనసు లెనసితేనే మన్నన లెక్కు**
**తనువులు సోఁకితేనే తడఁబడుఁ గోరికలు**
**ననిచి పైకొంటేనే నవ్వులెల్లా వచ్చును ॥మగ॥**

**కలుపుకోలు గలితే కాఁపురము లొనరును**
**తలఁపు సరిదాఁకితే తగులుఁ గాంక్ష**
**యెలమి శ్రీవేంకటేశ యింతి నేలితివి నీవు**
**చలివాయఁ గూడితేనే చవులౌను రతులు ॥మగ॥ 161**

**మున్నుడి :**

అన్నమాచార్యులవారు ఈ శృంగారకీర్తనలో స్త్రీపురుష సంబంధాలు యెలావుండాలో వివరిస్తున్నారు. ఆలుమగలు తెలియవలసిన గొప్పరహస్యం వొక్కటే. ఒకరికొకరుదగ్గరై విడువకుంటే వారిమధ్య తహతహలు వాటంతట అవే చెలరేగుతాయి. ఒకరితో నొకరు ప్రియముగా మాట్లాడుకోవాలి, వినయంగా వుండాలి కలుపుకోలుతనం చూపించాలి. ‘చలివాయగూడితేనే చవులౌను రతులు’ అంటున్నారు, అదీ జగన్నాథునితో...

**భావ దీపిక :**

స్వామీ! మగవానికి, వాని ఆలికి తెలియవలసిన మర్మములు (రహస్యములు) ఇవియే. తగిలి (దగ్గరై) పాయకుండితే (విడువకుంటే) తమకమురేగును (తన్మయత్వం పెరుగుతుంది). ఇది వినుస్వామీ! పచ్చిమాటలాడితేనే (మధ్య మధ్య బూతులు మాట్లాడితేనే) భావములు కరుగుతాయి. ఇష్టము చూపిస్తేనే ఆనందం కలుగుతుంది. గుచ్చిగుచ్చి ఆపేక్ష చూపిస్తే సంబంధాలు బలపడతాయి. వచ్చినట్టే వచ్చితేనే (తరచుగా వస్తూవుంటే) వాడికెలుకలుగును (ఒకరికొకరు అలవాటవుతారు). ప్రభూ! వినయము చూపిస్తేనే మోహము వెగ్గళిస్తుంది (అతిశయిస్తుంది). సతీపతుల మధ్య మనస్సులు కలిస్తేనే పరస్పర గౌరవము పెరుగుతుంది. తనువులు సోకితేనే (శరీరాలొకటైతేనే) కోరికలు తడబడుట జరుగుతుంది. ననిచిపైకొంటేనే (ప్రీతితో ఆక్రమిస్తేనే) నవ్వులు వికసిస్తాయి. దేవా! కలుపుకోలుతనం వుంటేనే కాపురము కళకళలాడుతుంది. తలపులు సరిదాకితే (ఇరువురి ఆలోచనలు దగ్గరవుతేనే) కాంక్షతగులుకొంటుంది (కోరిక రేగుతుంది). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు జగన్మాథుడవు. నీవు ఆ ఇంతిని యిట్లే యేలితివి. చలివాయగూడితేనే చవులౌను రతులు (చలిని పోగొట్టేట్లు జరిపే కూటములు వల్లనే రతులింపౌను) ప్రభూ!



సంఖ్య : 2 సంపుటము : 10.2 పుట: 2 రాగం : మధ్యమావతి

**23 విన్నవించవే వోరమణి విభునికి వింత లింకనేలె**
**వున్నతిఁ దన్ను నే నేమైననంటినా వోరుచుకొమ్మనవే ॥పల్లవి॥**

**చెలులలో నన్ను చేపట్టినవాఁ డలుగనేఁటికినే**
**వలచి తా నాకు నిచ్చినబాసలు వాకిటనె పోయనా**
**తలఁచి తలఁచి తాపాన నే నిట్టె తలఁకుచు నుండఁగా**
**కలయఁ దా రాక యెడమాఁటలనె కాఁకరేఁచ నేలె ॥నిన్న॥**

**యెప్పుడు నావద్దఁ బాయనివాఁడు నేఁ డేమిటికిఁ బోయనే**
**తప్పెనో నామీఁదిమోహము తనకు తామసించ నేలె**
**ముప్పిరిగొన్నట్టి జవ్వనము నే మోవలేకవుండఁగా**
**యిప్పుడెవిచ్చేసి నన్నుఁ గలయక యేమిటికున్నాఁడె ॥నిన్న॥**

**యెక్కుడుమాఁట దన్నాడని నాతోడనేఁటికిఁ గోపించెనే**
**వొక్కటై నే నెంతమీరి నవ్వినా నూరకుండేవాఁడు**
**చక్కని శ్రీవెంకటనాథుఁడు నన్ను సరవితోఁ గూడెనే**
**మక్కువ న న్నింక దిగవిడువక మన్నించు మనవె. ॥నిన్న॥ 2**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి తన చెలికత్తెతో యెలా వాపోతున్నదో చిత్తగించండి. “ఓ రమణీ! నావిభునికి విన్నవించవే. ఆయన ప్రవర్తన కొత్తగావున్నదెందుకే? ఒకవేళ పొరబడి తనను నేనేమైనా అన్నా ఔన్నత్యముతో ఓర్చుకొమ్మనవే”. ముక్తాయింపుగా, మక్కువజూపి నన్ను దిగవిడువక మన్నించమనవే అని కూడా అన్నది.

**భావ దీపిక :**

ఓరమణీ! నా విభునికిది విన్నవించవే. వింతలింకనేల (ఇంకానీకు కొత్తమొగమాటం దేనికి?) ఉన్నతి (ఔన్నత్యముతో) నా పొరబాటున నేనేమైనా అనినా ఓర్చుకొమ్మనవే. అంతమంది కన్నెలలో నన్నేయెన్నుకొని చేబట్టినవాడు నాకు తొల్లిచేసిన బాసలు వాకిట్లోనే వదలివేశాడాయేమే? అతనిని తలచితలచి నేనిక్కిడ తాపముతో తలకుతుంటే (చలించిపోతుంటే) తాను నన్ను కలియుటకు రాకుండా పెడసరం మాటలని కోపము నెక్కిస్తాడెందుకే? ఎప్పుడూ నన్ను పాయనివాడు (వదలనివాడు) నేడు తానెక్కడికిపోయాడే? ఒకవేళ నామీద మోహము తప్పెనా (తగ్గిపోయిందా?) లేకపోతే నాతో మాత్సర్యమేలనే? ముప్పిరిగొన్న (అతిశయించిన) యౌవనభారాన్ని మోయలేక నేనుంటే, ఇప్పుడు నావద్దకు వచ్చి కూడా కలియకున్నాడు యెందుకనే? ఎన్నడూ నన్న పల్లెత్తుమాట అననివాడు, యెందుకు నాతో కోపంగావున్నాడే? తనతో వొక్కటై నేనెంత మితిమీరి నవ్వినా వులకడు పలకడు, యెందుకే? ఇప్పటికి అర్థమైనది. శ్రీవేంకటనాథుడు సరవితో (క్రమముగా) నన్నుకూడినాడే. ఇకనైనా మక్కువతో మన్నించి నన్ను విడనాడకుమని చెప్పవే.

సంఖ్య : 306 సంపుటము : 25 పుట: 204 రాగం : వరాళి

**24 ఏఁటికి వేగిరించేరే యెఱఁగనిదాననటే**
**కూటమి గలుగుదాఁకాఁ గొసరరాదు ॥పల్లవి॥**

**బలువుఁడయినయట్టిపతితోడ సతులకు**
**చలము సాదించరాదు జంకించరాదు**
**వలవకతొలుతనే వాడికగాఁ జేరుకొని**
**పిలువఁగరాదు మరి బిగియారాదు ॥ఏఁటి॥**

**వెక్కసమయినయట్టివేడుక కాని నంత**
**కక్కసించరాదు మతి కరఁచారాదు**
**నిక్కిచూడకుండఁగాను నేరుపులు వచరించి**
**పెక్కుమాట లాడరాదు పెనఁగారాదు ॥ఏఁటి॥**

**చేతికిలోనైనయట్టి శ్రీవేంకటేశ్వరుని**
**కాతరించరాదు మరి కాదనారాదు**
**యీతఁడే నన్నిటు గూడి ఇచ్చకుఁడై వుండఁగాను**
**యేతులు నెరపరాదు యెలఇంచారాదు ॥ఏఁటి॥ 306**

**మున్నుడి :**

ఈ కీర్తనలో అన్నమయ్య, ప్రౌఢవనితవలె దేవి తన చెలికత్తెలకు సతులుయేది చేయాలో యేది చేయకూడదో వివరిస్తున్న వైనం గానం చేస్తున్నారు. “మీరెందుకు తొందర పడతారే? నేనేమీ తెలియనిదాననుకొంటున్నారటే! భర్తతో కూటమి జరిగేదాకా కూటమిపై ఆపేక్ష చూపించకూడదు”. ఇంకా వినండి... మరి

**భావ దీపిక :**

ఓ చెలులారా! యెందుకు అంత ఆరాటపడుతున్నారు? నేనేమైనా యేమీయెరుగనిదాననటే? సచ్ఛీలయైన స్త్రీ తన పతితో కూటమి జరిగేదాకా కూటమికై కొసరరాదు (ఆపేక్ష చూపించకూడదు). బలవంతుడైన పతివున్న స్త్రీలు ఆయనతో చలము సాధించరాదు (పంతానికి పోకూడదు). జంకించరాదు (బెదరించకూడదు). తొలుతనే వలువక (మొదట్లోనే ప్రేమకురిపించరాదు). పేరుపెట్టి అలవాటుగా పిలువరాదు. మరి అలాగని బిగిసిపోయికూడా వుండరాదు. వెక్కసమైనయట్టి వేడుక కాని (మిక్కిలి విలాసపురుషుని) కక్కసించరాదు (నొప్పించకూడదు). మతి కరచరాదు (బుఱ్ఱ తినకూడదు). తలయెత్తి చూడకూడదు. నేర్పు ప్రదర్శిస్తూ యెంతో పెద్దపెద్ద మాటలు మాట్లాడరాదు. అలాగని పోట్లాడకూడదు. శ్రీవేంకటేశ్వరుడంతటివాడు చేతికి లోనైతే అతనిని కాతరించరాదు (భయపెట్టరాదు). అలాగని ఆయన మాటకు అడ్డుచెప్పరాదు. ఆయనే నాతో కూడి నా ప్రియుడై యుండగా, యేతులు నెరపరాదు (గర్వించరాదు), యెలయించరాదు (అతిశయించరాదు).



సంఖ్య : 305 సంపుటము : 25 పుట: 204 రాగం : ధన్నాసి

**25 కాంతలచేత నిన్నిటా కాయగావఁబోలు మేను**
**యెఁ (యెం?)తైనాఁ బంకించఁడు యిచ్చగించీ నందుకే ॥పల్లవి॥**

**సరస మెంతాడినాను సమ్మతించీ నన్నిటికి**
**వెరవఁ డెందుకై నాను వేడుకకాఁడు**
**గొరబులుగా గోర కుమ్మెలువో నూఁదినాను**
**పెరరేఁచి సారెసారె ప్రియపడీ నందుకే ॥కాంత॥**

**నవ్వు లెన్ని నవ్వినాను ననుపుసేసుకొనీని**
**వువ్విళ్లూరి జడియఁ డుబ్బరికాఁడు**
**కువ్వలుగా నురమున కుచములు దాఁకించినా**
**రవ్వలై సిగ్గువడఁడు రతికెక్కీ నందుకే ॥కాంత॥**

**కాఁగిలెట్టు బిగించినా కరఁగీ లోలోననె**
**వీఁగక నన్నిట్టె కూడె వేగిరకాఁడు**
**చేఁగదేర్పినాను మోవి శ్రీవేంకటేశ్వరుఁడు**
**మాఁగనీఁడు వలపులు మన్నించీ నందుకే ॥కాంత॥ 305**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తన నేటి తెలుగు వారికి అంత సులభగ్రాహ్యం కాదు. అయినా ప్రయత్నం చేద్దాం. దేవి ఇలా అంటున్నది. నామగడైన స్వామి అంటే నాకెందుకంత ఇష్టమో చెబుతాను వినండి. ఎన్నివిధాలుగా కాంతలచేత శరీరాన్ని కందిపోయేట్లుచేసినా, యెంతైనా చలించడు. అంతెందుకు వాళ్ళు స్వామిని కౌగిట్లో బిగించినా లోలోపల మెత్తబడ్డా లొంగక నన్నే కూడుతాడు. ఆహా! స్వామిపై యెంత నమ్మకం ఆ తల్లికి. అదండీ.. ప్రేమ అంటే.

**భావ దీపిక :**

నా స్వామి కాంతలచేత ఇన్నిటా (యెన్నివిధాలుగా) మేను కాయగావబోలు (శరీరాన్ని కందిపోయేట్లు) చేసినా, యెంతైనా పంకించడు (చలించడు), ఇచ్చగించడు (నన్ను తప్ప యెవ్వరినీ ఇష్టపడడు). కాని, ఈయన వేడుకకాడు (సరసుడు) ఎంత సరసమాడినా సమ్మతిస్తాడు. దేనికీ జంకడు. గొరబులుగా (అల్లరిగా) నా గోటితో యెంత కుమ్మెలువోన్ (గాయపడేట్లు) వూదినా (గీరినా) ప్రతిసారీ పెరరేచీ (విజృంభిస్తాడు). మరి నా మగడంటే ప్రియపడీనందుకే (ఇష్టపడతాను). ఈయన ఉబ్బరికాడు (ఆనందమూర్తి). నవ్వులెన్ని నవ్వినా (యెంత నవ్వులు పట్టించినా) ననుపుసేసుకొనీని (అనురాగమే చూపిస్తాడు). ఉవ్విళ్ళూరి జడియడు (ఉబ్బితబ్బిబ్బవడు). తన రొమ్ము కువ్వలుగా (ఒక్కసారిగా) నా కుచములు తాకించినా అతిశయించి సిగ్గుపడతాడు. అందుకే రతికెక్కిని (సుప్రసిద్ధుడైనాడు). నా కౌగిలిలో యెంత బిగించినా లోలోనే కరిగిపోతాడు కాని ఆ వేగిరకాడు (తొందరకలవాడు) వెనుదీయా కూడుతాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు నా అధరామృతమునందిస్తే వలపులో మగ్గిపోనీయడు నన్ను మన్నిస్తాడు. అందుకే నాస్వామి అంటే నాకంత ఇష్టం.

సంఖ్య : 304 సంపుటము : 25 పుట: 203 రాగం : కాంబోది

**26** నీకు నాకు నొకఁడే నెయ్యమైన నాయకుఁడు
జోకలాయఁ బొందులెల్లా జోలి ఇఁక నేఁటికే ॥పల్లవి॥

తమకించనేఁటికే తలపోఁతలెల్లాను
సముకాననే తేరీ సవతి వింతే
చెమటచేతుల మనచేతు లితఁడె పట్టె
భ్రమసితి మీతనికి పంతాలిఁక నేఁటికే ॥నీకు॥

కాతరించనేఁటికే కావలసినపనులు
ఆతనివల్లనే తేరీ ఆండ్ల మింతే
యేతులమాటలనే యిద్దరిని బుజ్జగించె
ఆతుమలు దనిసితి మార డిఁక నేఁటికే ॥నీకు॥

వేగిరించనేఁటికే వేడుకపడేవెలా
భోగములోనే తేరీఁ దోఁబుట్ల మింతే
యీగతి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నన్నుఁ గూడె
బాగుగాఁ జొక్కితి మిఁక పలునవ్వు లేఁటికే ॥నీకు॥ **304**

**మున్నుడి :**

ఈ శృంగార కీర్తనలో అన్నమయ్య స్వామి ప్రియురాలు. ఆమెకు దేవిపై అసూయలేదు, సరికదా! సర్దుకుపోయే సహనం, దేవిపై ఆప్యాయత కలిగిన నెచ్చెలి. దేవితో ఆమె యేమి అంటున్నదో వినండి. నీకూ నాకూ ప్రియమైన నాయకుడు వొక్కడే కదా! మనం మన స్వామితో జరిపే పొందులన్నీ వేడుకగానేవున్నాయి. మరి ఇంకా జాలి దేనికే? బాగా పరవశించిన మనకు ఇంకా నవ్వులెందుకే?

**భావ దీపిక :**

చెలీ! నీకు నాకు ప్రియమైన నాయకుడు వొక్కడే. మన పొందులు జోకలాయన్ (వేడుకలుగా వున్నవి). ఇక జాలి యేటికే? (కష్టమెందుకే?) నీవు నా సవతివి. ఇంతేకదా! దీనికోసం లేనిపోని ఆలోచనలతో తమకించనేలనే (లోభించుటెందుకమ్మా?) ఇద్దరమూ ఆయన సముఖముననే వున్నాము కదా! మనను తాకిన ఆయన చేతులకి చెమటలువున్న మాత్రాన భ్రమపడిన మాట నిజమే. కాని ఇంత చిన్నదానికి మనకు పంతమెందుకే? కావలసిన పనులన్నీ మన స్వామివల్లనే తేరీని (శ్రమలేకుండా అవుతాయి). దీనికోసం కాతరించనేటికే (భయపడుటెందుకే?) మనము ఆండ్లము (స్త్రీలము) అంతే సుమా! నిజమే, స్వామి తన గర్వోక్తులతో ఇద్దరినీ వూరుకోబెట్టాడు. మన ఆత్మలు తృప్తిపడ్డాయి కదా! మరి ఇక ఆరడి (గొడవ) యెందుకే? ఆయనతో వేడుక పొందేవేళ వేగిరించనేటికే (తొందరపెట్టుట యెందుకమ్మా?) భోగించి తేరుకున్నాం కదా! మనము తోబుట్లము ఇంతే కదా! శ్రీవేంకటేశ్వరుడు మనిద్దరినీ కూడినాడు. ఇద్దరమూ బాగుగానే, చొక్కితిమి (పరవశించితిమి). ఇంకా ఇతర ఆనందములెందుకే?



సంఖ్య : 116 సంపుటము : 25 పుట: 78 రాగం : సింధురామక్రియ

**27** చూడ నిట్టున్నది గాని జూటుఁదనమే మేనెల్లా
యీడ నేర్చుకోరాదా యీపెచేత నీవు ॥పల్లవి॥

మనసుమర్మ మెఱుఁగు మాటలాడనేర్చు నాపె
వినరాదా వీనులార వేడుకతోడ
పెనఁగులాడఁగనోపు ప్రియములు చెప్పనోపు
చెనకఁగవలదా నీచేతులకొలఁది ॥చూడ॥

చలిమి బలిమి గద్దు చవులు పుట్టించు నాపె
చెలిమి సేయఁగరాదా సిగ్గువడక
మొలకచన్నుల నొత్త మొనసి పాదములొత్తు
పిలిచి బుజ్జగించితే పెద్దరికముగాదా ॥చూడ॥

కేరి కేరి నీతో నవ్వు కిందుపడి మొక్కునాపె
సారెకుఁ గూడఁగరాదా సమరతుల
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఆరమణిపొందులు నీ కంకెకెల్లా వచ్చును ॥చూడ॥ **116**

**మున్నుడి :**

అన్నమయ్య దేవి గురించి స్వామికి యేమి చెబుతున్నారో వినండి. ఈ నీ దేవి చూడటానికి ఇలా అమాయకంగా వున్నది కాని, అమ్మో! ఈమెకు ఒళ్ళంతా కపటమే స్వామీ! ఇక్కడ ఈమెను చూసియైనా నీవు నేర్చుకోవచ్చును కదా! నీతో కిలకిలా నవ్వుతుంది ప్రతిసారీ వినయంగా మొక్కుతుంది. ఇంకా ఆలోచించుటెందులకు సమరతులగూడరాదా, అని సలహా చెబుతున్నారు స్వామికి.

**భావ దీపిక :**

ఈ దేవి చూచుటకు ఇట్లు సౌమ్యముగా వున్నదిగాని, గొప్ప జూటరిది (కపటి). ఒళ్ళంతా కపటమే. స్వామీ! నీవు ఈమె దగ్గర కొంచెం కపటము నేర్చుకోరాదుటయ్యా! ఆపె (ఆమె) మనస్సులోని మర్మం తెలియగలదు. మాటలలో నేర్పరి. నిజమే మరి నీ చెవులారా ఆమె మాటలు వినరాదా? పోట్లాడనూగలదు, ప్రియముగ మాటలూ చెప్పగలదు. ఇకమరి నీచేతులకొలది ఈమెను తాకరాదా స్వామీ! ఆమె చలిమి (పట్టుదల) బలిమి గలిగిన నెచ్చెలి. ఎంతో ప్రీతి పుట్టించగల సమర్థురాలు. సిగ్గుపడక ఈమెతో స్నేహం చేయరాదా? ఈమె నీకు ఇంతకన్నా యేమి సంకేతములనీయగలదు? తన మొగ్గలవంటి పయోధరములను నీకు వొత్తుచున్నది. మొనసి (పూని) నీ పాదములొత్తుచున్నది. స్వామీ! ఇంతకన్నా యేమికావాలి? ఆమెను పిలిచి బుజ్జగించితే నీ పెద్దరికమే నిలబడుతుందిగదయ్యా? నీకు సాష్టాంగ వందనం చేస్తోంది. నీతో కిలకిలా నవ్వుతున్నది. సమరతులతో ఈమెను కూడరాదా స్వామీ? ఇదిట్లా వుండగా ఓ శ్రీవేంకటేశా! నన్నూ (అన్నమ్మను) యేలితివి. ఆమె పొందులు నీలో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లుందే?

సంఖ్య : 329 సంపుటము : 25 పుట: 220 రాగం : దేసాళం

**28** అప్పటి నవ్వేవు ప్రహ్లాదవరదా
అప్పసపుకాంతల ప్రహ్లాదవరదా ॥పల్లవి॥

కన్నవిన్నసతులెల్లా కంకిసేసినా నోర్చితి -
వన్నిటా శాంతుఁడవు ప్రహ్లాదవరదా
నన్నొడఁబరచనేల నయగారిమాటల నీ-
వన్నట్టే ఆయను ప్రహ్లాదవరదా ॥అప్ప॥

లాసుక యెంగిలి మోవులకు నోరు దెరచేవు
ఆసోదకాఁడవయ్య ప్రహ్లాదవరదా
రాసికెక్కి నాచెవిలో రహస్య మానతిచ్చేవు
ఆసుద్దు లెరఁగనా ప్రహ్లాదవరదా ॥అప్ప॥

చెఁ(చెం?)ది యహోబలమున శ్రీవేంకటాద్రిమీఁద
అంది పెండ్లాడితివి ప్రహ్లాదవరదా
మందెమేళమున నిన్ను మచ్చికతోఁ గొసరితే
అందాల మెచ్చితివి ప్రహ్లాదవరదా ॥అప్ప॥ **329**

**మున్నుడి :**

అహోబలనారసింహునిపై కమనీయమైన శృంగారకీర్తన చెబుతున్నారు అన్నమయ్య. "అప్పటికి నవ్వడ"మంటే పలుమార్లు నవ్వడమన్నమాట. ఆయనకున్న ఇద్దరు కాంతలు శ్రీలక్ష్మి, చెంచులక్ష్మి. ఇక వారెటువంటివారు? వారు అప్పసపు కాంతలట... అంటే కానుకగా వచ్చిన భార్యలని అర్థం. ఈ కీర్తనలో నేటివారి కర్థంకాని అనేకపదాలున్నాయి.

**భావ దీపిక :**

ఓ ప్రహ్లాదవరదా! నారసింహా! నీవు అప్పటిన్ (మరల) నవ్వేవయ్యా! నీవు అప్పసపు కాంతల (కానుకగ వచ్చిన భార్యలతో) ప్రహ్లాదముగానున్న నరహరివి. నీమీద జాణడవనే వదంతులు వినిన నీసతులు కంకిసేసినా (దురుసుతనం చూపినా) ఓర్చినావయ్యా! నీవు అన్ని విధాలా శాంతమూర్తివయ్యా! ఇదంతా ఇట్లుంటే మధ్యలో నన్నెందుకు ఒడబరసేవు? నీవు నయగారిమాటలవాడివి. చివరికి నీవన్నట్టే అయింది (ఇద్దరు సవతులు లక్ష్మీ స్వరూపాలే) ప్రహ్లాదవరదా? నీవు నవ్వుతుంటే లాలాజలంకారే యెంగిలి నోరు దెరచేవు. నీవు ఆసోదకాడవు (మిక్కుటమైన కోరిక గలవాడవు) ప్రహ్లాదవరదా! అందరూ చూస్తుండగానే నా చెవిలో రహస్యం చెప్పేవు. ఆ సంగతులన్నీ నాకు ముందే తెలియును స్వామీ! ఓ ప్రహ్లాదవరదా! నీవు అతిశయించి ఇక్కడ అహోబలంలోను, అక్కడ తిరుమలలోను పెండ్లిండ్లు చేసికొనుచున్నావు. మచ్చికతో (చనువుతో) మందెమేళ (వేళాకోళంగా) నిన్ను కసురుకొంటే నీవు నా అందాలను మెచ్చితివి.



సంఖ్య : 115 సంపుటము : 25 పుట: 77 రాగం : శంకరాభరణం

**29** ఎంత నేరుచుకొన్నది యీచిన్నది
చెంత నుండే నిన్ను నిట్టె చేకొన్నది ॥పల్లవి॥

చిగురుఁబెదవిమీఁదిచిన్నలూ
సగముమాటలతోడిసన్నలూ
నగియేటిసెలవులనయములూ
బిగిసేటికాఁగిటిప్రియములు ॥ఎంత॥

తనివోక చెలులతో తలపోఁతలూ
ననపు లేపొద్దుమాననిచేఁతలు
పనివడి నీమీఁదిపాటలూ
మొనసి యెప్పుడు నీతో మొగమోటలు ॥ఎంత॥

వద్దనుండి పైఁజల్లీ వలపులు
అద్దుకొనీ రతిలోని యలపులు
వొద్దికై శ్రీవేంకటేశ వొనగూడితి వీకెను
కొద్దిమీరె బింకములు కూడినపొంకములు ॥ఎంత॥ **115**

**మున్నుడి :**

తొలినాళ్ళలో (పెళ్ళయిన కొత్తలో) స్త్రీలు బిడియంతో రతి తమకిష్టంలేనట్లు, తమ భర్తకోసమే తాము మక్కువ చూపుతున్నట్లు చెబుతారు. కాని అన్నమయ్య, స్త్రీలు ఇట్టే నేర్చేసుకొంటారని భర్తను క్షణంలో వశపరచుకొంటారని చెబుతున్నారు. అమ్మో!! వారి నయగారాలు, కౌగిటిబిగింపులు, రతిలోని యలపులు... "బ్రహ్మకైనను పుట్టు రిమ్మతెగులు"- అని కదా! చలోక్తి.

**భావ దీపిక :**

ఈ చిన్నది (అలమేలుమంగ) యెంత నేర్చుకొన్నదయ్యా!! ఎల్లప్పుడూ నీచెంతనేవుండి నీవిద్యలు కూడా నేర్చుకొన్నదయ్యా? చిగురులవంటి తన పెదవితోనే గుర్తులు నీకు మాత్రమే తెలిసేట్లు చెబుతుంది. సగంలో ఆపిన మాటలతో సంకేతాలిస్తుంది. నగియేటిసెలవుల (నవ్వులొలికే పెదవులతో) ప్రియములు చెబుతుంది. బిగికౌగిళ్ళలో ప్రేమఝరి కురిపిస్తుంది. తన చెలులతో తనివోక (తృప్తిదీరని) ఆలోచనలను చేస్తుంది. ఏపొద్దునైనా ననపుమానని చేతలు (అనురాగ రహితమైన పనులు) చేయదు. పనివేళా నీమీద ప్రేమగీతములను పాడుతూనే వుంటుంది. మొనసి (పూని) ఆమె యెప్పుడూ నీతో మొగమాటము చూపుతూనే వుంటుంది. ఆ దేవి నీ చేరువనేవుండి వలపులు నీపై కుమ్మరిస్తుంది. రతిలో అలసిన అలుపులను అద్ది (స్పష్టంగా) చూపుతుంది. అనుకూలుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమెకు కూటమితో అమరితివి. అంతులేని నీ డాంబికములు కూడిన పొంకములు (కలిగిన పొందికలు)

సంఖ్య : 114 సంపుటము : 25 పుట: 76 రాగం : దేసాళం

**30 ఆపె వచ్చినప్పు డన్నీ నయ్యీఁగాని**
**వోపుదునా దొరవు నీవొగిఁ గాచుకుండను ॥పల్లవి॥**

**పిలిచే వాకెను నీవు ప్రియపడి, నేనైనాఁ**
**జెలిమారు సేవచేసేఁ జెప్పవయ్యా**
**అలఁదేనఁ(నం?)టా గంధ మట్టె చేఁబట్టుకున్నాఁడ-**
**వలరి నావురముపై నందాఁకా దాఁచవయ్యా ॥ఆపె॥**

**వెదకె వాపెను నీవు, వేడుకతో నే నుందాన**
**యెదుట, నాపని యానతియ్యవయ్యా**
**ఇదె విడె మాకెకు మీఁదెత్తుకొన్నాఁడ, వందాఁకా**
**పొదిగి నాపుక్కిట నిప్పు దుండనీవయ్యా ॥ఆపె॥**

**చూచె వాపె కెదురు, సుద్దులు నేఁ జెప్పేను**
**చేచేత నీవెట్టయినాఁ జెనకవయ్యా**
**యేచి శ్రీవేంకటేశుఁడ యే నలమేలుమంగను**
**కాచి నన్నేలితివి ఆకాంతమారే నేనయ్యా ॥ఆపె॥ 114**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి స్వామికి అన్నమ్మ వ్యవహారం నచ్చచెబుతున్నది. ఆమె (అన్నమ్మ) వచ్చినప్పుడు అన్నీనీవనుకొన్నట్లే అవుతాయిలేవయ్యా! నీవు నా దొరవు. నీవు మరొకరి కోసం కాచుకొని వుంటే నేను సహించి వుండగలనా? నేను నీతో మాటలాడుతుంటే నీధ్యాసంతా "ఆమె"పైనే వున్నది. ఇదేమిటయ్యా?

**భావ దీపిక :**

స్వామీ! ఆమె (అన్నమ్మ) వచ్చినప్పుడే అన్నీ (నీవనుకొన్నవన్నీ) అయ్యీగాని (అవుతాయిలేవయ్యా!) నీవు దొరవు (జగదీశ్వరుడవు). నీవు వొగి (పూని) పరులకోసం కాచుకొని వుండటం, నేను వోపుదునా? (సహింతునా?) నేను చెలిమితో సేవచేస్తూనే వున్నాను. నీవు ప్రియముకలిగి ఆమెను (అన్నమ్మను) పిలిచేవు. ఆమె నీకు గంధం పూసిందని ఆమె చెయ్యి పట్టుకొంటావా? అందాకా ఆ గంధం పూతలు నావురముపై దాచవయ్యా! నేను వేడుకతో నీయెదుట వున్నదానను. ఏదన్నా పనివుంటే నాకు ఆనతీయవయ్యా! ఆమె (అన్నమ్మ) కోసం యెందుకు వెదుకుతున్నావు? నీచేత్తో తాంబూలం పట్టుకొని, ఆవిడ (అన్నమ్మ) కోసం యెంతసేపు యెదురుచూస్తావు? అందాకా దాన్ని (తాంబూలాన్ని) నాపుకిటిలోవుంచరాదా స్వామీ! ఒకపక్క నేను నీతో కబుర్లు చెబుతూనేవున్నాను. నన్ను నీ చేతుల్లోకి తీసకొనవయ్యా! ఆమె (అన్నమ్మ) కోసం యెందుకు యెదురు చూస్తావు? నన్ను తాకరాదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నేను అలమేలుమంగను. అతిశయించి నన్నేలితివి. నేనూ ఆ కాంత (అన్నమ్మ) బదులే నీకుఅన్నీ. నాకు తెలుసు.



సంఖ్య : 249 సంపుటము : 25 పుట: 167 రాగం : శంకరాభరణం

**31 ఆసోదకాఁడవై యంటితివి ముందే**
**వేసర కెట్లా వేగిరించేవయ్యా ॥పల్లవి॥**

**మందగొల్లెతలు మాఁటలాడేరదే**
**యెందరి కుత్తర మిచ్చేవయ్యా**
**విందులు వెట్టేరు వేవేలు మోవుల**
**యెందుకని వొగ్గేవేమయ్యా నీవు ॥ఆసో॥**

**నీరాణివాసాలు నీకు మోహించిరి**
**యేరీతిఁ జనవు లిచ్చేవయ్యా**
**కోరి యప్పటిని కొంగులు వట్టిరి**
**మేరతో నెట్ల మెప్పించేవయ్యా ॥ఆసో॥**

**పట్టపుదేవుళ్లు పైకొని రిప్పుడే**
**యెట్టొడఁబరచే వేమయ్యా**
**యిట్టె శ్రీవేంకటేశ నన్నేలితి**
**అట్టడి విందుకు దిట్టవయ్యా ॥ఆసో॥ 249**

**మున్నుడి :**

శ్రీవేంకటేశ్వరుని శృంగారలీలలను వర్ణిస్తూ తననికూడా ఆయన వలపుకత్తెలలో జమచేసికొంటున్నారు అన్నమయ్య. ఎంత ధైర్యంగా స్వామిని ఆసోదకాడు అంటున్నారో చూడండి. ఇంతకీ ఆసోదకాడు అంటే యెక్కువ 'ఆశ' కలవాడని అర్థం. నీవు యేనాటినుంచో 'ఆశ' కలవాడివే. నీకు విసుగు అనేదే లేదు. నీ వలపు కత్తెలను యెట్లా తొందరపెడతావంటే... అమ్మయ్యో! చెప్పలేం.

**భావ దీపిక :**

స్వామీ! నీవు ముందే (మొదటినుంచి) చెప్పలేని ఆసోదకాడవై (మిక్కిలి ఆశకలవాడివై) యుంటివి. వేసరక (యేమాత్రమూ విసుగులేక) మమ్ము వేగిరించేవయ్యా! (తొందం పెడతావయ్య). మందగొల్లెతలు (గొల్లవాడలోని గోపికలు) అందరూ నీతో మంతనాలాడేవారే. నీవు యెందరికి సమాధానం చెప్పగలవయ్యా? అసంఖ్యాకమైన తమ అధరామృతములతో నీకు 'విందు' చేస్తారు. నీవు అందరికీ వొగ్గేవు (అంగీకరింతువు). ఇదేమిటి స్వామీ? నీరాణివాసములోనున్న యెందరో స్త్రీలు నిన్ను మోహించి సర్వస్వము నొసగువారే. ఇంతమందికి చనువునెలా ఇస్తావయ్యా? వారంతా కోరికతో నీ అప్పటిని (పాత అలవాటును) కొంగువట్టిరి (సానుకూలపరచుకొన్నారు). పరిమితియను నదిలేక అందరిని యెట్లు మెప్పించేవయ్యా? సరే! ఇప్పటి పరిస్థితి చూడు. శ్రీదేవి భూదేవినీ పట్టపు దేవేరులు. వారు నిన్ను ఆక్రమించుకొనినారు. వారిద్దరినీ యెట్లా ఒడబడునట్లు సేతువయ్యా? ఇదిట్లావుండగా ఓ శ్రీవేంకటేశ్వరా నేనూ నిన్ను వలచాను. నా భాగ్యంవల్ల నన్నేలుకొన్నావు. ఇది "అట్టు" (అల్లరి) అయిపోయిన సంబంధం. ఇందుకు నన్ను తనివితీరా తిట్టవయ్యా!

సంఖ్య : 246 సంపుటము : 25 పుట: 166 రాగం : శుద్ధదేశి

**32** కాఁకల యెప్పటనుండి కాచుకున్నదో
మూఁక మొక్కులెల్లాను మొక్కీ నిదె నీకును ॥పల్లవి॥

తమకించి రావంటాఁ దగ నీతో నలిగితే
క్రమ మెఱఁగి తానేల కదిసీ నాపె
అమరఁగ నఁ(నం?)తలో నిన్నట్టె కాఁగిలించుకొంటే
చెమటచేతులఁ దాను సేవసేసీ నీకును ॥కాఁక॥

దిక్కుల నీచేఁతలకు తిట్లు నేఁ దిట్టితేను
యెక్కువఁ దాఁజెవిలోన నిచ్చలాడీని
అక్కర నందుకుఁగాను అట్టె నేఁ బొదిగితే
మక్కువతో సారె నాకుముడిచిచ్చీ నీకును ॥కాఁక॥

నీవిచ్చినచనవున నీమోవి యానితేను
కావరాన ముట్టి వూడిగాలు సేసీని
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె ముసుఁ గిడుకొఁ (కొం?)టే
ఆవలఁదా మఱఁదల ననుకొనీ నీకును ॥కాఁక॥ **248**

**మున్నుడి :**

ఈ శృంగారకీర్తనలో అన్నమయ్య స్వామి ప్రేయసి. ఆమె విరహావస్థను వివరిస్తున్నారు స్వామికి. ఆమె తాపముతో వేగిపోతూ వున్నదని, నిరీక్షిస్తూనే స్వామికి యెన్నో మూగవిన్నపాలను చేసొకొంటున్నదని, మొక్కుతున్నదనీ చెబుతున్నారు. ఒక్కసారి స్వామి ముసుగులో దూరిందంటే... ఆ తరువాత ఆయన మరదల్ని అనుకొని గర్విస్తుందట. మరి అదంతా స్వామి ఇచ్చిన చనువేనట అన్నట్లు, ఇందులో నేను అంటే దేవి.

**భావ దీపిక :**

స్వామీ! ఈ విరహిణి యెప్పటినుండి నీకోసం కాఁకతో కాచుకొని వున్నదో తెలియదు గాని తన కోర్కె ఫలించాలని నీకు అనేక మూగమొక్కులు (ఆత్మనివేదనలను) మొక్కుతున్నదయ్యా! తమకించి రావంటా (నీవు త్వరగా రావని) నీతో అలిగి, ఆపై తన క్రమ సంఖ్య యెంతో గుర్తించీ నీకు దగ్గరవటం దేనికి? అంతలోనే తన బిగికౌగిలిలో నీకు తన చెమటల చేతులతో సేవచేయాలని తపిస్తున్నది ప్రభూ! నీవు చేసే పనులకు విసుగొచ్చి నేనెక్కడనో నిన్ను నిందిస్తే, ఆమె తనను నీచెవిలో ప్రియమైన పలుకులను చెబుతుంటుంది. నేను తను చేసిన దానికి ప్రతిగా మక్కువతో నీకు ఆకుమడిచిస్తుంది (ఆహ్వాన తాంబూలమునందిస్తుంది.) నీవు చనువిచ్చి ఆమె అధరానికి నీ అధరం తాకిస్తే ఇక సంతోషంతో "వుబ్బితబ్బిబ్బై" నీకు అంతులేని పరిచర్యలు చేస్తుంది. మరి, ఈ వేళ వో శ్రీవేంకటేశ్వరా! నీవు ఇట్టే ఆమె ముసుగులో దూరితే ఇక ఆపై తానే నీ మరదలిననుకొంటుంటుంది.



సంఖ్య : 113 సంపుటము : 25 పుట: 76 రాగం : సాళంగం

**33** తనంత వచ్చినదెల్లా తరితీపు లేలౌను
పెనఁగులాటలమీఁదఁ బ్రియము లౌఁగాక ॥పల్లవి॥

కానుకిచ్చినాపె వద్దఁ గాచుకుండఁగా నెక్కడో-
మానినులతో నీవు మాటలాడేవు
పూనిపట్టి విడెమిచ్చేపొలఁతి యటుండఁగాను
మానక చేయిచాఁచేవు మరొక తెమీఁదను ॥తనం॥

చేరి వుండినాపె నిన్నుఁ జెనకుచు నుండఁగాను
వూరివారిఁ జూచి నీవు వువ్విళ్లూరేవు
కోరి నీకుఁ బాదాలొత్తేకొమ్మ నీతో నవ్వఁగాను
తేరకత్తెలతో నేల తెగడవచ్చేవు ॥తనం॥

కొలువుసేసేయాపె కోరి వేఁడీఁ దగులఁగా-
నలమేల్మంగరతికి నాసపడేవు
యెలమి శ్రీవేంకటేశ ఇందరు నీకుండఁగాను
లలి మోహపుటాపెమేలము మెచ్చేవు ॥తనం॥ **113**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగాకర్తీనలో స్వామికి తన నెచ్చెలులపై అంత వ్యామోహం దేనికని సూటిగా అడుగుతున్నారు. అవునులే, నామీద నీకు ప్రేమ యెందుకుంటుంది? తనంతట తానే వచ్చినదానిమీద యెవ్వరికీ 'కోరిక' లెందుకుంటాయి? తిప్పలుపెట్టి దొరికినదానిమీద ప్రియములు కలుగుతాయి కాని "వనితతనంతతా వలచి వచ్చిన చుల్కనకాదె యేరికిన్?"

**భావ దీపిక :**

స్వామీ! తనంతతానేవచ్చినదెల్లా తరితీపులేలౌను? (కోరికలెందుకుంటాయి?) పెనగులాటమీద (నానా తిప్పలుపెట్టినదానిమీద) ప్రియములౌగాక! (ఇష్టముగా వుంటుంది కాని). నీకు కానుకనొసగిన వనిత నీవద్ద కాచుకొని వుండగా యెక్కడోవున్న స్త్రీలతో నీవు మాట్లాడుతావు. నీకు కోరి ఆహ్వాన తాంబూలమిచ్చే వనిత ఇక్కడ వుండగా, మరొకదానికోసం నీవు చేయి చాస్తున్నావు. నీతో చేరి వున్న ఆమె నిన్ను తాకుతూ వుంటే నీవు వూళ్లో వున్న భామలను చూచి వువ్విల్లూరుతున్నావు. కోరి నీపాదాలొత్తే పడుచు నీతో నవ్వుతూ వుంటే నీవేమో తేరకత్తెలతో (పరస్త్రీలతో) యెందుకు తెగడవచ్చేవు? (ఉపేక్ష చేయుచున్నావు?) నీ కొలువులో వున్న కాంత నిన్ను కోరి, వేడుకొని దగ్గరవుదామని యత్నిస్తుంటే, నీవు దేవి అలమేలుమంగ రతికోసం ఆశపడుతుంటావు. అతిశయించిన శ్రీవేంకటేశ్వరా! ఇంతమంది నీకు వుండగా, లలిమోహపుటాపె (ప్రేమ, మోహము కలిగిన ఆదేవి) మేళము (పరిహాసము) నీవు మెచ్చేవు.

సంఖ్య : 247 సంపుటము : 25 పుట: 165 రాగం : ముఖారి

**34 ముంచుకొంటే పొందులెల్లా మొగచాటౌనో యేమో**
**పెంచేవు వేడుకలు పెనఁగువడఁగను ॥పల్లవి॥**

**గిలిగించే విటు నన్నుఁ గేరికేరి నవ్వుమని**
**పలుమారు నవ్వితేను పాటివలదా**
**చలి వాసి మొక్కనంటా జంకించే వప్పటిని**
**చలి వాసితే వలపు చప్పనేకాదా ॥మంచు॥**

**పెడరేఁచేవు సిగ్గులు బెట్టి కాఁగిలించుమని**
**కడుఁ గాఁగిలించితేను కాఁక వుట్టదా**
**విడువక కొసరేవు వింతచూపు చూడుమని**
**చిడుముడిఁ జూచితేను చిత్తము నోనాఁటదా ॥మంచు॥**

**నేరిపే వొక్కటొక్కటే నెయ్యపుమాటాడుమని**
**మారు మాటాడఁగఁబోతే మంకు రేఁగదా**
**యీరీతి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను**
**గారవించే వినియెల్లా ఘనతలుగావా ॥మంచు॥ 247**

**మున్నుడి :**

"మొగచాటు" అవటం అంటే మొహంమొత్తి ప్రీతి నశించటం. అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి స్వామికి మితిమీరిన శృంగారం మొహంమొత్తుతుందని నచ్చచెబుతున్నది. కాని స్వామి ఆమె మాట లేక్కసేయడు. అతిశయించిన పొందులు ప్రీతిని తగ్గిస్తాయో యేమో!! కాని, నీవు పెనవేసికొని వేడుక పెంచుతున్నావు అని ఆమె దిగులు పడుతున్నది. మరి ఈయనగారు వినడు. ఎట్లా?

**భావ దీపిక :**

స్వామీ! ముంచుకొంటే (అతిశయించినచో) పొందులెల్లా (కూటములన్నీ) మొగచాటౌనోయేమో (మొగంమొత్తిపోతాయేమో!!) నీవేమో వేడుకలు పెనగువడగ (పెనవేసికొనిపోగా) పెంచుతూనే వున్నావు. నీవు కేరింతలతో నవ్వమని ఈరీతి చక్కిలిగింతలు పెడుతున్నావు. అన్నిసార్లు నవ్వితే పాటివలదా (పద్ధతిగ వుంటుందా?) చలివాసి మొక్కనంటా (సిగ్గువిడచి నీకు నమస్కరించనని) అప్పటిన్ జంకించేవు (మరల మరల బెదిరిస్తావు). సిగ్గు విడిచిపెడితే వలపులు చప్పగా వుండవా ప్రభూ? సిగ్గు విడచి నిన్ను కౌగలించుకోమని నన్ను ప్రేరేపిస్తున్నావు. నిన్నట్లా కౌగలించితే నాలో వుద్రేకం కలుగదా? నిన్ను అదోలా వింతగా చూడమని కొసరి కొసరి విడువక పట్టుబడతావు. నిన్ను చిడుముడి చూచితే (సంభ్రమంతో చూస్తే) చిత్తము చలించదా ప్రభూ! ప్రీతి జనింపచేసే మాటలను నాకు ఒక్కొక్కటే నేర్పుతున్నావు. మారుమాట అనటం అలవాటైతే, మంకుతనం పెరగదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవీరీతిగా అతిశయించితివి. నన్నిట్లా గౌరవించితివి. ఇవన్నీ నీ ఘనతలు కావా ప్రభూ!



సంఖ్య : 462 సంపుటము : 25 పుట: 309 రాగం : సామంతం

**35 నీవు గోవిందరాజవు నెరజాణవు**
**మోవులు చూపి వారు మోహము చల్లేరు ॥పల్లవి॥**

**కొలువులోపల నిన్నుఁ గొసరి కొసరి చూచి**
**చెలు లిద్దరును నిన్నుఁ జెనకేరు**
**వలపులు మక్కళించి వన్నెదేరే నీమోమున**
**కళలు రేఁచి రేఁచి కమ్మటి నవ్వేరు ॥నీవు॥**

**పానుపుమీఁదట నీకుఁ బాదము లొత్తియొత్తి**
**మానిను లిద్దరు నీతో మాటాడేరు**
**పూని యాసలు రెట్టించి పొత్తుల నీమేనెల్లా**
**మైనమువలెఁ బెనఁగి మచ్చిక రేఁచేరు ॥నీవు ॥**

**వోవరిలోపల నుండి వొడివట్టి నిన్నుఁదీసి**
**శ్రీవనితా భూవనితాఁ జెంది కూడేరు**
**యీవల నావలా మొక్కి శ్రీవేంకటపతివైన-**
**గోవిందరాజ నీగుణము మెచ్చేరు ॥నీవు॥ 462**

**మున్నుడి :**

తిరుపతిలో వెలసిన గోవిందరాజ స్వామిపై శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన దేవాది దేవుడైనప్పటికీ నెరజాణ. ఆయన కాంతలు తమ మోములు చూపి మోహమును రేకెత్తిస్తుంటారట. ఇక్కడ అక్కడా ఈ గోవిందరాజే ఆ వేంకటేశ్వరుడు. నీ చక్కని గుణాలను అందుకే మెచ్చేమయ్యా! అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీవు గోవిందరాజవు. గొప్ప నెరజాణవు (నేర్పరివి). తేనెలూరు నీ అధరములను జూసి వారు (నీ సతులు) మోహమును చల్లేరు (వెదజల్లెదరు). నీ సభాస్థలికి విచ్చేసిన నీ సతులు నిన్ను కొసరి కొసరి మురిపెముతో చూచెదరు. ఆపై నిన్ను ప్రేమతో తాకెదరు. వలపులు మక్కళించి (వలపులలో వుబికించినందున నీ వదనమున శృంగార కళలు చెలరేగుట చూచి నీ సతులు కమ్మగా నవ్విరి. ఆ మానినులిద్దరూ (శ్రీదేవి, భూదేవి) మీ పాన్పుమీద నీకు పాదములనొత్తివొత్తి నీతో ప్రియములు మాటలాడేరు. పూనిన వారి ఆశలు రెట్టింపవగా తమ పొత్తులో నిన్ను మైనమువలె కఱగించి నీలో మచ్చికను పెంచేరు. వారిరువురూ వోవరిలోపల నుండి (మీ చంద్రశాలలో ప్రవేశించి) నిన్ను ఒడిపట్టి దీసి (కొంగుపట్టి నిలిపి), నీకు చెంది (నీవారై) ఆ శ్రీదేవి భూదేవి నిన్ను కూడెదరు. ఈవల (ఈ తిరుపతిలోను) ఆవల (ఆ తిరుమలలోను) నీకు మొక్కి, సాక్షాత్తు శ్రీవేంకటేశుడవైన వోగోవిందరాజా! వారిరువురూ నీ గుణములను మెచ్చేరయ్యా!

సంఖ్య : 366 సంపుటము : 25 పుట: 245 రాగం : ఆహిరి

**36** మమ్మునేల దూరేవే మాఁటిమాఁటికి
చిమ్మి యిట్టె చెనకఁగ సిగ్గువడఁగలమా ॥పల్లవి॥

వలసినట్టెల్లా నీవు వరము లిప్పించుకోవే
యెలమి సవతుల నీ వేలేనంటా
కలిగినట్టెల్లా నీవు కాఁపిరాలు సేయవే
వలచి నీయింటికి వచ్చినవిభునిని ॥మమ్ము॥

పెక్కుమారు లట్టె నీవు ప్రియాలు చెప్పించుకోవే
వెక్కసపుటెమ్మెలతో వెలసేనంటా
మొక్కులు మొక్కించుకొని మోహములు చల్లవే
పిక్కటిల్లుఁదమకాన పెండ్లాడినవానిని ॥మమ్ము॥

పంతమువచ్చినట్టెల్లా పనులు సేయించుకోవే
చెంతల నీచెప్పినట్టె సేసేనంటా
యింతలో శ్రీవేంకటేశుఁడీడ నిట్టె నన్నుఁ గూడె
వంతులు వెట్టవే నీవు వద్దనున్న వానిని ॥మమ్ము॥ **366**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామి ప్రియురాలు. ఆమె తెగించి దేవితో ధిక్కరించి ఇట్లా అంటున్నది. నీ విభుని ప్రేమకు మేము పాత్రులమయ్యాము. ఇది నిజం. మేమూ ఆయనను మోహించాము. ఇప్పుడు ఆయన స్పర్శ మాకు సిగ్గు కలిగించుటలేదు. ఇందులో మాతప్పేమిటి? నీవు ఆయన ఇల్లాలివైతే మాకేమిటి? మాటిమాటికి మమ్మల్ని యెందుకు నిందిస్తావు? ఇదేమి న్యాయం?

**భావ దీపిక :**

మాటిమాటికీ మమ్మల్నెందుకు దూరేవే (నిందిస్తావే?) ఇట్లా మమ్మల్ని చిమ్మి (చెలరేగి) చెనకగా (స్పృశించినది) నీమగడు. సిగ్గు మాకెందుకు? కావాలంటే ఆయనతో నీకు కావలసినన్ని వరాలిప్పించుకో. మేము నీ సవతులమే. మమ్మల్ని యెందుకంటావే? నీకెట్లా కావాలంటే అట్లా కాపురాలు చేయించుకో. వలచి ఆయన నీ ఇంటికి వస్తే మేమేమన్నా కాదంటామా? నీకేమిటే? నీకెన్నిసార్లు ప్రియ సంభాషణ చేయించుకోవాలనుంటే అన్నిసార్లు చేయించుకో. చెప్పలేనన్ని విలాసాలతో మీ ఆయనను స్వంతం చేసికో. ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు మొక్కించుకోవమ్మా? మాకేమటి? మోహాలు చల్లించుకో, చల్లు. పిక్కటిల్లిన తమకముతో (అధికమైన తన్మయత్వంతో) పెండ్లాడావు కదా! మాకేమి ఇబ్బంది? నీ పంతం చెల్లేటట్లు నీపనులన్నీ ఆయనతో చేయించుకోవే. ఆయన నీవు చెప్పినట్టే సేసేనంటా నీకు అతిశయమెందుకమ్మా? నీవేమి అనుకొన్నా శ్రీవేంకటేశ్వరుడు నన్నూ అనుగ్రహించి కూడినాడు. నీవద్దనున్నవానిని నాకూ వంతులు పెట్టవే.



సంఖ్య : 330 సంపుటము : 25 పుట: 221 రాగం : లలిత

**37** ఏల దాఁచేరు వలపు లిందరు నెరిఁగినదే
వాలాయించినపనికి వాసివంతు లున్నవా ॥పల్లవి॥

సిగ్గువడనేమిటికి చేతికి లోనై వున్నది
అగ్గలము నవ్వరాదా ఆపెతోను
వెగ్గళించి మాముందర వేసాలు చేసేవుగాక
అగ్గమై యేకతవేళ నద్దాఁకలున్నవా ॥ఏల॥

తలవంచనేమిటికి తారుకాణై వున్నది
సొలసి నీకాంక్షదీరఁ జూడఁగరాదా
కొలువులోపలఁగాఁగా గుట్టు నెరపేవుగాక
మెలఁగి పానుపుమీఁద మితిమీర లున్నవా ॥ఏల॥

ఆస దాఁచనేఁటికి ఆయము సోఁకివున్నది
సేసవెట్టి కూడరాదా శ్రీవేంకటేశ
దోసము లేదంటాఁగా దొమ్మి నిందరిఁ గూడితి
లాసినయారతివేళలను పంతాలున్నవా ॥ఏల॥ **330**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో స్వామి చెలికత్తెయై స్వామికి లలితముగా నచ్చచెబుతున్నారు. స్వామీ! నీవు, దేవి వలచి పెండ్లాడిన సంగతి అందరూ యెరిగినదే కదా! మీ వలపు అనివార్యం. ఇక దాంట్లో ఎక్కువ తక్కువ లేమిటయ్యా? ఆమె నీప్రాణం. ఇంకా సంకోచమేల పెండ్లాడి కూడవయ్యా! మీపంతాలు రతివేళ చూపితే యెట్లాగయ్యా? అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! మీ ఇద్దరి అనురాగం అందరూ యెరిగిన సంగతే. ఇంకా యేల దాచేరయ్యా? వాలాయించిన పనికి (అనివార్యమైన పనికి) వాసివంతులున్నవా? (ఎక్కువ తక్కువలుంటాయా ప్రభూ!) దేవి నీకు లోనైవున్నది. నీవెందుకు సిగ్గుపడెదవయ్యా? ఆమెతో అగ్గలమై (మెండుగా) నవ్వరాదా స్వామీ? వెగ్గళించి (మితిమీరి) మాముందు వేషాలు వేస్తున్నావు గాని, అగ్గమై (అందుబాటైన) ఏకాంతంలో అడ్డాకులు (అడ్డు అదుపు) వున్నయ్యా? తారుకాణై వున్నదానికి (నిరూపించబడ్డదానికి) తలవంచుకోవటం దేనికి స్వామీ? ఆమెను పరవశంతో నీమనసారా చూడరాదా? నీ కొలువు కూటమిలో నీవు గుట్టుగానే వుంటావులే. కాని ఇది మీ ఏకాంత సేవ. పక్కమీద చేరాక మితిమీరటం అనే మాటకు అర్థమే లేదయ్యా! ఆ దేవి నీ ఆయము సోకియున్నది (నీ శరీరము తాకియున్నది). కావున నీకామెపై ఆశ కలిగినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకా ఆలోచించనేల తలంబ్రాలు చల్లి పెండ్లాడి కూడరాదా ప్రభూ! నీతో కూటమికి దోషమే లేదని మూకగా యెందరినో కూడితివి కదా! లాసిన యారతివేళ (నవ్వులు పూచే రతివేళ) సతీపతుల మధ్య పంతాలుంటాయా స్వామీ?

సంఖ్య : 328 సంపుటము : 25 పుట: 219 రాగం : సామంతం

**38** ఇంతలో విచారము లిట్టుండెను
పంతాలు దున్నకముందే పంట పండెను ॥పల్లవి॥

చండి హిరణ్యాక్షునితోడ సరసములాడఁగా
అండనుండేచెలి మారుగొండ లెక్కెను
కొండుకపాయాన నొంటి గుహలో గూచుండఁగాను
దుండగము సేసేవంటా తొడ యెక్కెను ॥ఇంత॥

పాడితోఁ బగర గెల్చి పారుపత్యాలు సేయఁగా
యీడనే సరిగద్దె నెదురెక్కెను
యీడులేనిదొరవై యెడ మిచ్చుకుండఁగాను
తోడివారికంటే ముందు తొడ యెక్కెను ॥ఇంత॥

వెల్లవిరిఁ బ్రహ్లాదునివినతులు వినఁగాను
వొల్లనే సంతతము నీవుర మెక్కెను
అల్లదె శ్రీవేంకటేశ అహోబలాన నుండఁగా
తొల్లిటినీలకిమమ్మ తొడ యెక్కెను ॥ఇంత॥ **328**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ నృసింహ కీర్తనలో ఒక పొరపాటు దొర్లింది. స్వామి చండినది (చెండాడినది) హిరణ్యాక్షుని కాదు వాడి అన్న హిరణ్యకశిపుని. ఈ అన్నగారినే హిరణ్యుడు అనికూడా పిలుస్తారు. వాడిని చెండాడిన తరువాత ఆ ఉగ్రమూర్తి బ్రహ్మాది దేవతల స్తోత్రాలకు శాంతించలేదు. ప్రహ్లాదుని వినతులకు, శ్రీలక్ష్మి వలపు సంకెలలకు చిక్కివశుడై ఆమెను తన అంకపీఠిక నెక్కించుకొన్నాడు. అన్నట్లు ఈ అహోబల నరసింహమే వేంకటాద్రి శృంగారరాయడు.

**భావ దీపిక :**

ఇంతలో విచారము ఎట్లుండెను (దనుజుని చీల్చి చెండాడేలోపునే ఇతని ఆలోచనలు ఇట్లా మారిపోయెను). పంతములనే పొలమును దున్నకముందే, వలపులనే పంట పండెను. ఆ వైనము చిత్తగించండి. చండిహిరణ్యుని, సరసములాడగ (వరాలను సరసముగా నిరుపయోగం చేయగా) భీతిల్లిన శ్రీలక్ష్మి యెదురుగానున్న కొండనెక్కెను. కొండొక పాయాన (చిన్న వయసు చిన్నది) ఒంటరిగా ఒక గుహలో కూర్చుండెను. దుండగము సేసేవంటా (హత్య చేశావని) భయముతో స్వామి తొడపైనెక్కెను. నృసింహుడు ధర్మబద్ధంగా, పగరన్ (శత్రువును) గెలిచి పారుపత్యాలు (అధికారం) చెల్లుబడికాగా ఇవతల కొండపై గద్దెనెక్కెను. సాటిలేని దొరవైన వెంటనే తోడివారందరి కంటే ముందుగానే సాహసంతో స్వామి తొడపైనెక్కినదా శ్రీదేవి. మనోజ్ఞముగా ప్రహ్లాదుడు వినతులు సేయ విని ఆమె శాశ్వతముగా నీ వురము నధిష్టించెను. అల్లదిగో, వో శ్రీవేంకటేశా! నీవు అహోబలమున నెలకొనగా నీ తొల్లిటి లకిమమ్మ (ఆదిలక్ష్మి) నీ తొడ యెక్కినది.



సంఖ్య : 470 సంపుటము : 25 పుట: 314 రాగం : కాంబోది

**39** నీకుఁ జూడ వినోదాలై నిండుకవున్నవి గాక
కైకొన్నపతిగుండెలో గాలములుగావా ॥పల్లవి॥

తలఁపులోఁ దగిలి యాతని భ్రమయించేవి నీ-
మొలకనవ్వులేకావా ముదిత నేఁడు
చలివాపి రమణుని సారెకుఁ బైకొలిపేవి
పలచనిపెదవిపై పలుకులేకావా ॥నీకు॥

ఆయాలు సోఁకి యాతనియాసలు పెడరేఁచేవి
సోయగపునీకనుచూపులేకావా
వాయపుమదములు గొబ్బన నూరఁజేసేవి
చాయల మెఱుఁగుల నీచన్నులేకావా ॥నీకు॥

చిందువందుగా మేను చెమరింపఁజేసేది
కందువరతుల నీకాఁగిలేకాదా
అందపు శ్రీవేంకటేశు నన్నిటానుఁ గూడితివి
సందడించేమీఇద్దరిసన్నలేకావా ॥నీకు॥ **470**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో దేవితో యేమని అంటున్నారో వినండి. దేవీ! నేను చెప్పబోయే సంగతులు నీకు వినోదాలుగా వుంటాయిగాని నీవు నీపతికి గుండెలో గాలము వంటిదానవు కావా? నీమేను చెమటలతో ముద్ద అయిపోయింది, ఎందుకమ్మా? కందువ రతుల నీకౌగిలివల్లనేకదా! అంటే...

**భావ దీపిక :**

దేవీ! చూడబోతే నీకు వినోదాలు పుష్కలంగా వున్నాయమ్మా! అసలు ఆయనని కైకొన్న (వశము చేసికొనిన) నీ చూపులు నీపతి గుండెలో గాలములు కావా? తల్లీ! నేను చెప్పేది నిజమమ్మా! నీ చిరునవ్వులు నీపతి తలపులను వదలక భ్రమింపజేస్తూనే వుంటాయి. ఓ ముదితా! నేడు చలివాపి (నిస్సంకోచంగా) నీమగనిని ప్రతిసారి ప్రేరేపించేవి పలచని నీపెదవులు పలికే తీయని పలుకులు కావా? తల్లీ! సోయగాల నెలవులైన నీ కనుచూపులే కదా! తల్లీ! నీ పతి అంగాంగాలను సోకి ఆయన ఆశలను ప్రేరేపిస్తాయి. గొబ్బన (గబుక్కున) ఆయనగారి వాయపు మదములను (గర్వమును పెంచేవి) వూరేటట్లుచేసేవి కాంతులీను నీ ఉరోజములే కదా? తల్లీ! ఆయనగారి శరీరమంతా చెమటలు చిందునట్లు చేసేది రతికౌశలమును ప్రదర్శించు నీ బిగి కౌగిలియే కదమ్మా? అందమైన శ్రీవేంకటేశుని అన్ని విధములా కూడినదానవు. మీ ఇరువురి సైగలేకదమ్మా! మాకు గొప్ప సందడి.

సంఖ్య : 365 సంపుటము : 25 పుట: 244 రాగం : వేళావళి

**40** మానుమంటే మీమాటకు మానఁబోయీనా
మోనాన నూరకుండరే ముద్దుగారీ వీఁడు ॥పల్లవి॥

వేడుకపడి వీఁడు వెన్నలు దొంగిలనీరే
వాడలవాడల నట్టే వలవనీరే
కోడెకాఁడై తిరిగీని కొంగులు వట్టఁగనీరే
జాడలెఱిఁగినయట్టిసాదుఁగొయ్య వీఁడు ॥మాను॥

చనవు మెరసీనేమో చన్నులు ముట్టఁగనీరే
తనియఁడేమో కాఁగిటఁ దగులనీరే
చెనకీనేమో మీపై చేతులు చాఁచఁగనీరే
ననిచివుండరే మీరు నసగొంటు వీఁడు ॥మాను॥

ఆసపడీనేమో తేనె కధరము లంటనీరే
పాసివుండఁజాలఁడేమో పైకొననీరే
వేసరక మిమ్మేలె శ్రీవేంకటాద్రికృష్ణుఁ డిదె
అసుద్ధులెల్లా మెచ్చరే ఆగడీఁడు వీఁడు ॥మాను॥ **365**

**మున్నుడి :**

ముద్దుగారీ మోహనకృష్ణునిపై శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. మీరు చెప్పే "మానరా" అనే మాటలు విని వీడు వీడి "చిలిపి పనులు" మానుతాడా యేమి? మౌనంగా వూరక వుండండే. చిన్నప్పుడు వెన్నల దొంగ, ఇప్పుడు కన్నెల దొంగ అని చెవులు కొరుక్కుంటున్నారు గోపికలు ఆ వేంకట కృష్ణయ్య "సాధుగొయ్య" అట. "నసగొట్టు" అట. "ఆగడీడు" అట. అంటే యేమిటో తెలియాలంటే... భావదీపిక చూడండి.

**భావ దీపిక :**

ఓ చెలియలారా! వీడు (శ్రీకృష్ణుడు) మానుమని మీరు చెప్పే నీతిమాటలు విని మానబోయీనా (మానేస్తాడా యేమి?) మీనోరెందుకు పాడుచేసికొంటారు? మౌనంగా వూరక వుండండే. వీడు ముద్దుగారే యశోద ముంగిటిముత్యము. వీడికి వెన్నలు దొంగతిండి అలవాటు, దొంగిలనీయండే. రేపల్లెవాడలలో వలపులు కొనసాగించనీయరే. వీడు కోడెవయసువాడు "కొంగులు" పట్టుకొని తిరుగుతాడు. పట్టుకోనీయండే. మనందరి మనస్సులు తెలిసిన వీడు, "సాదుగొయ్య" (సాధువులా కనిపించే దుర్మార్గుడు). వీడు అతి చనవుతీసికొని చన్నులు ముట్టుకొంటాడు. మీరువద్దంటే వింటాడా? ముట్టనీయండే. పాపం, వీడికి తృప్తి తీరదేమో, మీ కౌగిళ్ళలో తగులుకోనీయండే. మిమ్మల్ని స్పృశిస్తాడేమో, జంకెందుకు మీపై చేతులు వేయనీయండి. మీరుమాత్రం, ననిచివుండరె (ఇష్టము చూపించండి). ఎందుకంటే వీడు "నసగొంటు" (కామోద్రేకం బాగా వున్నవాడు). వీడికి తేనెలంటే తెగ ఇష్టం. మీ అధరాల తేనెలను జుఱ్ఱుకోనీయండే. పాపం, మిమ్మల్ని వదలి వుండలేడేమో! పైకొననీయరే (ఆక్రమించుకోనీయండి). వేసరక (విసుగులేక) మిమ్మల్ని యేలే శ్రీవేంకటకృష్ణయ్య వీడు. ఆ కథలనన్నింటినీ విని మెచ్చుకొనండి. ఎందుకంటే, వీడు "ఆగడీడు" (కొంటె కోణంగి).



సంఖ్య : 461 సంపుటము : 25 పుట: 308 రాగం : నాదరామక్రియ

**41** ఎగ్గువట్టేవు గనక యిదివో వోయి
సిగ్గుతోడ నుండేనన్ను చిత్తగించవోయి ॥పల్లవి॥

మొగము చూచి నీకు మొక్కేనంటా రాఁగాను
నగవు వచ్చీనోయి నాసెలవుల
పగటున నే నీకు పాదాలొత్తేనంటా రాఁగా
జిగిఁ జెమటలు చేతఁ జిప్పిలీనోయి ॥ఎగ్గు॥

వేడుకతోడ నీకు విడెమిచ్చేనంటా రాఁగా
తోడనే తమకములు తొలఁకీనోయి
వోడక నీపానుపుపై వొద్దనుండేనంటా రాఁగా
నీడల రెండుచేతులు నిన్నలమీనోయి ॥ఎగ్గు॥

మిక్కిలి నే నిన్నుఁ గూడి మెచ్చేనంటా రాఁగాను
పెక్కుపరవశములు పెరిగీనోయి
అక్కరై శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
తొక్కరాఁగా నీపాదము తొలుతే మీఁదోయి ॥ఎగ్గు॥ **461**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో దేవి అలమేలుమంగ స్వామితో తన ఇబ్బందిని చెప్పుకొంటున్నది. నన్ను చిత్తగించు స్వామీ! నా యెగ్గులెంచి ప్రయోజనమేమి? నేనేమో సిగ్గులమొగ్గను. నీవేమో అనంతమూర్తివైన ఆదిదేవుడవు. నాకు నీపాదాలొత్తటం కుదురుటలేదు. పాన్పుపై వొద్దజేరుట కుదురుట లేదు. నీ పాదములను తొక్కటం కూడా సాధ్యం కావటం లేదు. ఎందుకో... ఇంతకీ ఆయన ఆమె విభుడా? విశ్వరూపుడా?

**భావ దీపిక :**

ఇదిగో వోయీ! నన్ను ఎగ్గుపట్టేవు గనక (నిందిస్తున్నావు కాబట్టి), చిత్తగించవోయీ (నామొర ఆలకించు). సిగ్గులు అధికమైన నన్ను నీమాయలకు గురిచేయనేల? నీ వదనారవిందమును గాంచి నమస్కరిద్దామంటే, నా సెలవులపై (చిగురుటధరములపై) నగవులు వొచ్చీనోయి. అన్ని ముఖాలైతే, దేనికి నమస్కరించనుస్వామీ? నీపాదాలొత్తుదామంటే కుదురుట లేదు. భయంతో చెమటల చిత్తడి అయిన చేతులు జారిపోతున్నాయి. స్వామీ! వేడుకతో నీకు వీడెమిచ్చేనంటారాగా (తాంబూలమిద్దామని వస్తే) వెనువెంటనే నా పరవశత్వం తొలగీనోయి (తొలగిపోయింది). ఏదైతే అదయిందిలేయని నేను వెనుకకు తగ్గకు పాన్పుపై నీవొద్దనుండుటకు రాగా, నీ నీడలా నీ వెనుక మరొక రెండు చేతులున్నాయి. నాకు నోట మాటరాలేదు. సరే! మిక్కుటముగా నిన్ను గూడి మెచ్చుకొందామనుకొంటే అంతులేని పరవశత్వం నాలో పెరిగిపోయిందయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ దేవేరి అలమేలు మంగను. అయినా నామీదకూడా నీ మాయలు చూపుతావు. నేను నీ పాదాలు తొక్కుదామని అనుకొంటే అవి ఆకాశాన్నే కప్పేశాయి, త్రివిక్రమా!

సంఖ్య : 469 సంపుటము : 25 పుట: 314 రాగం : వరాళి

**42** వేగిరకానికి నేఁడు వెసలఁ బెట్టుమన్నట్టు
ఆగడాలు సేయవచ్చే వాస ఇంకా నెంతో ॥పల్లవి॥

విన్నపాలు సేయఁగానే వేమరు బుద్దెడిగేవు
కన్నులను మొక్కఁగానే గరిసించేవు
చన్నుల నొత్తఁగానే సాములు సేయవచ్చేవు
ఇన్నిటా వేగిరించేవు యేమి దలఁచితివో ॥వేగి॥

నిందుచెప్పరాఁగానే వెసఁ జవు లడిగేవు
పొందులు నేఁ జేయఁగానే పొదిగేవు
కందువకుఁ బిలువఁగా కడుఁదమకించేవు
సందడిఁ బెండ్లాడేవు జాణతన మెట్టిదో ॥వేగి॥

పానుపుపైఁ బండఁగానే పదరి కాఁగిలించేవు
ఆనుక మోవియ్యఁగానే ఆసపడేవు
కానీలే శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
సానఁబట్టేవు చూపులు సమరతు లెట్టివో ॥వేగి॥ **469**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో నాయిక స్వామి ఆతృతకు ఆటపట్టిస్తున్నది. ఆత్రం వున్నవాడికి నేడే అన్నీ కావాలన్నట్లు నీకెంత ఆశవున్నదయ్యా? పైగా నాతో అఘాయిత్యం చేయవచ్చేవు. ఇదేమి పద్ధతి? నీతో సమరతియెట్టిదో కాని నన్ను మాత్రం చూపులతోనే, నీవు సానబడుతున్నావు – అంటున్నది.

**భావ దీపిక :**

స్వామీ! వేగిరకానికి (ఆత్రము వున్నవాడికి) నేడు (ఇవ్వాళే) వెసలబెట్టుము (అన్నీ అమరించండి) అన్నట్లు, నీకు ఆశ యెంత వున్నదయ్యా? ఇంత ఆగడం చేయవచ్చేవు. నీతో వినయంగా మాట్లాడగానే నా అభిప్రాయం అడుగుతున్నావు. నేను కన్నులు దించుకోగానే గరిసించేవు (ఘర్షణ ప్రదర్శిస్తావు). నా కుచములతో నిన్ను వొత్తగానే ఇష్టంలేనట్లు పోట్లాడుతావు. ఇప్పుడు ఇంత తొందరబెడుతున్నావు. అసలేమనుకుంటున్నావు? నిన్ను విందుకు పిలుద్దామని రాగానే వంటల రుచి అడుగుతావు. నీతో పొందుకు అంగీకరించగానే, పొదిగేవు (ఆక్రమించేవు). నిన్ను కందువకు (చాటుకు) పిలువగానే తన్మయత్వంలో ముంచేవు. అంతేకాక సందడితో నన్ను పెండ్లాడావుకూడా. నీ జాణతనం యెట్లాంటిదో యేమి చెప్పను? నేను (దేవి) పాన్పుమీద పడుకోగానే పదరి (తొందరగా) కౌగలించుకొంటావు. ఆ తరువాత నా అధరము నందించగానే ఆశపడేవు. ఓ శ్రీవేంకటేశా! కానీలేవయ్యా! నన్నిట్లా కలిసితివి. ఆపై నన్ను నీ చూపులతోనే సానబడుతున్నావు. ఇక నీ సమరతులెట్లా వుంటాయో, మరి?



సంఖ్య : 331 సంపుటము : 25 పుట: 221 రాగం : భూపాళం

**43** నీ వెఱఁగనిదా యేమి నేనెంత విన్నవించే
కైవశమై వుండఁగానే గయ్యాళిఁ జేసేవు ॥పల్లవి॥

నగితేను నీతోను నంటు నటించఁగవద్దా
మొగము చూచితేను మొక్కవద్దా
పగటునఁ బేరుకొంటే పైపై నూఁకొనవద్దా
వెగటున మమ్మేల వీరిడిఁ జేసేవు ॥నీవె॥

మన్నించితే నీతోను మాటలాడనైనవద్దా
కన్నుసన్నలు చేసితే కరఁగవద్దా
చన్నులు నీవంటఁగాను జంకించనైనవద్దా
ఇన్నిటా మమ్మిందుకేల యెడ్డలఁ జేసేవు ॥నీవె॥

చెనకఁగ నీతోను చెలిమి సేయఁగవద్దా
పెనఁగితే నించుకంత బిగియవద్దా
యెనసితివి శ్రీవేంకటేశ చమ్మటూరిలోన
తనియక మమ్మునేల దంటలఁ జేసేవు ॥నీవె॥ **331**

**మున్నుడి :**

చమ్మటూరిలో వెలసిన వేంకటరమణునిపై శృంగారకీర్తనను వినిపిస్తున్నారు అన్నమయ్య. స్వామీ! నీపై నాకున్న వలపు నీవెఱగనిదా యేమిటి? నీతో నేను విన్నపాలు చేస్తూ నీకు కైవశమై వున్నాను. అయినా నీవు నాపై గర్వం చూపుతున్నావు కాని ప్రేమ చూపటం లేదు. నా కుచములను నీవు తాకితే వద్దని మందలింపుగా చూచినా తప్పేనా స్వామీ? అంటున్నదా అమాయకురాలైన నాయిక.

**భావ దీపిక :**

స్వామీ! నేను నీకు యెంత విన్నవించేనో నీవెఱుగవా? నా ప్రేమకు కైవశమైనట్లు (స్వాధీనుడవైనట్లే) వుంటావు. కాని అంతలోనే గయ్యాళించేవు (గర్వం చూపుతావు) ఇదేమిటయ్యా? నేను నీతో నవ్వుతుంటే కనీసం నీవు నాకు చేరువయైనట్లు నటించనైనావద్దా? నీవు నా మొగమును తేరిపార చూస్తుంటే నేను మొక్కవద్దా? (తలదించుకోవద్దా?) నీవు నన్ను నలుగురిలో పేరుపెట్టి పిలిస్తే నేను "వూకొట్టడమే" తప్పయిపోయిందా? అసహ్యంగా యేమిటా వీరిడితనం (మొండితనం)? నీవు నన్ను ఆదరిస్తే నేను నీతో మాటలు కలిపాను. అదీ తప్పేనా? నీవు నాకు "కన్నుకొడితే"లేని తప్పు నేను పరవశిస్తే వచ్చిందా? నీవు నా కుచగిరులపై చేయివేస్తే నలుగురూ చూస్తున్నారని, బెదరింపుగా చూశాను. ఇంతదానికే మమ్మెందుకు యెడ్డలు (మూర్ఖత్వం) చేసేవు. నీవు నన్ను స్పృశిస్తే నేను స్నేహం చూపాను. అదీ తప్పేనా? నీవు నాతో పెనగులాడితే నేను బింకం చూపించాను. స్వామీ! అదీ నేరమేనా? నీవు చెమ్మటూరిలో వెలసిన శ్రీవేంకటేశ్వరుడవు. నిరవధికంగా మాపై నీ దంటుతనం (దిట్టతనం) యెందుకు చూపిస్తావు?

సంఖ్య : 460 సంపుటము : 25 పుట: 308 రాగం : లలిత

**44** ఈపాటివాఁడవు యెట్టు పొందుసేసితివి
వోపికగలవారికి వొదుగనేలా ॥పల్లవి॥

పిలిచీఁగదయ్య నిన్నుఁ బ్రియురాలు
చెలఁగి యేల పరాకుసేసుకొనేవు
చెలులము మేము వింటే సిగ్గయ్యీనా
బలవంతులకు మరి భయమున్నదా ॥ఈపా॥

బాగాలిచ్చీ నీప్రాణబందుగురాలు
చేవ(గ?)దేర నీవేల చేయొగ్గవు
నీగుణాలు చూచి నేము నేమెంచేమా
వేగిరపువారికి కింత విచారించనున్నదా ॥ఈపా॥

యెనసీఁగదవయ్య నీయిచ్చకురాలు
మనసిచ్చి నీవేల మాఁటలాడవు
అనుఁగుశ్రీవేంకటేశ అలమేలుమంగ యాపె
ఘనులైనవారికి కదుఁగొంక నున్నదా ॥ఈపా॥ **460**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవి మన భాషలో అంత సులభగ్రాహ్యం కాదు. దీన్ని నేనిట్లా అర్థం చేసికొన్నాను. స్వామీ! నీవు అంత సమర్థుడవు కదా! యెట్లా సంయమనంతో అనుకూలుడవయ్యావు? శక్తిసామర్థ్యాలున్నవారికి ఇంత అణుకువ, లొంగుబాటు చాలా అరుదు. అయినా ఆమె నీ దేవేరి, నీ ప్రాణసఖి కదా! మనసిచ్చి మాట్లాడవెందుకు? గొప్పవాళ్ళు సంకోచించుట తగునా? స్వామీ!

**భావ దీపిక :**

స్వామీ! నీవు ఈపాటివాడవు (అంతటి గొప్పవాడవు). ఈమెతో యెట్లు పొందుసేసితివి (వలచితివి?) ఇదేమి చోద్యం. ఓపికగలవారికి (శక్తిసామర్థ్యాలున్నవారికి) వొదుగనేలా? (అణుకువ, లొంగుబాటు, యెందుకు?) నీ ప్రియురాలు (దేవి) తానే నిన్ను పిలిచింది కదయ్యా? ఇంకా అతిశయించి పరాకు చూపతగునా? పోనీ, చెలులమైన మేమున్నామని సిగ్గా? మేము మీమాటలు వినంలే. అయినా నాకు తెలియక అడుగుతున్నాను, బలవంతులకు భయం యెందుకయ్యా? బాగాలిచ్చి (జీవితంపంచుకొన్న) ప్రాణబాంధవి ఈ దేవి. నీవెందుకు చేవజూపి ఈమెకు చేయూతనీయవు? నీప్రవర్తన చూచి నీ ఆంతర్యం తెలియక మేము నిన్ను తప్పుపడుతున్నాము. వేగిరపు వారికి (తొందరపాటువారికి) తగిన ఆలోచన వుంటుందా ప్రభూ! దేవా! నీ ఇచ్చకురాలు (ప్రియురాలు) యెనసీనయ్యా! (అతిశయించుచున్నది). మరి నీవేల ఆమెతో మనసిచ్చి మాట్లాడవు? ఓ శ్రీవేంకటేశా! ఆమె నీ ప్రియమైన అలమేలుమంగ. ఘనులైన వారికి జంకూ గొంకూ వుంటాయా ప్రభూ?



సంఖ్య : 333 సంపుటము : 25 పుట: 223 రాగం : ముఖారి

**45** ఆఁటదాని కోపవా అంతేసి నీవు
యీటువెట్టి సలిగె నీ విచ్చినదేకాదా ॥పల్లవి॥

చలములేనిమగువ సాదించ నోపునా
వలెనని యాపె నీతో వాదించీఁగాక
బలిమి లేకుంటేను వంతమాడనోపునా
కలుగఁగానే నిన్ను గద్దించెఁగాక ॥ఆఁట॥

నేరుపులేనిమగువ నీతో పొందుసేసునా
చేరి యందుకొరకె చెనకీఁగాక
బీరములేనియాపె పెనఁగఁగనోపునా
ధీరత సాజముగాన దీకొనెఁగాక ॥ఆఁట॥

ననుపులేనిమగువ నవ్వ నీతో నోపునా
వొనరఁగానే చన్నుల నొత్తీఁగాక
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వెనక కిఁ (కిం?)దుకే యాపె విడె మిచ్చెఁగాక ॥ఆఁట॥ **333**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో స్వామితో చనువుగా యేమయ్యా నీవు ఆడుదానిని క్షమించలేవా? అమెకు వూరకనే ఇంత చనువిచ్చింది నీవే కదా? ఆమె ననుపులేని మగువ కేవలం నవ్వులతో సరిపెట్టుకొంటుందనుకున్నావా? సమయం చిక్కిందంటే... "భావదీపిక"లో వివరించినట్లు చేస్తుంది. [నేనిక్కడ చెప్పలేను ప్రభూ! (నేను కీర్తన చెప్పలేను కదా!)]

**భావ దీపిక :**

స్వామీ! నీవు ఆఁటదానికి (ఆడుదానిని చూచి) ఓపలేవా (ఆగలేకున్నావా?) ఈటువెట్టి (వేడుకతో) ఇదంతా ఆమెకు నీవిచ్చిన, సలిగె (చనువే) కాదా? ఆమె కొత్త పెళ్ళికూతురు. పంతము నెఱుగదు. ఆమెను సాధించవచ్చునా స్వామీ? పోనీ, కావలసి నీతో వాదించిందే అనుకో, యెంత దిట్టతనం లేకుంటే నీతో పంతమాడుతుంది? ఇట్లా కలిశారో లేదో నిన్నెలా గద్దిస్తున్నదో చూడవయ్యా? ఎంత నేర్పుగలదో మరొకరు చెప్పాలా? ఎంతో నేర్పుగా నీతో చెలిమి చేసింది. అందుకే నిన్నంతగా తాకుతూ వున్నది ప్రభూ! ఎంత బీరము (పౌరుషం) లేకపోతే నీతో పెనగగలదు? ఆమె "ధైర్య లక్ష్మి" కదా! ధీరత ఆమె సహజ గుణమయ్యా! తండ్రీ! ననుపులేని మగువ (అతిశయం లేని అబల) నీతో నవ్వుతూ మాట్లాడగలదా? వీలుచిక్కగానే నిన్ను తన కుచకుంభములనొత్తగలదా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతలోనే నీవు నన్నునూ యేలితివి. అందుకే ఆమె నీకు ఆకుమడిచి యిచ్చే అర్ధాంగి అయింది.

సంఖ్య : 332 సంపుటము : 25 పుట: 222 రాగం : ధన్యాసి

**46** రావే యెక్కడిసుద్ది రాఁపుసేతురా పతిని
సేవలు చిత్తమురాను సేయఁగదవే ॥పల్లవి॥

చిగురులోపలిచేఁగ చిత్తములోపలికాంక్ష
మొగములోఁ గళలై మొలచెఁగదే
యెగసక్కెమాడెనటె యెఱఁగనటె నేను
మగనితో నలుకలు మానఁగదవే ॥రావే॥

పాలమీఁదిమీఁగడ పాయములోనిమదము
జాలువారీఁ జెమటలై చన్నులఁ గదే
యేల నీతోఁ జలమటెయిచ్చక మెఱఁగనటె
కాలుదొక్కి వుండఁగాను కాఁతాళించనేఁటికే ॥రావే॥

కనకములోనివన్నె కాఁగిటిలోనిప్రియము
కనుచూపువేడుకలై కలిగెఁగదే
యెనసె శ్రీవేంకటేశుఁ డిద్దరికిఁ జెలిఁగదే
ననుపై మీరిట్టె మీలో నవ్వఁగదరే ॥రావే॥ **332**

**మున్నుడి :**

స్వామికి, దేవికి వుమ్మడి స్నేహితురాలననే భావనతో అన్నమయ్య ఈ శృంగారకీర్తన చెబుతున్నారు. ఇదే పల్లవిని నేటి భాషలో చెప్పాలంటే... ఇటు రావమ్మా! యేమి కథలు చెబుతావు? మొగుణ్ణి ఇంత ఘర్షణ పెట్టవచ్చా? అయిందేదో అయింది. మనస్ఫూర్తిగా ఆయనకు సేవలు చేయవమ్మా! పతిని కౌగలిస్తే దానిలో నీ ప్రేమ కనుచూపుల్లో కనబడాలి. అప్పుడు బంగారానికి వన్నె వచ్చినట్లుంటుంది. అన్నమయ్యకు సాటిలేరు, రారు.

**భావ దీపిక :**

ఓదేవీ! రావే (ఇటురావమ్మా!) యెక్కడి సుద్ది (యేమి కథలు చెబుతావు?) పతిని యెవరైనా, ఇంతరాపుసేతురా (ఘర్షణ పెడతారా?) చిత్తమురాను (మనస్ఫూర్తిగా) సేవలు సేయగదవే! (ఆతనిని సేవించవమ్మా!) చిత్తము లోపలి కాంక్ష చిగురుకొమ్మకు పట్టిన చేగ లాంటిది. ఆ కాంక్ష, నీమొగములోనే కళల (భావముల) వలె, మొలచెగదే (పొడ చూపుతాయే). ఆయన నీతో పరాచికాలాడుతున్నాడని కూడా నీకు తెలియదా? మొగుడిమీద అలుకలు మానవమ్మా! పాయములోని మదము (యౌవనగర్వం) పాలమీద మీగడలాంటిది (వేడిలో అది సహజం). అది చన్నులపై చెమటల వలె మార్పు చెందుతుంది. నీతో ఆయనకు పంతమెందుకో ఆమాత్రం తెలియదా? కాలుదొక్కినావు కదా! (పెండ్లాడావుకదా!) ఇప్పుడు కాతాళించనేటికి (చిరాకుపడితే యెలాగమ్మా?). కౌగలిలో ప్రేమ బంగారపువన్నెలాగ కనుచూపులోనే నవ్వువలె కనబడుతుంటుంది. ఈ శ్రీవేంకటేశుడు మీ ఇద్దరికి (శ్రీదేవికి, భూదేవికి) చెలికాడై అతిశయించినాడు. ఇకనేమి? మీరిరువురూ మనసారా నవ్వుకోండి.



సంఖ్య : 336 సంపుటము : 25 పుట: 225 రాగం : హిందోళవసంతం

**47** వింతదాననా నేను వేమరు నింత సేయను
అంతరంగమే నేను అడ్డమాడ ననవే ॥పల్లవి॥

తలపోఁతలేకావా తమకములు రేఁచేవి
చలములేకావా మతి సాదింపించేవి
నిలువు మొక్కులేకావా నివ్వెరగుఁ బొందించేవి
అలసితి నన్నిటాను అంతకోపననవే ॥వింత॥

సిగ్గరితనమేకాదా చేతికి లోనునేసేది
కగ్గనినవ్వులేకావా కాఁక రేఁచేవి
వొగ్గినమాఁటలేకావా వొడివట్టి తీయించేవి
అగ్గమై వుందాన నిఁక సంతకోపననవే ॥వింత॥

కందువ చూపులేకావా కాఁగిటఁ బెనఁగించేవి
సందడి వలపేకాదా చవిసేసేది
యిందుకె శ్రీవేంకటేశుఁ డింటికి విచ్చేసి కూడె
అందమాయ వేఁడుకొనీ నంతకోపననవే ॥వింత॥ **336**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగారకీర్తనలో దేవి తన చెలికత్తెయైన అన్నమ్మతో యేమని వాపోతున్నదో వినండి. నేటి భాషలో చెప్పాలంటే ఈ పల్లవి యిలా వుంటుంది. మాటిమాటికీ నన్నింత చిన్నబుచ్చటానికి నేనేమన్నా పరాయిదాననటే? స్వామి అంతరంగంలో నేనేకదే! వున్నది. నీవైనా నేను ఆయనకెన్నడూ యెదురు చెప్పననవే. ఆయనగారి కొంటె చూపులే కౌగిట్లో పెనవేయునట్లు చేస్తాయి. స్వామి వలపులు జీవన మధురిమ రుచి చూపుతాయి.

**భావ దీపిక :**

చెలీ! వేమరు (పలుమార్లు) స్వామి నన్నింతసేయను (నాకిట్లు చేయుటకు) నేను వింతదాననా (పరాయిదానినా?) నేను ఆయన అంతరంగమును (హృదయవాసినినే కదా!). నీవైన ఆయనకు నేను అడ్డమాడననవే (అడ్డు చెప్పనని విన్నవించవే). ఆయన తలపోతలే కదటే నాలో మైమరపు పెంచేది? నాలోని పంతములేకదా! నా మనస్సును సాధిస్తున్నవి. అతగాని నిలువు మొక్కులే నాకు సంభ్రమాన్ని కలిగిస్తాయి. ఆయనగారి ఈ నటనలు చూసి చూసి అలసిపోయాను. అంతకోపననవే (ఇంత నటనకు నేను తగనని చెప్పవే). ఆయన చూపే సిగ్గరితనము (బిడియం) ఆయన చేతికి నేను లొంగేట్లు చేస్తుంది. ఆయన కగ్గని నవ్వులే (నిష్కళంకమైన చిరునవ్వులే) కదా! నాలో కామాగ్నిని రేపేది. ఆయన వినయపూర్వకమైన మాటలే కదా! వొడివట్టి తీయించేది (నిలబెట్టి ఆపుచేసేది). ఆయనకు అధీనమై వున్నదానను. అంత లొంగుబాటు నాకు వుచితమా? ఆయన కొంటె చూపులేకదా! నన్నాయన కౌగిటిలో బంధించేవి? తొందరబెట్టే ఆయన వలపులే కదా! నాకు చవులూరించేవి. ఇంతలో శ్రీవేంకటేశుడు నా ఇంటికి విచ్చేసి నన్ను కూడినాడు. అందముగా నన్ను వేడుతున్నాడు. నేనందుకు తగుదునటే?

సంఖ్య : 364 సంపుటము : 25 పుట: 2 రాగం : ఆరిభి

**48 అటువంటివారమే అందరము**
**తటుకన మమ్మునేల తగ వడిగేవు ॥పల్లవి॥**

**సాదై యుండినయాపెను సవతులకని వెట్టి**
**సేదదేర్చి గయ్యాళిగఁ జేసితివి**
**సాదించి బొమ్మల నిన్ను జంకించక మానునా**
**దాదాత మమ్మునేల తగ వడిగేవు ॥అటు॥**

**యేనెపమెఱఁగనాపె నెగ్గులెంచ నేరిపి**
**నానాట నిందరికి మొనవెట్టితివి**
**సొనఁబట్టినచూపుల సాదించవలదా నిన్ను**
**దానికిఁగా మమ్మునేల తగ వడిగేవు ॥అటు॥**

**పీఁటపైఁ బెండ్లియాపెఁ బెద్దరికా లిచ్చి కూడి**
**మేఁటి కాంతలమాటలు మీరించితివి**
**గాఁటపుశ్రీవేంకటేశ కత గరచే నన్నిటా**
**తాటించి మమ్మేల యిఁకఁ దగ వడిగేవు ॥అటు॥ 364**

**మున్నుడి :**

అన్నమయ్య స్వామిని వలచిన వనిత. కాని ఆమెకు దేవిపై యెనలేని గౌరవం. మేమంతా నీపై చెల్లుబాటుకాని ప్రేమను పెంచుకొన్నవారమే. నీవు మమ్మల్నే న్యాయం చెప్పమంటే మేమేమి చెప్పగలమయ్యా? నిజానికి ఆమె (దేవి) గొప్ప సాధువు. ఆమెకెంతోమంది సవతుల పీడ తగిలించావు? పెద్దలముందు పెండ్లాడిన ఆమెను కూడినాడవు, ముత్తైదువల మాటలను వినినీయకపోతివి. ఇప్పుడు మమ్మల్ని న్యాయమడిగితే లాభమేమిటి స్వామీ?

**భావ దీపిక :**

స్వామీ! మేమందరమూ అటువంటివారమే (నిన్ను వలచి నీవు కావాలనుకొన్నవారమే) చట్టుక్కున నీవేల మమ్మే తగవడిగేవు (న్యాయము చెప్పమనేవు?) నీవు సాధ్వియైన దేవిని సవతులకు వెట్టి చేయించి గయ్యాళిగా తీర్చిదిద్దావు. నిన్ను సాధించుటకు, ఆమె బెదిరింపుగా చూడకమానుతుందా? దాదాత (గట్టిగా) తగవు తీర్చమని మమ్మెందుకు అడుగుతున్నావు స్వామీ? ఏ నెపమూ వేయని ఆ ఇల్లాలైన ఆమెను దోషములెంచుదానిగా మార్చినావు స్వామీ! చివరకు అందరినీ ఇబ్బందిపెట్టావు. వాడియైన చూపులు నిన్ను సాధించకమానునా? దానికోసం మమ్ము న్యాయం చెప్పమనటం నీకు తగునా? పీటలమీద పెండ్లాడి ఆమెకు పెద్దరికమునిచ్చి (దేవేరిని చేసి) ఆమెను కూడితివి. ఆమె మేటి కాంతల (ముత్తైదువుల) మాటలను వినినీయవైతివి. ఊరించే శ్రీవేంకటేశా! అన్నిట్లోనూ నీవు కథలు చెప్పేవాడివే. ఇక మమ్మల్నే న్యాయం చెప్పమంటే మేమేమి చెప్పము?



సంఖ్య : 334 సంపుటము : 25 పుట: 224 రాగం : సాళంగనాట

**49 మారుమాట లాడకురే మగుడ నాతనితోను**
**చేరి చెప్పినట్టెల్లాఁ జేసే నేను ॥పల్లవి॥**

**చలపాదితనమే సాజమైనవాఁడు**
**వలచితే విడుచునా వనితలను**
**పెలుచుఁదనాలకెల్ల పెంటపట్టయినవాఁడు**
**వొలిసి విరహమున కోరువఁగలఁడా ॥మారు॥**

**వుద్దండవుచేఁతలకే వొడిగట్టినవాఁడు**
**గద్దించితే మానునా కాంతలనెల్ల**
**పొద్దువొద్దు మాయలచే పోదికాఁడయినవాఁడు**
**అద్దుకొన్న ప్రియాలెల్లా నాడి పొందకుండునా ॥మారు॥**

**తమకమే వొకరూపై తనివినొందనివాఁడు**
**జమళిఁ గూడకుండునా సతులఁ గంటే**
**అమర శ్రీవేంకటేశుఁ డన్నిటా నన్ను నేలె**
**సమమోహములు పైపైఁ జల్లుకొనవలదా ॥మారు॥ 334**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన యీ శృంగారకీర్తనలో దేవి పలువురు వనితలకు గొప్ప సలహానిస్తున్నది. స్వామికి యెదురు చెప్పినందువలన ప్రయోజనమే లేదు. అందుకే నేనే ఆయన చెప్పినట్టెల్లా చేస్తున్నాను. ఆయనకు మొండితనం సహజగుణము. ఏవో మాయ మాటలు చెప్పి వనితలను పొందకుండా వుంటాడా? ఆయన పారవశ్యానికి మరొక రూపం. సతులను చూస్తే జంటగా కూడకుండా వుంటాడా?

**భావ దీపిక :**

ఓ సతులారా! మగుడ (మరల) ఆతనితో (స్వామితో) మారుమాటలాడకురే (యెదురు చెప్పకుడు). నేనుకూడా ఆయన చెప్పినట్లే చేస్తాను. చలపాది తనము (మొండితనమే) తన సహజగుణమైనవాడు వనితలను చూస్తే వూరకే ప్రేమించకుండా వుంటాడా? పెలుచుదనానికి (పెడసరిప్రవర్తనకు) పెంటపట్టయినవాడు (రాశిపోసినవాడు) మెలిపెట్టే విరహానికోర్వగలడా. ఉద్దండపు చేతలకే (అఘాయిత్యానికే అలవాటుపడినవాడు నేను గద్దించినా, కాంతల గూడకమానునా? ఏపొద్దయినా మాయలచేత పోదికాడైనవాడు (వైభవోపేతుడై వున్నవాడు) అతికినట్లు ప్రియమైన మాటలు చెప్పి తను వలచిన వారిని పొందకుండా వుంటాడా? తమకమే (పరవశత్వమే) రూపుదాల్చినవాడు తనివి తీర్చుకోకుంటాడా? సతులను కూడక వదలిపెడతాడా? అమరిన శ్రీవేంకటేశ్వరుడు అన్నివిధములా నన్నేలినాడు. ఇరువురికీ సమమైన మోహములను పైపై చల్లుటయే తగిన విధానము కదా!

సంఖ్య : 335 సంపుటము : 25 పుట: 224 రాగం : దేసాళం

**50** అందరి నడుగవయ్య అదేమని
సందడి నొకరొకరు సన్నలు సేసేరు ॥పల్లవి॥

పలుమారు నీవు నాకు బాసలెల్లాఁ జేయఁగాను
నలువంకల సతులు నవ్వేరు నిన్ను
కలయ నాగుబ్బలపై గందము పూయఁగాను
చలివాసి తామేల జాణతనా లాడేరు ॥అంద॥

అట్టె నీవు విడెమిచ్చి అసలు చూపఁగాను
దిట్టతనమున నదె తిట్టేరు నిన్ను
గుట్టున నీవు నాకు కొప్పు దువ్వి ముడువఁగా
పొట్టఁబొరుగున నుండి పొగడ వచ్చేరు ॥అంద॥

గక్కన నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగాను
చొక్కుచు సోలుచు వచ్చి చుట్టా లయ్యేరు
చిక్కితివి కడపలో శ్రీవేంకటేశ్వర నాకు
మక్కువతో నీదిక్కు మగిడి చూచేరు ॥అంద॥ 335

**మున్నుడి :**

కడపలో వెలసిన శ్రీవేంకటరమణునిపై శృంగారకీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఇప్పుడు ఆయన అన్నమ్మ. స్వామితో ఒక ప్రియురాలివలె యెంత చక్కగా చెబుతున్నారో వినండి. స్వామీ! కావాలంటే నీవే అందరినీ అడుగవయ్యా! మనిద్దరిని చూచి అందరూ వొకరికొకరు సైగలు చేసికొంటున్నారు. నాలాంటిదానికి నీవు బాసలు చేస్తుంటే నీ అమాయకత్వానికి వాళ్ళు నవ్వుకొంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! "అదేమిటి" అని అందరినీ అడుగవయ్యా! ఆ వనితలందరూ సందడిగా (గుసగుసలాడుకొంటూ) వొకరికొకరు మనగురించి సన్నలు సేసేరు (సైగలు చేసికొంటూ వున్నారయ్యా). అనేకమార్లు నీవు నాకు బాసలు యెన్నో చేశావు. అదిచూచి తోటి సతులందరూ నవ్వుకొన్నారు. నీవు నా కుచములపై గంధము పూయగా, ఆ వనితలంతా చలివాసి (సిగ్గువిడనాడి) వాళ్ళెందుకు జాణలవలె మాట్లాడుతున్నారు? ఆ విధంగా నాపై మమకారంతో నీవు నాకు ఆహ్వానతాంబూలము నిచ్చి నాపై ఆశ చూపించగా, వాళ్ళంతా యెంత నిస్సిగ్గుగా నిన్ను తిట్టేరు స్వామీ! రహస్యంగా నీవు నా జుట్టు దువ్వి కొప్పు ముడిచావని పొట్టబొరుగున నుండి (సమీపానికి వచ్చి) నన్ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. నీవు నన్ను వున్నట్లుండి కౌగలించుకోగానే అలుపు సొలుపులతో వాళ్ళంతటవాళ్ళే వచ్చి నన్ను తమచుట్టమని చెప్పుకొంటున్నారు. అదటుండగా కడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరా! నీవు నాకు మక్కువతో చిక్కగా, వాళ్ళంతా మరల తిరిగి నీదిక్కు చూచి వుండిపోయారు.



సంఖ్య : 327 సంపుటము : 25 పుట: 219 రాగం : శ్రీరాగం

**51** విన్నపము వినవయ్య వేసరుకోకువయ్య
వెన్న లారగించవయ్య వెస నున్న నుందును(?) ॥పల్లవి॥

కొప్పు జారెఁగదవయ్య కోనతిరువెంగళప్ప
ఇప్పుడే యెవ్వతె నిన్ను నింత సేసెను
పిప్పి సేసి మోవి ప్రియాననే తేనె లాని (నె?)
కప్పురము వేసుకొమ్మీ దప్పిగొనకుండును ॥విన్న॥

గోరు మేన నున్నదయ్య కోనతిరువెంగళప్ప
యీరీతి నిన్ను నెవ్వెతె ఇంత సేసేను
సారెకుఁ జెమరింపించె చన్నుల నొత్తి మేము
కోరి విసరించుకొమ్మీ కొంచి నానకుండును ॥విన్న॥

కూడెఁగదయ్య కళలు కోసతిరువెంగళప్ప
యీడనే యెవ్వతె నిన్ను ఇంత సేసెను
వేడుకతో నేలితి శ్రీవేంకటేశుఁడవే నన్ను
వీడెముసేసి నాకిమ్మీ వేసటగాకుండును ॥విన్న॥ 327

**మున్నుడి :**

అన్నమయ్య "కోన"లో వెలసిన తిరువేంగళనాతునిపై గొప్ప శృంగార కీర్తన వినిపిస్తున్నారు. నిఘంటువులతో కుస్తీపడితేగాని దీని వివరణ సాధ్యంకాలేదు. ఆస్వామికి వెన్న నైవేద్యంగా పెట్టేవారేమో ఆరోజుల్లో. మా విన్నపము విని విసుగుకొనక "వెన్న" ఆరగించు స్వామీ అని వేడుకొంటున్నారు. గతంలో కళలు రేచుట వంటి మాటలకు నిఘంటువుల్ని పట్టుకొని వ్రేలాడేవాడిని. కాని నేడు ఆ స్వామికృపవలన అన్నమయ్య భావన దీపనమవుతున్నది. నేను నిమిత్తమాత్రుడనే. అంతా స్వామి దీపనమే.

**భావ దీపిక :**

ఓతిరువేంకగళప్పా! "కోన" గ్రామానికి వచ్చి మేము చేస్తున్న విన్నపములను వినవయ్యా! మాపై వేసరకుమయ్య! (విసుగుకొనకు స్వామీ!) వెసనున్ననుందును (నీకు రాచకార్యాలు యెప్పుడూ వుండేవే? స్థిమితంగా 'వెన్న' నారగించవయ్యా!. ఏమా తొందర స్వామీ? చూడు, నీకొప్పు జారిపోతోంది. ఓ కోనవేంగళప్పా! అంతలోనే యెవ్వతో నిన్నిట్లా చేసిందా యేమిటి? నీ అధరాన్ని యెవ్వతో పీల్చిపిప్పి చేసిందా? ప్రేమగా చేసినా నీకు దప్పిక కలుగకమానదు. పోనీ కొంచెం కర్పూరం పలుకులు వేసికొనరాదా? గోరుమేననున్నదయ్యా! (నీ శరీరం మీద గోటి గీతలు కనబడుతున్నాయి.) ఓ కోనతిరువేంగలప్పా! ఈవిధంగా నిన్నెవతె చేసింది స్వామీ? తన కుచములతో నిన్నెంతగట్టిగా వత్తినదో కాని, నీఒంటినిండా చెమటలే. కొంచెం విసిరించుకోరాదా స్వామీ? కొంచినానకుండును (లేకపోతే చెమటలు ఆరిపోవు). ఓ కోనతిరువేంగళప్పా! నీలో శృంగారకళాస్థానములు అతిశయించివున్నవి. నిన్నిట్లు చేసినది యెవ్వతె స్వామీ? స్వాభావికంగా నీవు వేడుకకాడవు. శ్రీవేంకటేశ్వరుడవు. నాకు తాంబూలమిచ్చి చికాకుపడక ప్రశాంతంగా వుండుము ప్రభూ!

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 శ్రీమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళాశాసనపరైర్మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వై రాచార్యైఃసత్కృతాయాస్తు మంగళమ్

శ్రీ పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః



రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




పిలవండి : **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

పుట్టింది : **9-6-1945**

చదివింది : ఎం.టెక్.

ఉండేది : ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,
సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.

రంథి : భగవన్నామ సంకీర్తన

నచ్చింది : శాస్త్రీయ సంగీతం

నచ్చంది : నక్కజిత్తులు

మెచ్చింది : సజ్జన సాంగత్యం

రింగండి : 00919393021360

చదవండి : www.geetadeksha.com

ఇవ్వండి : e-mail : geetadeksha@gmail.com